www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 1-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 184 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తిథి: నవమి రా.7.01 తదుపరి దశమి, నక్షత్రం: పూర్వాషాఢ ఉ.8.06 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: సా.4.28-6.08, దుర్ముహూర్తం: ఉ.11.41-12.28, అమృతఘడియలు: రా.2.31-4.11, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.08, సూర్యాస్తమయం: 6.00 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రా యువతిపై తమిళ ఖాకీల అత్యాచారం

ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణం
దర్శనానికి వెళ్తున్న అక్కాచెల్లెళ్లను వాహనంలో నుంచి దింపి బైక్‌పై తీసుకెళ్లిన ఇద్దరు కానిస్టేబుళ్లు
అక్కను బెదిరించి చెల్లిపై అత్యాచారం
నిందితులు సుందర్, సురేశ్‌రాజ్ అరెస్ట్
రిమాండ్ విధించిన స్థానిక కోర్టు 11


హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మ సంబురాలు

సీటుకు ముగ్గురు

జడ్పీటీసీ అభ్యర్థుల ప్రాథమిక జాబితా సిద్ధం చేయండి

ఆశావహుల గుణగణాలు, పరపతిని పరిశీలించండి

- ఐదో తేదీ కల్లా టీపీసీసీకి జాబితాలు పంపండి
- అర్హులైన అభ్యర్థులను పీసీసీ ఎంపిక చేస్తుంది
- స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- జనాభా ప్రాతిపదికన కంప్యూటర్ల కంట్రోల్‌లో రిజర్వేషన్ల ఖరారు!
- కొడంగల్ నుంచీ ఫిర్యాదులొచ్చాయి
- ఈ విషయంలో ఏం చేయలేమని వ్యాఖ్య
- ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక డీసీసీ స్థాయిలోనే



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక దృష్టి సారించింది. జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు పెద్ద సంఖ్యలో ఉన్న నేపథ్యంలో... ఒక్కో స్థానానికి ముగ్గురితో ప్రాథమికంగా ఓ జాబితాను సిద్ధం చేయాలని నిర్ణయించింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రుల నుంచి వచ్చిన ఆ జాబితాలను పరిశీలించి జడ్పీటీసీ అభ్యర్థిని టీపీసీసీ ఖరారు చేయనుంది. స్థానిక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల

మిగతా 13వ పేజీలో...



నామినేటెడ్ పదవుల భర్తీకి

కోడ్ దెబ్బ

- నవంబరు 11 దాకా అమల్లో ఎన్నికల నియమావళి
- ఆపై మునిసిపల్ ఎన్నికల కోడ్!
- ఈ ఏడాదిలో పదవుల భర్తీ అనుమానమే 13
- ఆశావహులకు మరికొంత కాలం ఎదురుచూపులే!
- డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ కూడా వాయిదా?

సాధారణం 740 మి.మీ.

నైరుతిలోనే 988!

దంచికొట్టిన వానలు

- 4 నెలల్లోనే వార్షిక సగటు కన్నా ఎక్కువ
- ఏడాది సాధారణ వర్షపాతం 923 మి.మీ
- ఇంకా నిష్క్రమించని రుతుపవనాలు
- 2 వారాల్లో తిరోగమిస్తాయి: శాస్త్రవేత్తలు
- బంగాళాఖాతంలో వాయుగుండం
- నేడు, రేపు రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు
- జలవిద్యుత్ ఉత్పత్తిలోనూ రికార్డులు
- 2 నెలల్లోనే 4,062 మిలియన్ యూనిట్లు
- సాగర్‌లో ఏడాది లక్ష్యం ఇప్పటికే చేరిక

హైదరాబాద్/నాగార్జునసాగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది నైరుతిలో వానలు దంచికొట్టాయి. నాలుగు నెలల వ్యవధిలోనే ఏడాది సగటు వర్షపాతం కన్నా ఎక్కువగా నమోదైంది. నైరుతి రుతుపవనాల ద్వారా జూన్ నుంచి సెప్టెంబరు వరకు సాధారణ వర్షపాతం 740.6 మి.మీ.గా వాతావరణశాఖ నిర్ణయించింది. వార్షిక సగటు వర్షపాతం 923.8 మి.మీ. ఉంటుందని తెలిపింది. అయితే నైరుతిలోనే ఏకంగా 988.3 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఇది నైరుతి రుతుపవనాల సగటుతో పోలిస్తే 247.7 మి.మీ అధికం. వార్షిక సగటుతో పోలిస్తే 64.5 మి.మీ అధికంగా నమోదైంది. జూన్ 1న మొదలైన వానాకాలం సీజన్ సెప్టెంబరు 30తో ముగిసింది. నాలుగు నెలల వానాకాలం తర్వాత సాధారణంగా అక్టోబరు 1 నుంచి శీతాకాలం



మిగతా 14వ పేజీలో...

హమాస్‌కు డెడ్‌లైన్

శాంతి ప్రణాళికపై 3-4 రోజుల్లో స్పందించాలి

- లేదంటే వారి కథ విషాదాంతమే
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- 'గాజా' శాంతి ప్రణాళికను స్వాగతించిన ప్రధాని మోదీ
- ఎనిమిది అరబ్, ముస్లిం దేశాలు కూడా..

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్... హమాస్‌కు డెడ్‌లైన్ విధించారు. తాను ప్రతిపాదించిన 20 సూత్రాల శాంతి ప్రణాళికపై స్పందిచేందుకు హమాస్‌కు మూడు నుంచి నాలుగు రోజులు గడువు ఇస్తున్నానని

మిగతా 2వ పేజీలో...


తిలక్ వర్మకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

చెప్పలేని భాషలో

పాక్ స్లెడ్జింగ్

నా ఏకాగ్రతను దెబ్బతీయాలని చూశారు

- నేను ఆవేశపడి ఒక్క చెత్త షాట్ ఆడినా ఫలితం తారుమారయ్యే ముప్పు.. అందుకే సంయమనం పాటించా
- తొలుత ఒత్తిడికి లోనైనా.. పట్టుదలగా ఆడా
- ఆరునూరైనా దేశాన్ని గెలిపించాలనుకున్నా 12
- నా రెండు టీ-20 సెంచరీల కన్నా ఈ 69 పరుగులు మిన్న
- పాకిస్థాన్‌ను ఓడించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను
- దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించాలనేది నా కల
- నేను ఆరాధించే కోహ్లీతో పోలికను గౌరవంగా భావిస్తున్నా
- ఆయన అడుగుజాడల్లో నడుస్తా.. 'ఆంధ్రజ్యోతి'తో తిలక్ వర్మ



68.5 లక్షల ఓట్లు తొలగింపు

- బిహార్‌లో ఓటర్ల తుది జాబితా వెల్లడి
- కొత్తగా 21.53 లక్షల ఓటర్ల నమోదు
- మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు 2

'జూబ్లీహిల్స్'లో 3.99 లక్షల ఓటర్లు


- నియోజకవర్గ తుది ఓటరు జాబితా విడుదల
- పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ భేటీ 13

రాష్ట్రంలోనే విదేశీ విద్య!

ఆఫ్‌లైన్ క్యాంపస్‌ల ఏర్పాటుకు 5-6 వర్సిటీల ఆసక్తి

- అనుమతులు, ఇతర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- కేంద్ర ప్రభుత్వంతోనూ సమాలోచనలు
- లండన్‌లోని ఓ ప్రముఖ వర్సిటీకి 'పైగా' ప్యాలెస్ లేదా న్యాక్ భవనాన్ని ఇచ్చే యోచనలో రాష్ట్ర సర్కారు
- 14 విదేశీ యూనివర్సిటీలకు యూజీసీ అనుమతులు

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాభ్యాసం కోసం దేశం నుంచి ఏటా 4.5 లక్షల మంది విదేశాలకు వెళ్తున్నారని ఓ అంచనా. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సంఖ్య కూడా



అధికమే. అయితే, రానున్న రోజుల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం విదేశాలు వెళ్లాల్సిన పని లేకుండా ఆయా వర్సిటీలతో ఇక్కడే ఆఫ్‌లైన్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయించేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు లండన్, అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా, కెనడా వంటి దేశాల్లోని ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలతో సంప్రదింపులు

మిగతా 10వ పేజీలో...

భారత ఔషధాలపై సుంకాలు ఎత్తేసిన చైనా

» 30 శాతంగా ఉన్న దిగుమతి సుంకం పూర్తిగా తొలగింపు

» అమెరికా నిర్ణయాల వేళ భారత ఫార్మా రంగానికి ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అమెరికా సుంకాల బాదుడు నేపథ్యంలో భారత ఫార్మా రంగానికి ఊరటనిచ్చేలా చైనా కీలక ప్రకటన చేసింది. భారత్ నుంచి తమ దేశానికి దిగుమతయ్యే ఔషధాలపై దిగుమతి సుంకాన్ని పూర్తిగా ఎత్తేసింది. భారత్ నుంచి వచ్చే ఔషధాలపై ఇన్నాళ్లూ 30% దిగుమతి సుంకాన్ని వసూలు చేసిన చైనా ఇప్పుడు దానిని సున్నా చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో భారత ఫార్మా పరిశ్రమలు ఎలాంటి దిగుమతి సుంకాలు చెల్లించకుండానే తమ ఉత్పత్తులను చైనాకు ఎగుమతి చేసుకోవచ్చు. తమ దేశానికి దిగుమతయ్యే బ్రాండెడ్ ఔషధాలపై 100% దిగుమతి సుంకం విధిస్తామని అమెరికా ప్రకటించిన నేపథ్యంలో చైనా తీసుకున్న ఈ నిర్ణయం భారత ఫార్మా రంగానికి కొత్త శక్తినిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చైనా నిర్ణయంతో భారత ఫార్మా రంగం మరింత విస్తరించనుందని, అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్ మార్కెట్ రూపరేఖలు మారనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రపంచానికే ఫార్మసీగా పేరొందిన భారత్ నుంచి అందుబాటు ధరల్లో ఉండే జనరిక్ ఔషధాలు, టీకాలు పెద్ద ఎత్తున ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి అవుతుంటాయి. దిగుమతి సుంకాలు అధికంగా ఉండడంతో ఇన్నాళ్లూ భారత ఫార్మా పరిశ్రమలు చైనాలో పరిమిత స్థాయిలో వ్యాపారం చేసేవి. ఇప్పుడు దిగుమతి సుంకాలు పూర్తిగా ఎత్తేయడంతో ప్రపంచంలోని రెండో అతి పెద్ద ఫార్మాస్యూటికల్ మార్కెట్ అయిన చైనాలో భారత పరిశ్రమలు ధర, నాణ్యత అంశాల్లో ఇతరులతో పోటీ పడే అవకాశం ఏర్పడింది. చైనా తీసుకున్న విధానపరమైన నిర్ణయం భారత్, చైనా మధ్య వాణిజ్య సంబంధాల్లో సమతుల్యత తీసుకువస్తుందని, నూతన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని ఫార్మా పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

లద్దాఖ్‌ను దగా చేసిన మోదీ సర్కార్

» పోలీసు కాల్పులపై న్యాయ విచారణ జరిపించాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: లద్దాఖ్‌ను మోదీ సర్కారు దగా చేసిందని కాంగ్రెస్ విమర్శించింది. హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఉద్యమకారులపై పోలీసులు జరిపిన కాల్పులపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. పోలీసు కాల్పుల్లో నలుగురు మరణించారని, అందులో ఒకరు కార్గిల్ పోరాట వీరుడు ఉండడం మరింత విషాదకరమని పేర్కొంది. కార్గిల్‌లో యుద్ధంలో పాల్గొన్న సెవాంగ్ థార్చిన్ ప్రాణాలు కోల్పోయారని, ఆయన తండ్రి కూడా మాజీ సైనికుడేనని తెలిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో థార్చిన్ తండ్రి వీడియోను పోస్టు చేశారు. లద్దాఖ్ విషాదం దేశమంతటికీ విషాదమని పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణ అమెరికా పర్యటనలో ఉన్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా సామాజిక మాధ్యమాల్లో థార్చిన్ తండ్రి వీడియో పోస్టు చేశారు. 'తండ్రి సైన్యంలో పని చేశారు. కుమారుడు కూడా సైనికుడే. దేశభక్తి వారి రక్తంలో ఉంది. కానీ బీజేపీ ప్రభుత్వం భారత మాత వీర కుమారుడిని కాల్చి చంపింది. కారణం..లద్దాఖ్ హక్కుల కోసం నిలబడడమే. బాధతో నీరు నిండిన ఆ తండ్రి కళ్లు ఒకే ప్రశ్న అడుగుతున్నాయి...దేశ సేవకు ఇదా ప్రతిఫలం అని..' అంటూ హిందీలో పోస్టు పెట్టారు.

బీజేపీ సీనియర్ నేత విజయ్ కుమార్ మల్హోత్రా కన్నుమూత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ విజయ్ కుమార్ మల్హోత్రా(93) మంగళవారం ఉదయం ఢిల్లీలో కన్నుమూశారు. కొంతకాలంగా వయసు సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఎయిమ్స్‌లో చికిత్స పొందారు. బీజేపీకి ఒకప్పుడు ఢిల్లీలో పెద్దదిక్కుగా వ్యవహరించిన ఆయన, తన రాజకీయ జీవితంలో పలు కీలక స్థానాల్లో సేవలందించారు. ఐదు సార్లు ఎంపీగా, రెండు సార్లు ఢిల్లీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనిచేశారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై పోటీ చేసి గెలవడం ఆయన రాజకీయ జీవితంలో ముఖ్య ఘట్టంగా నిలిచింది. 2008 ఢిల్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ, ఆ ఎన్నికల్లో షీలా దీక్షిత్ నేతృత్వంలోని కాంగ్రెస్ విజయం సాధించింది. ప్రజల సందర్శనార్థం మల్హోత్రా పార్థివ దేహాన్ని బుధవారం ఢిల్లీలోని పండిత్ మార్గ్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో ఉంచనున్నారు. మల్హోత్రా మృతి పట్ల ప్రధాని మోదీ, ఉపరాష్ట్రపతి సీపీ రాధా కృష్ణన్, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సంతాపం వ్యక్తం చేశారు.

పాక్‌లోని క్వెట్టాలో కారుబాంబు పేలుడు

» 14 మంది మృతి.. 32 మందికి గాయాలు

క్వెట్టా/పెషావర్, సెప్టెంబరు 30: పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్ రాజధాని క్వెట్టా నగరంలో సంభవించిన భారీ కారుబాంబు పేలుడులో 14 మంది మరణించారు. 32 మందికి పైగా గాయపడ్డారు. మంగళవారం ఫ్రాంటియర్ కాన్‌స్టాబ్యులరీ (పారామిలిటరీ) దళాల ప్రధాన కార్యాలయం సమీపంలో ఈ దాడి జరిగింది. పేలుడు అనంతరం కాల్పుల శబ్దం కూడా వినిపించడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు ధాటికి సమీపంలోని ఇళ్లు, భవనాల కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న రెస్క్యూ బృందాలు, పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ఈ పేలుడుకు సంబంధించి ఇప్పటివరకు ఏ గ్రూపు బాధ్యత వహించలేదు. మరోవైపు.. పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన రెండు వేర్వేరు బాంబు పేలుళ్ల ఘటనల్లో నలుగురు మిలిటెంట్లు సహా తొమ్మిది మంది మరణించారు. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న సౌత్ వజీరిస్థాన్ జిల్లాలో మంగళవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి.

తొలిసారి లైంగిక సంపర్కం పేరిట

వాట్సాప్ గ్రూపులో పోస్టు

» రూ.20 లక్షలకు బాలిక విక్రయానికి యత్నం

» దుశ్చర్యకు పాల్పడిన దంపతుల అరెస్టు

బెంగళూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తొలిసారి లైంగిక సంపర్కం పేరిట వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టి మరీ పన్నెండేళ్ల బాలికను విక్రయానికి ఉంచిన దంపతులకు బేడీలు పడ్డాయి. బెంగళూరుకు చెందిన శోభ, తులసికుమార్ దంపతులు మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బాలికను విక్రయానికి ఉంచారు. రూ.20 లక్షలు ఇచ్చినవారికి బాలికను అప్పగిస్తామని వాట్సాప్ గ్రూపులో పోస్టు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మైసూరుకు చెందిన ఒడనాడి సేవా సంస్థ ప్రతినిధులు వారిని సంప్రతించారు. తాము రూ.20 లక్షలు ఇచ్చేందుకు సిద్ధమని, బాలికను మైసూరుకు తీసుకురావాలని సూచించారు. వారు అంగీకరించగానే బెంగళూరులోని విజయనగర పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, సంస్థ ప్రతినిధులు జాయింట్ ఆపరేషన్ చేశారు. పోలీసులు ఆ దంపతులను అరెస్టు చేశారు.

విరిగిపడిన ఆర్చ్ దిమ్మెలు.. 9 మంది దుర్మరణం

» ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం పనుల్లో ప్రమాదం

చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చెన్నై సమీపంలోని ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనుల్లో ప్రమాదం సంభవించింది. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు విరిగిపడి తొమ్మిది మంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. బాధితులంతా అసోం రాష్ట్ర వాసులని పోలీసులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో నాల్గవ యూనిట్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో వెయ్యి మందికి పైగా కార్మికులు పాల్గొంటున్నారు. ఆర్చ్ నిర్మాణ పనుల్లో 30 మంది కార్మికులు ఉన్నారు. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు మంగళవారం సాయంత్రం హఠాత్తుగా కూలాయి. ఆ దిమ్మెలు 20 మంది కూలీలపై పడటంతో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన వారిని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో నలుగురు చనిపోయారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. కాగా, మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.

అఫ్ఘానిస్థాన్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం!

» దేశవ్యాప్తంగా మొబైల్ సర్వీసులూ బంద్

» అనైతిక కార్యకలాపాలను నిరోధించే పేరుతో తాలిబన్ సర్కార్ కఠిన చర్యలు

కాబూల్/ఇస్లామాబాద్, సెప్టెంబరు 30: తాలిబన్ల పాలనలోని అఫ్ఘానిస్థాన్‌లో దేశవ్యాప్తంగా దాదాపు అన్ని మొబైల్ ఫోన్లు మూగబోయాయి. ఇంటర్నెట్ సదుపాయం బంద్ అయింది. దేశంలో అనైతిక కార్యకలాపాలను నిరోధించేందుకు తాలిబన్ ప్రభుత్వం చేపట్టిన చర్యలే ఇందుకు కారణం! దేశవ్యాప్తంగా సోమవారం నుంచి మొబైల్ ఫోన్ సర్వీసులు, ఇంటర్నెట్ నిలిచిపోగా.. మంగళవారం కూడా కొనసాగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ పేమెంట్లు, విమాన సర్వీసులు, ఆన్‌లైన్ విద్య వంటి వాటిపై ప్రభావం పడింది. ఈ షట్‌డౌన్ తదుపరి నోటీసులు వచ్చే వరకు అమల్లో ఉంటాయని ఒక ప్రభుత్వాధికారి పేర్కొన్నట్లు ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ నివేదించింది. అయితే సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన ఇంటర్నెట్ షట్‌డౌన్‌కు తాలిబన్ ప్రభుత్వం అధికారికంగా కారణంగా చెప్పాల్సిఉంది. తాలిబన్లు సెప్టెంబరు మధ్య నుంచే ఇంటర్నెట్‌పై నియంత్రణ చర్యలు చేపట్టారు. వీటి ప్రభావం టెలిఫోన్ సేవలపై కూడా పడింది. కాగా, దేశవ్యాప్త ఇంటర్నెట్ షట్‌డౌన్ నేపథ్యంలో అఫ్ఘాన్‌లో ప్రధానమైన కాబూల్ విమానాశ్రయం స్తంభించిపోయింది. రాజధానిలోని ఎయిర్‌పోర్టు దాదాపు నిర్మానుష్యంగా కనిపించింద ని, ఇక్కడకు వచ్చే లేదా ఇతర చోట్లకు వెళ్లే విమానాలు కనిపించలేదని స్థానికుడు ఒకరు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంటర్నెట్, టెలీ కమ్యూనికేషన్ సేవలను పునరుద్ధరించాలని అఫ్ఘానిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి మిషన్ తాలిబన్ ప్రభుత్వాన్ని కోరింది.

మనమే రూటు మారుద్దాం!

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుతో భారత్‌లోని జీసీసీలవైపు అమెరికా దిగ్గజ కంపెనీల చూపు

» ఇక్కణ్నుంచీ కార్యకలాపాలను పెంచే ప్రణాళికలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: అనుకున్నదే అవుతోంది. భారత్‌ను బెదిరించడానికో.. లేక నిజంగానే అమెరికాను మళ్లీ గొప్పదేశంగా నిలపడానికో.. అమెరికన్లకే ఎక్కువగా ఉద్యోగాలు రావాలనే ఉద్దేశంతోనో.. హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం బెడిసికొడుతున్నట్టు కనిపిస్తోంది! ఎందుకంటే.. వ్యాపారాలకు సెంటిమెంట్లు కాదు.. లాభాలే ముఖ్యం. ఈ క్రమంలోనే.. చాలావరకూ అమెరికా కంపెనీలు ఈ అడ్డంకిని అధిగమించేందుకు దారులు వెతుకుతున్నాయి. 'ట్రంప్ ఇక్కడికి ఉద్యోగుల్ని రానివ్వకపోతే.. మనమే ఉద్యోగులు ఎక్కువగా దొరికే చోటుకు వెళ్దాం' అనుకుంటున్నాయి. అందులో భాగంగా.. భారత్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీల) నుంచి (ఆఫ్‌షోర్) కార్యకలాపాలను క్రమంగా పెంచుతున్నాయి. గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీల్లో సగానికిపైగా.. అంటే 1700 జీసీసీలు ఒక్క భారతదేశంలోనే ఉన్నాయి. ఐటీ, కృత్రిమ మేధ నుంచి ఔషధాలు, టీకాల అభివృద్ధి దాకా ఎన్నో రంగాలకు చెందిన అంతర్జాతీయ దిగ్గజ సంస్థల గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు మనదేశంలో ఉన్నాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, పుణె, గుర్గావ్ వంటి నగరాలు ఈ జీసీసీలకు కేంద్రాలుగా ఉన్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, గోల్డ్‌మ్యాన్ శాక్స్, జేపీ మోర్గాన్, షెల్, జీఈ, సీమన్స్, బోష్ వంటి దిగ్గజ సంస్థలు మనదేశంలో పెద్ద ఎత్తున జీసీసీలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అమెజాన్‌కైతే ప్రపంచంలోనే అతిపెద్ద జీసీసీ మనదేశంలోనే (అమెజాన్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్) ఉంది. జీసీసీలంటే కేవలం ఔట్‌సోర్సింగ్ కేంద్రాలు కావు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ నుంచి అత్యంత అధునాతన పరిశోధనల దాకా అన్ని కార్యకలాపాలూ జరుగుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే.. అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలను నిరంతరాయంగా నిర్వహించుకోవడానికి కంపెనీలు ఏర్పాటు చేసుకునే వ్యవస్థలివి. బెంగళూరులో అత్యధికంగా ఐటీ జీసీసీలు ఉండగా.. హైదరాబాద్‌లో టెక్నాలజీ, డేటా, ఏఐ కంపెనీలకు సంబంధించిన జీసీసీలున్నాయి. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు కలిగిన సిబ్బంది దొరకడం భారత్‌లో సులువు కాబట్టే కంపెనీలు వాటిని ఇక్కడ ఏర్పాటుచేస్తున్నాయి. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో.. ఇప్పుడా కంపెనీలన్నీ తమ కార్యకలాపాలను ఈ జీసీసీల ద్వారా మరింత విస్తరించుకునే ప్రణాళికల్లో ఉన్నాయని డెలాయిట్ ఇండియాకు చెందిన రోహన్ లోబో తెలిపారు. నిజానికి ట్రంప్ హెచ్1బీ వీసా ఫీజుల పెంపు నిర్ణయంతో సంబంధం లేకుండానే భారత్‌లోని జీసీసీల సంఖ్య భారీగా పెరుగుతుందనే అంచనాలు ఉన్నాయని.. 2030 నాటికి ప్రపంచంలోని 2200 కంపెనీల జీసీసీలు ఇండియాలో ఏర్పాటవుతాయని, జీసీసీ మార్కెట్ విలువ 10 వేలకోట్ల డాలర్లకు (దాదాపు రూ.9 లక్షల కోట్లకు) చేరుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో అది ఇంకా జోరందుకునే అవకాశం ఉందని వారు విశ్లేషిస్తున్నారు.

ఫిబ్రవరిలోగానే హెచ్-1బీలో గణనీయ మార్పులు

» లాటరీ విధానంతో వారిని తెచ్చుకోవడం ఏంటి?

» అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ వ్యాఖ్యలు

న్యూయార్క్, సెప్టెంబరు 30: హెచ్1బీ వీసాలపై అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 ఫిబ్రవరిలోగానే హెచ్1బీ వీసాల జారీ ప్రక్రియలో పలు గణనీయమైన మార్పులు ఉంటాయని వెల్లడించారు. చౌకైన టెక్ నిపుణుల కోసం ఈ వీసాలు జారీ చేయడం అనే ఆలోచన తప్పు అని, వారితో పాటు వారి కుటుంబాలు కూడా దేశంలోకి వస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ వీసాల జారీ ప్రక్రియపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్1బీలో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. న్యూస్‌నేషన్ మీడియాతో లుట్నిక్ మాట్లాడుతూ, కొత్త నిబంధనలు ఫిబ్రవరి 2026 నుంచి అమల్లోకి వచ్చే లోగానే పలు గణనీయమైన మార్పులు ఉంటాయని, వీసా ల జారీలో పలు వైవిధ్యమైన మార్పులు చూస్తారని చెప్పారు. లక్ష డాలర్ల ఫీజుతోనైనా వీసాదారులతో దేశం నిండిపోకుండా ఉండాలన్నారు. నైపుణ్యం ఉన్న వాళ్లని లాటరీ విధానంతో తెచ్చుకోవ డం ఏంటని ప్రశ్నించారు. ఆ విధానంలోనూ మార్పులు ఉంటాయన్నారు. హెచ్1బీ కేవలం టెక్ నిపుణుల కోసమే ఉన్నట్లుందని, వాటిలో 74% వారే ఉన్నారని వివరించారు. డాక్టర్లు, విద్యానిపుణులు కేవలం 4% మాత్రమే ఉన్నట్లు చెప్పారు. ఉన్నత డిగ్రీలున్న డాక్టర్లు, విద్యానిపుణులు ఎక్కువగా రావాల్సి ఉందన్నారు. కానీ కంపెనీలు ఇంజనీర్లను మాత్రమే నియమించుకోవాలని అనుకుంటే అధిక జీతం పొందే వారిని మాత్రమే తెచ్చుకోవాలని లుట్నిక్ స్పష్టం చేశారు.

లోకం తీరు



హమాస్‌కు డెడ్‌లైన్

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'హమాస్ ఒప్పుకుంటుందా సరే.. లేదంటే వారి కథ విషాదాంతమే అవుతుందని హెచ్చరించారు. గాజా యుద్ధానికి ముగింపు పలికేందుకు ట్రంప్ ఈ ప్రణాళికను ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. హమాస్ ఆయుధాలను వదిలేయడం, 72 గంటల్లో బందీలను విడిచిపెట్టడం, గాజా నుంచి ఇజ్రాయెల్ దశలవారీగా వైదొలగడం, గాజా పునర్నిర్మాణానికి చర్యలు ట్రంప్ ప్రణాళికలో ప్రధాన ప్రతిపాదనలు. ఈ ప్రణాళికను శ్వేతసౌధంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు సమక్షంలో ట్రంప్ ప్రకటించారు. దీనికి ఇప్పటికే ఇజ్రాయెల్‌తో పాటు అరబ్, ముస్లిం దేశాలు అంగీకరించాయని, హమాస్ స్పందనకోసం ఎదురుచూస్తున్నామని ట్రంప్ తెలిపారు. అయితే ట్రంప్ ప్రణాళికపై అధ్యయనం చేసిన తర్వాత స్పందిస్తామని హమాస్ ప్రకటించింది. ట్రంప్ డెడ్‌లైన్ విధించకముందు హమాస్ ప్రకటన వెలువడింది. ఇదిలా ఉండగా.. ట్రంప్ ప్రణాళికను ప్రధాని మోదీ స్వాగతించారు. అది పశ్చిమాసియాలో శాంతి నెలకొనడానికి బాట వేయడంతో పాటు పాలస్తీనా, ఇజ్రాయెల్ ప్రజల భద్రతకు, అభివృద్ధికి దోహదపడుతుందని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. అన్ని భాగస్వామ్య పక్షాలు ట్రంప్ వెనక కలసికట్టుగా నిలబడతాయని, యుద్ధానికి ముగింపు పలికేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నానికి మద్దతు పలుకుతాయని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ స్పందనపై ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ హర్షం వ్యక్తం చేశారు. ట్రంప్ ప్రణాళికతో భారత్ వంటి దేశాలు తమ ప్రాంతంలో పునర్నిర్మాణ కార్యకలాపాలు చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. మరోవైపు, 8 అరబ్, ముస్లిం దేశాలు కూడా ట్రంప్ ప్రణాళికను స్వాగతించాయి. ఈ మేరకు జోర్డాన్, ఖతార్, యూఏఈ, ఇండోనేషియా, పాకిస్థాన్, తుర్కియే, సౌదీ, ఈజిప్టు విదేశాంగ మంత్రులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో అమెరికాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ట్రంప్ కృషి విజయవంతం కావాలని ఆశిస్తున్నట్లు రష్యా తెలిపింది. గాజా యుద్ధంలో ఇప్పటికే 66 వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

ఆ 14 మంది చిన్నారుల మృతికి మెదడువాపు వ్యాధే కారణమా?

» తీవ్ర జ్వరం, కిడ్నీల వైఫల్యంతో మరణాలు

» ఏఈఎస్‌గా అనుమానిస్తున్న నిపుణులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: ఇటీవల మహారాష్ట్రలోని నాగపూర్, మధ్యప్రదేశ్‌లోని చింద్వారా ప్రాంతంలోని ఆస్పత్రుల్లో చేరిన 15 ఏళ్లలోపు చిన్నారుల్లో 14 మంది మృతిచెందడం తీవ్ర చర్చనీయాంశమైంది. తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరిన కొన్ని గంటల్లోనే వారి ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. కొందరు స్పృహ కోల్పోయారు. చాలామందికి కిడ్నీలు ఫెయిలయ్యాయి. దీంతో వారిని వెంటిలేటర్‌పై ఉంచి డయాలసిస్ చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో చింద్వారాలోని గ్రామీణ ప్రాంతమైన పరాసియా నుంచి వచ్చిన ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారంతా 3 నుంచి 10 ఏళ్లలోపు వారే. కాగా, ఈ మరణాలకు అక్యూట్ ఎన్సెఫాలిటిస్ సిండ్రోమ్ (ఏఈఎస్) కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. మెదడు అకస్మాత్తుగా వాపునకు గురైనప్పుడు లేదా పనిచేయడం ఆగిపోయినప్పుడు ఏఈఎస్‌గా భావిస్తారు. అయితే ఈ ప్రాంతంలో ఈ తరహా మరిన్ని కేసులు వెలుగు చూస్తుండడంతో జాతీయ బృందాలు రంగంలోకి దిగాయి. చింద్వారా ప్రాంతాన్ని ప్రస్తుతం హై అలర్ట్ జోన్‌గా ప్రకటించారు. కాగా, బాధితులకు నిర్వహించిన సెరెబ్రోస్పానియల్ ఫ్లూయిడ్ (సీఎస్ఎఫ్), రక్త పరీక్షల్లో ఏఈఎస్‌కు కారణమయ్యే బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్లు ఏమీ కనిపించలేదు. దీంతో జ్వరాల వ్యాప్తికి సరైన కారణాన్ని నిర్ధారించేందుకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (పుణె), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) బృందాలను ఇక్కడకు పంపారు.

68.5 లక్షల ఓటర్ల తొలగింపు

» బిహార్‌లో ఓటర్ల తుది జాబితా వెల్లడి

» కొత్తగా 21.53 లక్షల ఓటర్ల నమోదు

» మొత్తం ఓటర్ల సంఖ్య 7.42 కోట్లు



న్యూఢిల్లీ/పట్నా, సెప్టెంబరు 30: వచ్చే నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) దాదాపు 68.5 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించింది. గత జూన్ 24న 7.89 కోట్ల మంది ఓటర్లుండగా, మంగళవారం ప్రకటించిన తుది జాబితాలో 7.42 కోట్ల మందే ఉన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తుది జాబితాలోనూ మరో 3.66 లక్షల మంది పేర్లను తొలగించడంతోపాటు కొత్తగా 21.53 లక్షల మందిని జత చేసింది. కేంద్రంలోని అధికార బీజేపీ ఆదేశాల మేరకే బిహార్‌లో పౌరసత్వ తనిఖీ తరహాలో ఎస్ఐఆర్ నిర్వహిస్తోందని విపక్షాలు దుమ్మెత్తిపోశాయి. కానీ, ప్రతిపక్షాల ఆరోపణలను ఈసీ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. దీంతో పౌరసత్వ తనిఖీ తరహాలో ఎస్ఐఆర్‌ను ఈసీ నిర్వహిస్తోందని, దీనికి చట్టబద్ధత ఉందా? అని సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. కాగా, 3 నెలలు సాగిన ఎస్ఐఆర్ తర్వాత గత ఆగస్టు ఒకటో తేదీన ప్రకటించిన ఓటర్ల జాబితాలో 65 లక్షల మందిని తొలగించింది. మృతులు, శాశ్వతంగా ఇల్లు మారిన వారు, పలు చోట్ల పేర్లు నమోదు చేసుకున్న వారు, జాడ తెలియని వారి పేర్లను పోలింగ్ బూత్ స్థాయి అధికారుల నిర్ధారణతో తొలగించినట్లు ఈసీ పేర్కొంది. ఇక, ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రకటించే అనుబంధ జాబితాతో తుది ఓటర్ల జాబితాలో స్వల్పంగా మార్పులు చేర్పులుండొచ్చునని ఈసీ వివరించింది. ఎస్ఐఆర్‌లో భాగంగా ఈసీ ఆదేశాల ప్రకారం 7.89 కోట్ల మంది ఓటర్ల జాబితాలో 2003 తర్వాత ఓటర్లుగా నమోదైన వారు పౌరసత్వంతోపాటు తమ అర్హతలను రుజువు చేసే పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ చేపట్టనున్నట్లు గత జూన్ 24న ప్రకటించిన ఈసీ.. తొలుత వచ్చే నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరిగే బిహార్‌లో ప్రారంభించింది. రెండు దశాబ్దాలుగా వార్షిక ఓటర్ల సవరణ మినహా తాజా ఓటర్ల జాబితాను రూపొందించేందుకే ఎస్ఐఆర్ చేపట్టామని గత జూన్ 24న ప్రకటించింది. దీనికి శరవేగంగా పట్టణీకరణ, తరచూ వలసలు, ఓటర్లుగా నమోదైన యువజనులు, మృతుల పేర్లు నివేదించకపోవడం, విదేశీ అక్రమ వలసదారుల పేర్ల నమోదు వంటి అంశాలు కారణాలని వివరించింది. ఈసీ ఆదేశాల ప్రకారం 1987 జూలై ఒకటో తేదీ నుంచి 2004 డిసెంబర్ రెండో తేదీ మధ్య జన్మించిన ఓటర్లు.. తమతోపాటు తల్లిదండ్రుల పత్రాలు సమర్పించాలి. ఈ నిబంధనలన్నీ 1955లోని పౌరసత్వ చట్టంలోనివే కావడం గమనార్హం. ఓటర్ల పౌరసత్వ తనిఖీకి ఈసీ చేపట్టిన ఎస్ఐఆర్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. రాజ్యాంగంలోని 326వ అధికరణం ప్రకారం ప్రస్తుతం ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు వినియోగిస్తున్న ఫామ్-6 ప్రకారం పౌరసత్వ ధ్రువీకరణ అవసరం లేదు.

బిహార్ ఓటర్ల జాబితా 2025:

- **తొలగించిన పేర్లు:** 65 లక్షలు (ముసాయిదా జాబితా)
- **కొత్తగా తొలగించిన ఓటర్లు:** 3.66 లక్షలు (ముసాయిదా జాబితా ప్రకటన తర్వాత)
- **మొత్తం ఓటర్ల తొలగింపు:** 68.5 లక్షల మంది
- **కొత్తగా జత కలిసిన ఓటర్లు:** 21.53 లక్షల మంది
- **నికరంగా తగ్గిన ఓటర్లు:** 46.97 లక్షల మంది

పట్నాలో పెరిగిన 1.63 లక్షల మంది ఓటర్లు

బిహార్ రాష్ట్ర రాజధాని పట్నా జిల్లాలో కొత్తగా 1.63 లక్షల మంది ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. పట్నా జిల్లాలోని 14 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఆగస్టు ఒకటో తేదీన ప్రకటించిన 48.15 లక్షల మంది ఓటర్లకు ఇది అదనం. జిల్లాలో 22.75 లక్షల మంది మహిళా ఓటర్లు ఉండగా, డిఘా సెగ్మెంట్‌లో అధికంగా 4.56 లక్షల మంది ఉన్నారు.

కక్ష సాధించాలనుకుంటే.. నన్ను ఏమైనా చేయండి

» మా కార్యకర్తల జోలికి రావొద్దు

» తమిళనాడు సీఎం స్టాలిన్‌కు టీవీకే అధినేత విజయ్ విజ్ఞప్తి



చెన్నై, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కరూర్‌లో 41 మంది మృతి కారణమైన తొక్కిసలాట దుర్ఘటనపై 'తమిళగ వెట్రి కళగం(టీవీకే)' అధినేత విజయ్ ఎట్టకేలకు స్పందించారు. ఇలాంటి బాధాకరమైన స్థితిని తన జీవితంలో ఎన్నడూ చూసి ఎరుగనని, త్వరలోనే బాధితులను కలుసుకుంటానని చెప్పారు. కరూర్‌లో ఏం జరిగిందో ప్రజలు చూస్తూనే ఉన్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలూ బయటకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కక్ష సాధించాలనుకుంటే తనను ఏమైనా చేయాలని, కానీ తన అనుచరులను మాత్రం వదిలేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. తన రాజకీయ పయనం మరింత దృఢంగా, మరింత ధైర్యంగా కొనసాగుతుందని ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం 4 నిమిషాల 45 సెకండ్ల నిడివి కలిగిన వీడియో సందేశాన్ని విజయ్ విడుదల చేశారు. "అందరికీ నమస్కారం. నా జీవితంలో ఇలాంటి బాధాకరమైన స్థితిని చూసి ఎరుగను. హృదయమంతా ఒకటే బాధ. నామీద పెట్టుకున్న అభిమానానికి, ఆప్యాయతకు ప్రజలకు ధన్యవాదాలు. ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని మాకిచ్చిన స్థలంలోనే ప్రచారం చేశాం. ఈ విషయంలో మేమెలాంటి తప్పూ చేయలేదు. అయినా జరగకూడనిది జరిగిపోయింది" అని విజయ్ పేర్కొన్నారు. కాగా, తన అభిమాన నటుడిపై విమర్శలు రావడంతో తట్టుకోలేని టీవీకే నేత, విల్లుపురం జిల్లా వీరపట్టు గ్రామానికి చెందిన అయ్యప్పన్(50) సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నారు.

ముంబై దాడులకు ప్రతీకారం తీర్చుకుందామనుకున్నాం

» పాకిస్థాన్‌తో యుద్ధంపై ప్రధానితో చర్చించాను

» మన్మోహన్ సింగ్ కూడా సుముఖత చూపారు

» అయితే,అమెరికా ఒత్తిడికి తలొగ్గాల్సి వచ్చింది

» ఆంగ్ల చానల్‌కు చిదంబరం ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: ముంబై (26/11) ఉగ్రదాడులకుగాను పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకుందామనుకున్నాని, అమెరికా వారించడంతో ఆగామని కేంద్ర మాజీ హోంమంత్రి పి.చిదంబరం తెలిపారు. ఈ విషయమై తనను, ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఒప్పించడానికి అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి కండోలిజా రైజ్ భారత్‌కు వచ్చారని పేర్కొన్నారు. పాక్‌పై దాడులు చేయొద్దని ఆమె కోరారని, అలాగే అంతర్జాతీయంగానూ తీవ్ర ఒత్తిడి వచ్చిందని ఓ ఆంగ్ల చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చిదంబరం తెలిపారు. 2008 నవంబరు 26న ముంబైలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఉగ్ర దాడుల్లో 175 మంది మరణించారు. ఈ ఘటన జరిగిన వెంటనే అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్‌పాటిల్ రాజీనామా చేయగా, చిదంబరం ఆ బాధ్యతలు స్వీకరించారు. "యుద్ధాన్ని వారించడం కోసం ప్రపంచమంతా ఢిల్లీపై ఆనాడు వాలింది. నేను బాధ్యతలు తీసుకున్న రెండు, మూడు రోజులకు కండోలిజా భారత్‌కు వచ్చి నన్ను, ప్రధానిని కలిశారు. ఆ దాడులపై ప్రతిస్పందించొద్దని ఆమె విజ్ఞప్తి చేయగా, దీనిపై నిర్ణయం ప్రభుత్వమే తీసుకుంటుందని నేను తెలిపారు. ప్రతీకారంగా ఏదో ఒకటి చేయాలని నాకు ఉంది. ఇదే విషయం ప్రధానితోను, తత్సంబంధ వ్యక్తులతోను చర్చించాను. ప్రధాని కూడా సానుకూలంగానే స్పందించారు. పాక్‌పై ఎప్పుడు దాడులు మొదలుపెట్టాలి..ఎలా ముగించాలనేది కూడా ఆయన చర్చించారు. అయితే, విదేశాంగశాఖ, ఐఎఫ్ఎస్ గట్టిగా పట్టుబట్టడంతో ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది" అని ఆయన గుర్తుచేసుకున్నారు.

ఇప్పుడు వాపోతే ప్రయోజనమేంటి?: బీజేపీ

ముంబై దాడులపై స్పందించడంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం విదేశీ శక్తుల ఒత్తిడికి గురయి, తప్పుగా వ్యవహరించిందని బీజేపీ ఆక్షేపించింది. 'ఇప్పుడు వాపోతే ప్రయోజనమేంటి' అంటూ చిదంబరాన్ని ఉద్దేశించి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించారు.

గురుకులాలకు పెండింగ్ డైట్ చార్జీల విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకుల సొసైటీల డైట్ చార్జీల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. ఈ బకాయిలను చెల్లించకపోవడంతో దసరా సెలవుల తర్వాత గురుకులాలకు సరుకుల సరఫరాను నిలిపివేస్తామని కాంట్రాక్టర్లు జిల్లా కలెక్టర్లకు లేఖలు రాశారు. దీంతో ప్రభుత్వం కొంతమేరకు నిధులు విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీలకు కలిపి ప్రతి నెలా డైట్ చార్జీల కింద రూ.102 కోట్లకుపైగా ఖర్చవుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీకి 3 నెలల బిల్లులు, బీసీ, ఎస్టీ గురుకులాలకు రెండేసి నెలల చొప్పున, మైనారిటీ గురుకుల సొసైటీకి ఒక నెల బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

తమిళనాడు తరహాలోనే రాష్ట్రంలో బీసీ కోటా అమలు

» బీసీ నేతల ధీమా.. పొన్నం నేతృత్వంలో సమావేశం

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు తరహాలోనే తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలవుతాయని బీసీ నేతల కీలక సమావేశం ధీమా వ్యక్తం చేసింది. రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయడం, దాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్ దాఖలైన అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో ఈ సమావేశం నిర్వహించారు. మంత్రుల నివాస సముదాయంలో జరిగిన ఈ భేటీలో రిజర్వేషన్లపై న్యాయపరమైన అంశాల్లో ఎలా ముందుకెళ్లాలనే విషయంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. రిజర్వేషన్లు కల్పించే విషయంలో హైకోర్టులో గెలిచి తీరతామని బీసీ ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమిళనాడులో రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు. గవర్నర్, రాష్ట్రపతి వద్ద మూడు నెలలకు మించి బిల్లులు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేసుకోవచ్చని కోర్టు తీర్పు ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కూడా తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు అమలవుతాయనే ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీనియర్ నేత వీ హనుమంతరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకరయ్య, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మినరల్స్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

10 విదేశీ దౌత్యకార్యాలయాలకు బాంబు బెదిరింపు

చెన్నై, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని 10 విదేశీ దౌత్య కార్యాలయాలకు మంగళవారం బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్‌లో...నగరంలోని సింగపూర్, కొరియా, స్వీడన్, ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా, శ్రీలంక, బ్రిటన్, జర్మనీ, మలేసియా తదితర దేశాల దౌత్య కార్యాలయాల్లో బాంబులు ఉంచినట్లు ఆగంతకులు పేర్కొన్నారు. దీంతో పోలీసులు బాంబ్ స్క్వాడ్ నిపుణులు, జాగిలాల సాయంతో ఆయా కార్యాలయాల్లో క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. అయితే చివరికి అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల వాతావరణశాఖ, ఇన్‌కంటాక్స్ ఆఫీసు, డీజీపీ కార్యాలయాలకు కూడా బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే.

సీఎం సొంతూరు సోలార్ విలేజ్

నూరుశాతం సౌరశక్తితో నడిచే గ్రామంగా కొండారెడ్డిపల్లి.. గుజరాత్‌లోని మోదెర తర్వాత దేశంలోని రెండో గ్రామంగా ఘనత

- » ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లు
- » ఒక కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్లు
- » గ్రామస్థులకు తగ్గిన విద్యుత్ బిల్లుల బారం
- » గృహ అవసరాలు పోగా మిగిలిన విద్యుత్ విక్రయం, అదనపు ఆదాయం
- » త్వరలో వ్యవసాయానికీ సోలార్ సెట్లు


కొండారెడ్డిపల్లిలోని ఇళ్లపై సోలార్ సెట్లు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం.. నాగర్‌కర్నూలు జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి శతశాతం సోలార్ విలేజ్‌గా మారింది. పూర్తిగా సౌర విద్యుత్‌తో నడుస్తున్న కొండారెడ్డిపల్లి.. తెలంగాణలోనే తొలి సోలార్ విలేజ్‌గా రికార్డులకెక్కింది. గుజరాత్‌లోని మోదర తర్వాత 24/7 సౌర విద్యుత్ అందిస్తున్న దేశంలోని రెండో గ్రామంగా ఘనత సాధించింది. కొండారెడ్డిపల్లిలోని ప్రతి ఇంటి పైకప్పుపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయగా వాటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌నే ప్రస్తుతం గ్రామం అంతా వినియోగిస్తున్నారు. గృహ అవసరాలు పోను మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికే విక్రయిస్తున్న గ్రామ ప్రజలు అదనపు ఆదాయాన్ని కూడా పొందుతున్నారు. 200 యూనిట్ల విద్యుత్ వినియోగించిన వారికి గృహజ్యోతి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న సంగతి తెలిసిందే. కొండారెడ్డిపల్లిలో అంతా సౌర విద్యుత్‌నే వినియోగిస్తుండడంతో విద్యుత్ బిల్లుల భారం కూడా దాదాపుగా తగ్గిపోయింది.


రహదారి మధ్యలో సోలార్ వీధి దీపాలు

512 ఇళ్లకు కనెక్షన్లు

రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యాక కొండారెడ్డిపల్లిని పీఎం సూర్యఘర్ యోజన పథకానికి ఎంపిక చేయించారు. గ్రామాన్ని సోలార్ విలేజ్‌గా మార్చే ప్రాజెక్టు వ్యయం రూ.10.53 కోట్లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.3.56 కోట్లను సబ్సిడీగా అందించింది. మిగిలిన మొత్తాన్ని శ్రీ అసోసియేట్స్, అషూర్ కంపెనీలు ఖర్చు చేయగా.. టీజీరెడ్కో ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబరుల్లో పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో 512 ఇళ్లు ఉండగా.. ఏడాది వ్యవధిలోనే ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌లు, రహదారులపై సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఇంటి సామర్థ్యం, విస్తీర్ణం ప్రకారం ఒక్కో ఇంటిపై కిలో వాట్ నుంచి మూడు కిలో వాట్ల సామర్థ్యం ఉన్న ప్లాంట్లను పెట్టారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌నే ప్రజలు తమ గృహ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఈ ప్లాంట్ల ద్వారా నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా గ్రామప్రజలు ఇప్పటిదాకా దాదాపు లక్ష యూనిట్లను ప్రభుత్వానికి విక్రయించారని టీజీ రెడ్కో అధికారులు చెబుతున్నారు. ఒక్కో యూనిట్ సౌర విద్యుత్‌కు ప్రభుత్వం రూ. 5.25 ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఇప్పటివరకు లక్ష యూనిట్లను ఎగుమతి చేయగా దాదాపు రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరింది. ఏ ఇంటి ప్లాంటు నుంచి ఎంత తీసుకున్నారో దానికి సంబంధించిన మొత్తాన్ని సదరు ఇంటి యజమాని బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. గతంలో గ్రామంలో విద్యుత్ వినియోగానికి సంబంధించి నెలకు రూ.2 లక్షల వరకు బిల్లులు వచ్చేవి. ఇప్పుడు పూర్తిగా సోలార్ గ్రామంగా మారడంతో ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గిపోయింది. పైగా, సౌర విద్యుత్‌ను ఎగుమతి చేస్తుండటంతో నెలకు రూ. 6లక్షల వరకు ప్రజలకే ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

త్వరలో వ్యవసాయ కనెక్షన్లు...

ఇప్పటికే సోలార్ విలేజ్‌గా మారిన కొండారెడ్డిపల్లిలో త్వరలో వ్యవసాయానికీ సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని 100శాతం సోలార్ పంపుసెట్లు ఉన్న నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్ అచ్చంపేటలో ఇందిర సౌరగిరి జలవికాసం పథకాన్ని ప్రారంభించారు. కొండారెడ్డిపల్లిలో త్వరలో వ్యవసాయానికీ సౌర విద్యుత్ అందించేందుకు అంచనాలను టీజీ రెడ్కో అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి అందించారు. ఒక్కో పంపుసెట్ నడవాలంటే 7.5 కిలో వాట్ల సోలార్ ప్లాంటు అవసరమని అంచనా వేయగా కొండారెడ్డిపల్లిలో 941 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కసారి ఏర్పాటు చేస్తే 25 ఏళ్ల వరకు పెద్దగా నిర్వహణ ఖర్చులు లేకుండా ఉచిత విద్యుత్‌ను పొందడంతో పాటు అవసరం లేనప్పుడు ఉత్పత్తయ్యే విద్యుత్‌ను రైతులు ప్రభుత్వానికి విక్రయించుకోవచ్చు. మరోపక్క, కొండారెడ్డిపల్లిలో దేవాలయాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ప్రతి ఏటా తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో దసరా వేడుకలు జరుపుకునే సీఎం రేవంత్ రెడ్డి.. ఈసారి కూడా కొండారెడ్డిపల్లికి రానున్నారు. ఈ సందర్భంగా ఆయా అభివృద్ధి పనులను సీఎం పరిశీలించే అవకాశం ఉంది.

సోలార్‌తో మాకు ఎంతో ఉపయోగం



మా ఇంటి పైన సోలార్ పలకను ఏర్పాటు చేసి కనెక్షన్ ఇచ్చారు. విద్యుత్ ఉన్నా లేకున్నా మాకు ఇక ఇబ్బంది ఉండదు. మిగిలిన విద్యుత్‌ను విక్రయించుకునే అవకాశం ఉండటం సంతోషంగా ఉంది. మా గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- లోహిత్‌రెడ్డి, రైతు, కొండారెడ్డిపల్లి

బిల్లు భారం తగ్గి ఆదాయం వస్తుంది



ప్రభుత్వం 200 యూనిట్ల లోపు గృహ అవసరాలకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీనికి మించి ఒక్క యూనిట్ ఎక్కువైనాట బిల్లు మొత్తం చెల్లించాల్సి వస్తుంది. ఇప్పుడు సోలార్ విద్యుత్ వల్ల భారం తగ్గితుంది. మా గ్రామానికి చెందిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. గ్రామంలో ఇప్పటికే 4 లైన్ల రహదారి, గ్రంథాలయ భవనం, అభివృద్ధి పనులు చేశారు.

- వేమారెడ్డి, మాజీ ఉపసర్పంచ్, కొండారెడ్డిపల్లి

నిబంధనలు పాటించని 54 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు

» హెచ్చరికలు జారీ చేసిన యూజీసీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30 : నిబంధనలు పాటించని 54 ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం(యూజీసీ) హెచ్చరికలు జారీ చేసింది. వీటిలో అత్యధికంగా మధ్యప్రదేశ్‌లో 10 ఉండగా.. తర్వాతి స్థానాల్లో గుజరాత్, సిక్కిం, ఉత్తరాఖండ్‌లలో 8, 5, 4 చొప్పున ఉన్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతి ఉన్నత విద్యా సంస్థ తమ విద్యాసంస్థ సమగ్ర వివరాలను యూజీసీకి తనిఖీల నిమిత్తం సమర్పించాలి. అలాగే ఆ విద్యా సంస్థలోని కోర్సుల వంటి వివరాలు తెలిపే పనిచేసే వెబ్‌సైట్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. రిజిస్ట్రేషన్ లేదా లాగిన్ అవకుండానే అందులోని సమాచారాన్ని ఎవరైనా తెలుసుకొనేలా హోమ్ పేజీలో అందుబాటులో ఉంచాలి. అందులో సెర్చ్ సదుపాయం కూడా ఉండాలి. అయితే ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయాలు ఆ నిబంధనలేవీ పాటించడం లేదు. దీంతో తక్షణం దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని వాటిని యూజీసీ హెచ్చరించింది. లేని పక్షంలో తదుపరి చర్యలు తప్పవని పేర్కొంది.

విదేశీ విరాళాల నవీకరణకు 4 నెలల ముందే దరఖాస్తులు

» స్వచ్ఛంద సంస్థలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: విదేశీ విరాళాలు పొందేందుకు ఉన్న అనుమతులను నవీకరించుకోవడానికి ముగింపు తేదీకి నాలుగు నెలలు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర హోం శాఖ మంగళవారం అన్ని స్వచ్ఛంద సంస్థలను ఆదేశించింది. అంతరాయాలు లేకుండా కార్యకలాపాలు నిర్వహించుకోవడానికి గడువుకు ముందే రెన్యువల్ దరఖాస్తులు సమర్పించాలని తెలిపింది. విదేశీ నిధులు పొందే సంస్థలన్నీ విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ)-2010 కింద తప్పకుండా రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఆ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అయిదేళ్ల పాటు చెల్లుబాటు అవుతుంది. నిబంధనల ప్రకారమయితే ముగింపు తేదీకి ఆరు నెలల ముందుగా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. దీనిని పరిశీలించి నవీకరించిన సర్టిఫికెట్ ఇవ్వడానికి ప్రభుత్వం 90 రోజుల సమయం తీసుకుంటుంది. అయితే కొన్ని సంస్థలు తుది గడువుకు 90 రోజుల ముందుగా దరఖాస్తులు చేస్తుండడంతో తనిఖీలు ఆలస్యమవుతున్నాయని, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం జరుగుతోందని తెలిపింది. అందువల్ల కనీసం 4 నెలల ముందుగానయినా దరఖాస్తులు సమర్పించాలని ఆదేశించింది.

ఏఏఐ సేవలకు సర్వీసు ట్యాక్స్ వర్తింపు: సుప్రీం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: విమానాశ్రయాల్లో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చేపట్టే అన్ని రకాల సేవలకు కూడా సర్వీసు ట్యాక్స్ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏఏఐ అందించే సేవలన్నీ పన్ను పరిధిలోనే ఉంటాయని జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ పి.బి. వరాలేల ధర్మాసనం తెలిపింది. 2003-07 మధ్య అందించిన సేవలకు సర్వీసు ట్యాక్స్ చెల్లించాలని 2017లో కస్టమ్స్, ఎక్సయిజ్, సర్వీసు ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఏఏఐని ఆదేశించింది. ఎగుమతికి ఉద్దేశించిన ఎక్స్‌పోర్ట్‌కార్గో, అన్‌లోడింగ్, ఎక్స్-రే, ఎగుమతి చేసే సామగ్రి ప్యాకింగ్ తదితర అన్ని సేవలకు పన్ను చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. దీనిని సవాలు చేస్తూ, ఎగుమతికి ఉద్దేశించిన ఎక్స్‌పోర్ట్‌కార్గోకు ఫైనాన్స్ యాక్ట్-1994 ప్రకారం సేవా పన్ను వర్తించదంటూ ఏఏఐ సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. అన్ని నిబంధనలను విశ్లేషించిన ధర్మాసనం ఎక్స్‌పోర్ట్ కార్గోకు కూడా పన్ను వర్తిస్తుందని తెలిపింది. ట్రైబ్యునల్ ఆదేశాలను సమర్థించింది.

హోం ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ బాధ్యతల స్వీకరణ



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సీవీ ఆనంద్ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా పని చేసిన సీవీ ఆనంద్‌ను హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేసింది. దీంతో మంగళవారం ఉదయం హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హోంశాఖ సిబ్బందితో ఆయన భేటీ అయ్యారు. శాఖలోని వివిధ సెక్షన్ల సిబ్బంది సీవీ ఆనంద్‌ను కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అటుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఆయన మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

గూగుల్‌లో 59 లక్షల ప్యాకేజీ

» జాక్‌పాట్ కొట్టిన ఏపీలోని ఏలూరు జిల్లా అమ్మాయి


రేణుకా గంగ

ముదినేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ అమ్మాయి గూగుల్‌లో జాక్‌పాట్ కొట్టింది. ఏలూరు జిల్లాకు చెందిన దేవకోటి రేణుకా గంగ ఆ దిగ్గజ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఏడాదికి రూ. 59 లక్షల ప్యాకేజీతో మంచి చాన్స్ అందుకుంది. ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన రేణుకా గంగ, బీటెక్ ఐటీ బ్రాంచి నాల్గవ సంవత్సరంలో ఉండగానే ఆఫ్ క్యాంపస్ సెలక్షన్స్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగానికి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో అత్యధిక ప్యాకేజీతో ఎంపికైనట్లు గూగుల్ యాజమాన్యం నుంచి సెలక్షన్ ఆర్డర్ మంగళవారం రేణుకా గంగకు అందింది. ఆమె వడాలిలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి, అనంతరం వేలేరు జవహర్ నవోదయ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివింది. ఇంటర్మీడియట్ గుడివాడలోని ఒక ప్రైవేట్ కళాశాలలో పాసై ప్రస్తుతం భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. రేణుకా గంగ తండ్రి సత్యనారాయణ ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లి పద్మావతి గృహిణి.

మహిళల భద్రతకు పెద్దపీట

అమ్మాయిల జోలికి వస్తే కఠిన చర్యలు.. వైట్ కాలర్ నేరగాళ్ల భరతం పడతాం

- » బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌పై ఉక్కుపాదం.. సైబర్ క్రైం, డ్రగ్స్ మహమ్మారిపై ప్రత్యేక దృష్టి
- » ఆహార కల్తీని అరికడతాం
- » డ్రంకెన్ డ్రైవ్ ప్రమాదకరం.. ఉపేక్షించం: వీసీ సజ్జనార్
- » సిటీ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపడుతున్న వి.సి.సజ్జనార్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తానని సిటీ నూతన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అన్నారు. పోకిరీలు, ఆకతాయిలు, అల్లరిమూకలు ఎవరైనా.. మహిళలు, అమ్మాయిల జోలికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ సీపీగా మంగళవారం సజ్జనార్ బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ 18వ అంతస్తులో సీపీ కార్యాలయంలో పండితుల వేదమంత్రోచ్చరణల మధ్య బాధ్యతలు చేపట్టారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీలు జితేందర్, శివధర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ పోలీస్ శాఖ అందుబాటులోకి తెచ్చిన అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూ.. సరికొత్త ఏఐ టెక్నాలజీని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తానని అన్నారు. ఆధునిక టెక్నాలజీతో పూర్తిస్థాయిలో నేరాలకు చెక్ పెట్టేవిధంగా ప్రణాళికను సిద్ధం చేస్తామన్నారు. సిటీలో నేరాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని, నేరాలను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తానని సీపీ తెలిపారు. విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్‌తో పాటు.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామన్నారు. నేరస్తుల విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. భూ కబ్జాలు, దందాలు, మల్టీలెవల్ మోసాలతో అమాయకులను మోసం చేసి రూ.కోట్లు కొల్లగొడుతున్న ఆర్థిక నేరగాళ్ల భరతం పడతామని హెచ్చరించారు.

బెట్టింగ్ యాప్‌లపై కఠిన చర్యలు..

ప్రజలను పీడిస్తున్న బెట్టింగ్, గేమింగ్ లోన్ యాప్‌లపై ఉక్కుపాదం మోపుతామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను ఉపేక్షించేది లేదని అన్నారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టిపెడతామని, ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. సిటీలో ఆహారకల్తీ అధికంగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై కల్తీ కేటుగాళ్ల ఆటలు సాగవని అన్నారు. ఇందుకోసం స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తోపాటు మార్కెట్ ఇంటెలిజెన్స్ టీమ్‌లను రంగంలోకి దింపుతున్నట్లు చెప్పారు. పోలీస్ అధికారుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని సీపీ తెలిపారు. పోలీస్ శాఖలో ఎంతో మంది అధికారులు 24 గంటలు కష్టపడి పనిచేస్తున్నారని, అలాంటి అధికారులకు తగిన గుర్తింపుతోపాటు అవార్డులిచ్చి ప్రోత్సహించాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. వారితోపాటు పోలీసులకు సహకరిస్తూ.. విలువైన సమాచారం అందజేసే ప్రజలను కూడా గుర్తించి వారికి తగిన ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఇక యువతను నిర్వీర్యం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్థానిక, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ స్మగ్లర్లను కటకటాల్లోకి నెట్టి, దేశం నుంచి బహిష్కరిస్తామని ప్రకటించారు.

అతివలపై అఘాయిత్యాలు పైపైకి!

- » 2023లో దేశంలో 4.5 లక్షల నేరాలు
- » 2022 కంటే 3 వేల కేసులు అధికం
- » 2023లో 1.7 లక్షల ఆత్మహత్య కేసులు
- » తెలంగాణలో మహిళలపై దాడులు
- » 2023లో 86,420 సైబర్ మోసాల కేసులు
- » నేరాలు, ఘోరాలపై ఎన్‌సీఆర్‌బీ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 30: దేశంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, గృహ హింస వంటి నేరాలు ఏటికేడు పెరుగుతున్నాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) తాజా నివేదికలో వెల్లడించింది. 2022లో మహిళలపై 4,45,256 నేరాలు జరిగితే.. 2023లో ఈ సంఖ్య 4,48,211గా ఉందని పేర్కొంది. అంటే.. ఒక్క ఏడాదిలోనే 3 వేల కేసులు అధికంగా నమోదయ్యాయని తెలిపింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల ఆధారంగా ఈ వివరాలను వెల్లడించింది. ఆయా కేసుల్లో 77.6 శాతం మాత్రమే చార్జిషీట్లు నమోదయ్యాయని నివేదిక వెల్లడించింది. 2023లో రాష్ట్రాల వారీగా ఉత్తరప్రదేశ్: 66,381, మహారాష్ట్ర 47,101, రాజస్థాన్: 45,450, పశ్చిమ బెంగాల్: 34,691, మధ్యప్రదేశ్: 32,342 నేరాలు జరిగాయి. ఇక, తెలంగాణలో నేరాల రేటు 124.9 శాతంగా నమోదైంది.

దారుణాలు ఇవీ..

• గృహ హింస కేసులు: 1,33,676 • యువతుల అపహరణలు: 88,605• మహిళలపై దాడులు: 83,891 • అత్యాచారాలు: 29,670 • 18 ఏళ్లు పైబడిన వారిపై అత్యాచారాలు: 28,821. • 18 ఏళ్లలోపు వారిపై జరిగిన అత్యాచారాలు: 849. • యాసిడ్ దాడులు: 113. • వరకట్న మృతులు: 6,156. • ప్రేరేపిత ఆత్మహత్య కేసులు: 4,825 •కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసులు: 21,84,756

బలవన్మరణాలూ పెరిగాయ్!

దేశంలో బలవన్మరణాలు కూడా పెరిగాయని ఎన్‌సీఆర్‌బీ నివేదిక తెలిపింది. కుటుంబ కలహాలు, అనారోగ్యం వంటి కారణాలతో దేశవ్యాప్తంగా 2023లో 1,71,418 ఆత్మహత్యలు జరిగాయని వివరించింది. 2022తో పోల్చుకుంటే ఇవి 0.3 శాతం మేరకు పెరిగాయని తెలిపింది. మహారాష్ట్రలో అత్యధికంగా 22,687 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. 19,483 ఆత్మహత్యలతో తమిళనాడు రెండో స్థానంలో ఉంది. దేశంలో అత్యధిక సంఖ్యలో జనాభా ఉన్న యూపీలో మాత్రం ఆత్మహత్యలు తక్కువగా నమోదయ్యాయని నివేదిక వివరించింది. ఇక, ఆత్మహత్యలకు కుటుంబ కలహాలు, అనారోగ్యం ప్రధాన కారణాలే అయినా.. అప్పులు, మత్తు పదార్థాలకు బానిసలు కావడం, ప్రేమలు విఫలం కావడం, నిరుద్యోగం, పరీక్షల్లో ఫెయిల్ కావడం వంటి ఇతర కారణాలు కూడా ఉన్నాయని తెలిపింది. ఆత్మహత్యల్లో ఎక్కువగా గృహిణులు(51.6 శాతం) ఉన్నారని నివేదిక పేర్కొంది. ఆత్మహత్యలు నగరాల్లో ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపింది. తెలంగాణలో ఆత్మహత్యల రేటు 27.7గా ఉంది. అన్నదాతల ఆత్మహత్యలు కూడా 2023లో పెరిగాయని నివేదిక తెలిపింది. దేశవ్యాప్తంగా 10,700 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడగా వీరిలో 400 మందికిపైగా రైతులు మహారాష్ట్రకు చెందిన వారేనని పేర్కొంది. ఇక, మొత్తం మృతుల్లో వ్యవసాయ కూలీలు 6,096 మంది ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 8.6 శాతం మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని నివేదిక తెలిపింది.

సైబర్ నేరాలు పైపైకి!

దేశంలో సైబర్ నేరాలు 2022తో పోల్చుకుంటే 2023లో భారీగా నమోదయ్యాయని ఎన్‌సీఆర్‌బీ తెలిపింది. 2022లో 65,893 కేసులు నమోదు కాగా, 2023లో 86,420 కేసులు నమోదయ్యాయి. ఎస్టీలపై దాడులు 28 శాతం పెరిగాయి. 2023లో హత్య కేసులు 27,721 నమోదయ్యాయి. ఇక, జువైనల్ నేరాలు కూడా 2023లో పెరిగాయి. మొత్తం 31,365 కేసులు నమోదయ్యాయని పేర్కొంది. నేరాలకు పాల్పడి వారంతా 16-18 ఏళ్ల మధ్యవారేనని తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కరూర్ పాపం ఎవరిది?

'నా హృదయం ముక్కలైంది, భరించలేని బాధ నిలువునా తోడేస్తోంది, ఇంతటి ఆవేదనని జీవితంలో ఎన్నడూ అనుభవించ లేదు..' అంటూ తమిళ సినీనటుడు, టీవీకే పార్టీ అధినేత మంగళవారం నాటి వీడియో సందేశంలో తెగ వాపోయారు. ఉద్వేగాన్ని, బాధని బాగా దట్టించిన ఆ ప్రసంగంలో, ముఖ్యమంత్రి స్టాలిన్ మీద కూడా ఆయన విమర్శలు చేశారు. ప్రేమ పొంగిపొరలిన జనం తనను చూడటానికి వచ్చారని, సభ సురక్షితంగా చక్కగా జరిగి, ప్రజలు భద్రంగా ఉండాలని తాను కోరుకున్నానని, పోలీసుశాఖను అదే అభ్యర్థించానని, కానీ, కరూర్ ఘటనలో తమ తప్పు వీసమెత్తులేకున్నా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అంటూ ఆ చర్యను ఆయన తప్పుబడుతున్నారు. ఒక్క కరూర్ లోనే ఇలా ఎందుకు జరిగింది? అని ప్రశ్నించడం ద్వారా అధికారపక్షం కుట్రలే సామాన్యుల ప్రాణం పోవడానికి కారణమని చెప్పదల్చుకున్నారు. సీఎంగారూ, నాపై కక్ష తీర్చుకోవాలనుకుంటే నేరుగా నన్ను ఏదైనా చేయండి, అంతేకానీ, నా ప్రజల జోలికి వెళ్ళకండి అంటూ ప్రభుత్వ చర్యలను తప్పుబడుతున్నారు. తాను ఏ తప్పుచేయలేదనీ, తన రాజకీయ జీవితం మరింత ఉత్సాహంతో కొనసాగుతుందని కూడా ఆయన ప్రకటించాడు. ఇంతటి కష్టకాలంలో కూడా తన రాజ్యాధికార లక్ష్యాన్ని విస్మరించని విజయ్‌ను చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది.

ఆ దారుణం జరిగి మూడురోజులైనా రాజకీయం మరింత పండుతోంది. విమర్శలు, ప్రతివిమర్శలు, కుట్రసిద్ధాంతాలతో చెవులు చిల్లులుపడుతున్నాయి. మధ్యాహ్నం వస్తాడన్న విజయ్, అత్యంత ఆలస్యంగా, రాత్రి ఏడున్నరకు అక్కడకు చేరుకోవడం ఉద్దేశపూర్వకంగా జరిగిందంటున్నారు పోలీసులు. సోషల్ మీడియాలో అసలు సమయాన్ని తప్పుగా ప్రచారం చేసి, జనం కిటకిటలాడేట్టు చేయాలన్న నిర్వాహకుల ఆలోచనే ఇంతమంది ప్రాణాలు తీసిందని వారి వాదన. అనుమతి తీసుకున్న పదివేలమంది కాదు, ఏకంగా పాతికవేలమంది జమగూడినా కూడా మరింత జనాన్ని పోగేయాలన్న తాపత్రయమే తప్ప, విజయ్‌పార్టీకి ప్రజల భద్రత పట్ల పట్టింపు లేకపోయిందన్నది ఎఫ్ఐఆర్ సారాంశం. బలప్రదర్శన లక్ష్యంతో విజయ్ తన కరూర్ రాకను జాప్యం చేయడంతో, దీని తరువాత కార్యక్రమం జరగాల్సినచోటనుంచి కూడా జనం ఇక్కడకు తరలివచ్చారని పోలీసులు అంటున్నారు. గూండాలు, పోలీసులు, అధికారపార్టీ కార్యకర్తలు కట్టకట్టుకొని కరూర్‌లో కుట్రలు పన్నారని టీవీకే హైకోర్టులో ఆరోపించింది. సభను భగ్నం చేయడానికి కొందరు చెప్పులూ రాళ్ళూ రువ్వారని, పోలీసులు లాఠీచార్జీ చేశారని, విద్యుత్ నిలిపివేశారనీ, అనేక పరిణామాలు కలగలిసి ఈ ఘటన సంభవించినందున సీబీఐ విచారణజరపాలని టీవీకే డిమాండ్ చేస్తోంది. సీఎం స్టాలిన్ కరూర్ చేరుకొనేలోగా శవపేటికలను సిద్ధం చేయాలన్న రాజకీయకుట్రలో భాగంగా శవపరీక్ష హడావుడిగా జరిపించారని కూడా టీవీకే ఆరోపిస్తోంది. తమ తప్పులు కప్పిపుచ్చుకోవడానికి విజయ్ పార్టీ అసత్యాలను వండివారుస్తోందని ప్రభుత్వం అంటోంది.

ఈ శవ రాజకీయాలను అటుంచితే, ఒక సినీ హీరోగా విజయ్‌కు ఉన్న ప్రజాదరణ కాదనలేనిది. ఆయన రాకకోసం అల్లాడిపోతున్న అభిమానులు ఎక్కడికక్కడ పెద్దసంఖ్యలో కూడుతూంటే, టీవీకే నాయకులు పోలీసుల నియమనిబంధనలను బేఖాతరు చేస్తూ, నియంత్రణలను ఉల్లంఘిస్తూ, వారిని అధికారపార్టీ విధేయులుగా ముద్రవేస్తున్నమాట నిజం. భారీ వాహనం లోపలినుంచి దానిపైకి వచ్చి, చేతులు ఊపి, నాలుగు రాజకీయ విమర్శలు చేయడం ఎంతో సులువైన పని. కానీ, తన కోసం గంటల తరబడి ఎండల్లో వానల్లో నిరీక్షిస్తున్న అభిమానుల భద్రత, సంక్షేమం గురించి ఆలోచించడం, పట్టించుకోవడం కష్టమైన పని. విజయ్ వచ్చిరావడంతోనే జనం ఒక్కసారిగా ఎగబడటం, మరోపక్క ఆయన వాహనానికి దారి కల్పించడంకోసం కిటకిటలాడుతున్న జనాన్ని వెనక్కునెట్టాల్సి రావడం వంటి గొలుసుకట్టు చర్యలు ఈ దుర్ఘటనకు దారితీసిన మాట వాస్తవం. రోడ్‌షోలను బలప్రదర్శనకు వాడుకోవడంతోనే ఇంతమంది బలైనారన్నది నిజం. విజయ్‌సభల్లోకి అధికారపక్షం ఖాళీ అంబులెన్స్‌లు తరలిస్తోందన్న ఆరోపణలతో సహా ఈ దురదృష్టకర సంఘటనపై నిష్పక్షపాతంగా లోతైన దర్యాప్తు జరగాలి. అధికారపక్షంమీద ఎదురుదాడి చేయడం విజయ్‌కు సులువేగానీ, తనమీద వచ్చిన ప్రతీ విమర్శకూ, తాను చేస్తున్న ప్రతివిమర్శకూ ఆధారసహితంగా ప్రజలకు వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత మాత్రం ఆయన మీద ఉంది.

గాజాను ఛిద్రం చేస్తున్న మారణకాండపై అంతర్జాతీయంగా నిరసన వెల్లువెత్తుతోంది. తనను తాను విశ్వగురువుగా భావించుకునే భారత్ వైఖరి ఆ గౌరవ ప్రతిపత్తికి అనుగుణంగా లేదు. మొదటి నుంచీ మానవ హక్కులకు ప్రాధాన్యమిస్తూ నైతిక విలువలను ఔదలదాల్చిన భారత్ ఇప్పుడు ఫలస్తీన్ విషయంలో మౌనం వహిస్తోంది!

గాజా ఘోరకలిలో భారత్ నైతిక నేరం

ప్రతి దేశమూ స్వీయ ప్రయోజనాలకు అనుగుణమైన విదేశాంగ విధానాన్నే అనుసరించడం పరిపాటి. దక్షిణాఫ్రికా, ఫలస్తీన్ అంశాలు ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల వైదేశిక నీతిని ప్రభావితం చేశాయి.

అరబ్బు దేశాలతో భారతీయ దౌత్యంలో ముఖ్యభూమిక పోషించిన అంశం ఫలస్తీన్. ప్రస్తుతం గాజాను ఛిద్రం చేస్తున్న మారణకాండపై అంతర్జాతీయంగా నిరసన వెల్లువెత్తుతోంది. తనను తాను విశ్వగురువుగా భావించుకునే భారత్ వైఖరి ఆ గౌరవ ప్రతిపత్తికి అనుగుణంగా లేదు. వలస పాలనలో ఉన్న నాటి నుంచీ అంతర్జాతీయ వేదికలపై ఫలస్తీన్‌కు మద్దతుగా ఎలుగెత్తిన భారత్ ఇప్పుడు తద్విరుద్ధమైన వైఖరిని అనుసరిస్తోంది. ఆక్రమిత గాజాలో సైనిక దాడులు నిలిపివేసి సుస్థిర శాంతి నెలకొల్పాలన్న ఐక్యరాజ్యసమితి తీర్మానంపై ఓటింగుకు భారత్ వ్యూహాత్మకంగా దూరంగా ఉండిపోయింది. భారత్ తీరుపై అంతర్జాతీయ దౌత్యవర్గాలు విస్మయం వ్యక్తం చేయగా

గల్ఫ్ లేఖ

దేశీయంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఫలస్తీన్‌పై మోదీ ప్రభుత్వ వైఖరిని నిలదీసారు. ఓటింగులో పాల్గొనకపోవడంతో ప్రతిష్ఠ దెబ్బతిన్న భారత్, ఇటీవల సౌదీ అరేబియా, ఫ్రాన్స్ ప్రతిపాదించిన రెండు దేశాల తీర్మానానికి అనుకూలంగా ఓటింగ్ చేసింది.

గాజా ప్రాంతంలో ప్రజల ఇళ్ళను ఇజ్రాయెల్ నిరాటంకంగా కూల్చివేస్తోంది. ప్రజలను మైదాన ప్రాంతాలకు తరలిస్తోంది. బయటి నుంచి ఆహారం, ఔషధాలు మొదలైన అత్యవసర సహాయ సామగ్రిని గాజాలోకి ప్రవేశించనివ్వడం లేదు, చిన్నారులతో సహా సమస్త ప్రజలను ఆకలిమంటల్లో దహించిపోయేలా చేస్తోంది. చివరకు అన్నం పొట్లాలు పంపిణీ చేస్తామంటూ పిలిపించి వచ్చిన అన్నార్తులపై కాల్పులు జరుపుతూ క్రూరంగా వధిస్తున్న ఇజ్రాయెల్‌ను ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ దేశాలు నిందిస్తున్నాయి. మొదటి నుంచీ మానవ హక్కులకు ప్రాధాన్యమిస్తూ నైతిక విలువలను ఔదలదాల్చిన భారత్, ఇప్పుడు ఫలస్తీన్ విషయంలో మౌనం వహిస్తోంది!

ఐరోపాలో యూదులకు అన్యాయం జరిగితే ఫలస్తీన్ ప్రజలు అందుకు పరిహారం ఎందుకు చెల్లించాలని గాంధీజీ ప్రశ్నించారు.



ఫలస్తీన్ భూభాగంలో ఇజ్రాయెల్ ఏర్పాటును ఆయన వ్యతిరేకించారు. ఫలస్తీన్ విషయంలో పాశ్చాత్య దేశాల వైఖరిని జవహర్ లాల్ నెహ్రూ తీవ్రంగా నిరసించారు. ఫలస్తీన్ ప్రజలకు పాలస్తీనా ప్రత్యేక దేశంగా ఉండాలని బీజేపీ అగ్రనేత అటల్ బిహారీ వాజపేయి ఎన్నికల ప్రచార సభలలో పదేపదే చెప్పారు.

గల్ఫ్‌తో సహా సమస్త అరబ్బు దేశాలతో భారత మైత్రిలో ఫలస్తీన్ ఒక ప్రభావదాయక అంశం. కశ్మీర్ సమస్యను ఫలస్తీన్‌తో పోల్చుతూ భారత్‌ను అరబ్బు దేశాలలో ఏకాకిగా చేసేందుకు పాకిస్థాన్ చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే అరబ్బు దేశాలతో మైత్రిలో ఎలాంటి లోటు లేకుండా భారత్ విదేశాంగ విధానం వ్యూహాత్మకంగా కొనసాగింది. తత్ఫలితమే పాకిస్థాన్ ఎన్ని ప్రయత్నాలు చేసినా లిబియా మొదలు ఖతర్ దాకా భారత్‌కు ఉపాధి వీసాల జారీ పరంపర కొనసాగింది. అరబ్బు దేశాల తరహాలో ఫలస్తీన్‌కు భారత్ సంఘీభావం తెలపడమే కాకుండా సంపూర్ణ మద్దతు కూడా ప్రకటించింది. పాశ్చాత్య దేశాలన్నీ ఫలస్తీన్ విమోచన సంస్థ (పి.యల్.ఓ)ను ఒక ఉగ్రవాద సంస్థగా గుర్తిస్తే దాన్ని అసలయిన ఫలస్తీనా ప్రాతినిధ్య ప్రతినిధిగా 1974లోనే గుర్తించిన ప్రప్రథమ అరబ్బేతర దేశం భారత్. ఓస్లో శాంతి ఒడంబడిక అనంతరం 1995లో ఫలస్తీనా నగరం రమల్లాలో తన దౌత్య కార్యాలయం నెలకొల్పిన అతి కొద్ది ప్రపంచ దేశాలలో భారత్ ఒకటి. దౌత్య రంగంలో రాణించిన తెలుగువారయిన బొడ్డు బాలభాస్కర్, పర్వతనేని హరీష్‌లు భారత ప్రతినిధులుగా ఫలస్తీన్‌లో పని చేసారు. ఫలస్తీన్ విమోచన సంస్థ అధినాయకుడు యాసర్ అరాఫత్ భారత్‌కు ఆప్తుడు. ఇందిరా గాంధీ తన చివరి విదేశీ పర్యటనలో ట్యూనిసియాకు ప్రత్యేకంగా వెళ్లి అరాఫత్‌తో ఉభయ కుశలోపరి జరిపారు. ఉగ్రవాద సంస్థ అని అమెరికా, పాశ్చాత్య దేశాలు నిందిస్తున్నా, ఇందిరా గాంధీ పి.యల్.ఓకు ఆర్థిక అండదండలు సమకూర్చారు. ఇందిరా గాంధీ హత్యానంతరం ఆమె భౌతికకాయాన్ని చూసి కన్నీరు మున్నీరు అయిన ఏకైక విదేశీ నాయకుడు యాసర్ అరాఫత్. కశ్మీర్ వైఖరిపై భారత్‌నే అరాఫత్ సమర్థించే వారు. ఈ కారణాన కశ్మీర్ వేర్పాటువాదులు, పాకిస్థాన్ నాయకులు ఫలస్తీన్ నాయకత్వంపై సదా అసంతృప్తి వ్యక్తం చేస్తుండేవారు.

భారత్ నుంచి ఇటువంటి సంఘీభావ నేపథ్యమున్న ఫలస్తీన్ అంశం నరేంద్ర మోదీ సర్కారు హయాంలో క్రమేణా ప్రాధాన్యం కోల్పోయింది. ఇజ్రాయెల్ వైపే మోదీ సర్కార్ మొగ్గుతోంది. గాజాలో మానవతను కాలరాస్తున్న ఇజ్రాయెల్‌కు ఇప్పుడు పాశ్చాత్య ప్రపంచంలో అమెరికా మినహా మిత్ర దేశాలు దాదాపుగా లేవు. ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రసంగిస్తుండగా ఎదురయిన సన్నివేశమే ఆ దేశ ప్రతిష్ఠ మసకబారిందనడానికి ఒక తిరుగులేని నిదర్శనం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కొత్త రాజకీయ పొద్దుపొడుపు ఎప్పుడు?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

భారత దేశ రాజకీయాలు సంధి దశలో ఉన్నాయి. అయితే గత కొంతకాలంగా సంభవిస్తున్న పరిణామాలు భావి రాజకీయాల తీరుతెన్నులు మారబోతున్నాయన్న సంకేతాలనిస్తున్నాయి. ముఖ్యంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల్లో కదలికలు అనేక ఊహాగానాలకు దారి తీస్తున్నాయి.

ఓట్ చోరీ ఆరోపణల తర్వాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్ప కాంగ్రెస్‌లో మరో నేత కనపడడం లేదు. బీజేపీపై రాహుల్ తదుపరి ఆరోపణలు ఏమి చేయనున్నారన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొని ఉంది. ఓట్ చోరీపై ఇప్పటి వరకూ రెండు సార్లు విలేఖరుల సమావేశం నిర్వహించి, ఆయన వెల్లడించిన అంశాలకు చాలా ప్రచారం లభించింది. రాహుల్ తదుపరి వదిలే హైడ్రోజన్ బాంబు గురించి కూడా ఆసక్తి వ్యక్తమవుతోంది. నిజానికి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న సమయంలో కంటే పార్టీ అధ్యక్ష పదవిని వదులుకున్న తర్వాతే రాహుల్ గాంధీ చాలా జాగ్రత్తగా తన వ్యక్తిగత ప్రతిష్ఠ పెంచుకుంటూ వస్తున్నారు. భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయయాత్ర రెండింటిలోనూ మేధావులు, ప్రజల దృష్టిని రాహుల్ విశేషంగా ఆకర్షించారు. డీలాపడ్డ కాంగ్రెస్ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని సమకూర్చారు. రాహుల్ గాంధీ ఏమి చేస్తారన్న దానిపైనే తమ భవిష్యత్ ఆధారపడి ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు.

భారత్ జోడో యాత్రల తర్వాత సామాజిక న్యాయంపై రాహుల్ దృష్టి సారించారు. శాస్త్రీయమైన కులగణన జరిపి వివిధ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న డిమాండ్‌ను లేవనెత్తారు. మరో వైపు భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుతోందన్న భావనను కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మోదీ తీసుకుంటున్న అప్రజాస్వామిక నిర్ణయాలను, చేస్తున్న వ్యవస్థల హననాన్ని ఆయన ప్రశ్నిస్తున్నారు. బిహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' సందర్భంగా రాహుల్ చేసిన విమర్శలు బాగా చర్చనీయాంశమయ్యాయి. నిన్నమొన్నటి దాకా కాంగ్రెస్‌కు వారసత్వమే గుదిబండగా కనిపించేది. అయితే ఇప్పుడు ఆ వారసత్వంపై నేతల ఆశలు చిగురిస్తున్నాయి.

గత ఏడాది అహ్మదాబాద్ లోనూ, ఈ ఏడాది పాట్నా లోనూ నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాల ద్వారా పార్టీకి పూర్వవైభవం తేవాలన్న ఆకాంక్షను పార్టీ కార్యకర్తల్లో రాహుల్ ప్రగాఢంగా రేకెత్తించారు. ఒకప్పుడు గుజరాత్, బిహార్‌లో జరిగిన ప్రజా ఉద్యమాలు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్‌ను దెబ్బతీసేందుకు కారణమయ్యాయి. 'మోదీ స్వంత రాష్ట్రంలో బీజేపీని ఓడించడం అవసరం' అని గత నెలలో గుజరాత్‌లో రాహుల్ ప్రకటించారు. గుజరాత్, బిహార్, ఒడిషాతో పాటు దేశమంతటా 'సంఘటన్ సృజన్ అభియాన్' పేరిట కాంగ్రెస్‌ను పటిష్ఠం చేసి, వ్యవస్థీకృత మార్పులు తెచ్చేందుకు రాహుల్ కీలక చర్యలు చేపట్టారు. అనేక రాష్ట్రాల్లో జిల్లా అధ్యక్షుల శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి నేతలతో రాహుల్ విడివిడిగా సంభాషిస్తున్నారు. డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలకు అభ్యర్థుల ఎంపికలో పరిగణనలోకి తీసుకుంటామని చెప్పి వారిలో ఉత్సాహం నింపుతున్నారు. డీసీసీ అధ్యక్షుల ఎంపికలో కూడా తొలిసారి ఏఐసీసీ పరిశీలకులను నియమించడం ఒక కీలక పరిణామం.

పాట్నాలో ఒకప్పుడు బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడుగా ఉన్న, మహాత్మాగాంధీ ఎన్నో చరిత్రాత్మక పోరాటాలు ప్రారంభించిన 'సదాకత్ ఆశ్రమ్' నిన్న మొన్నటి వరకు పాడు పడిపోయి ఉండేది. ఇప్పుడు దానికి పూర్వ కళ వచ్చేసింది. ఇటీవల ఏఐసీసీ విస్తృత వర్కింగ్ కమిటీ సమావేశం ఇదే భవనంలో జరపడం కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని కల్పించింది. ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే రాహుల్, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఇద్దరూ కలిసి అత్యంత వెనుకబడిన వర్గాలకు న్యాయం కల్పించే మేనిఫెస్టోను (అతిపిఛ్డా న్యాయ సంకల్ప్) విడుదల చేశారు.

ఇటీవల పార్లమెంట్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాలను చూస్తుంటే ప్రతిపక్షాల కార్యాచరణను ప్రధానంగా రాహుల్ గాంధీయే నిర్దేశిస్తున్నారని స్పష్టమవుతోంది. ఆయన లేవనెత్తిన సామాజిక న్యాయ ఎజెండాను ఇతర ప్రతిపక్షాలు కూడా స్వీకరించినట్లు కనపడుతున్నది. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీయే నిర్ణయించి, మిగతా ప్రతిపక్షాలను తనకు మద్దతుగా సమీకరించగలిగింది. రాహుల్ నిర్వహిస్తున్న సమావేశాలకు ప్రతిపక్ష నేతలు అందరూ హాజరవుతున్నారు. ఈ దేశంలో ప్రత్యామ్నాయ నేత రాహుల్ తప్ప మరొకరు లేరన్న విషయమై ప్రతిపక్షాలు పెద్దగా విభేదించడం లేదు. ఆర్జేడీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాది పార్టీతో పాటు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇప్పుడు కాంగ్రెస్ వైపు చూస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

మోదీ ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న పరుష విమర్శలకు సోషల్ మీడియాలో కూడా అధిక ప్రాధాన్యం లభిస్తోంది. గతంలో బీజేపీ సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా చాలా ప్రభావశీలమైన ప్రచారం చేసేది. ఇప్పుడు ఆ టెక్నిక్‌ను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు కూడా నేర్చుకున్నాయి. రాహుల్‌ను అభిమానించే మీడియా విశ్లేషకుల బృందం ఆయన మాట్లాడిన మాటలకు సోషల్ మీడియాలో ప్రాచుర్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. రాహుల్ మాట్లాడిన వెంటనే ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర యాదవ్ నుంచి ప్రకాశ్‌రాజ్ వరకు అందుకుని ఆయనను సమర్థించడం ఒక పరిణామం.

స్పష్టంగా చెప్పాలంటే దేశం ఇప్పుడు రాజకీయంగా, సైద్ధాంతికంగా బీజేపీ, కాంగ్రెస్ శిబిరాల మధ్య విడిపోతోంది. మోదీని వ్యతిరేకించేవారు, ద్వేషించేవారు కాంగ్రెస్ శిబిరంలో అనివార్యంగా చేరిపోతున్నారు. పార్టీలు కూడా అదే విధంగా విడిపోతున్నాయి. 2019లో 52 సీట్లు సాధించిన కాంగ్రెస్, 2024లో 99 సీట్లకు చేరుకుంది. 21.2 శాతం ఓట్లు సాధించి కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఏదో ఒక రూపంలో ఉన్నది. హిందీ బెల్ట్‌లోనూ, ఈశాన్యంలోనూ, మధ్య భారతంలోనూ, దక్షిణ భారతావనిలోను కాంగ్రెస్ ముద్రలు ఏదో ఒక రకంగా ఉన్నాయి. కాంగ్రెస్ ఎలాగైనా మరో 50 లేదా 60 సీట్లు అదనంగా సాధించగలిగితే 2029లో కాంగ్రెస్ సారథ్యంలో సంకీర్ణ ప్రభుత్వం నెలకొనడం ఖాయమన్న ఆత్మ విశ్వాసం ఆ పార్టీ నేతల్లో కనపడుతోంది.



మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే బీజేపీ అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడింది నిజమే కానీ, ప్రతిపక్షాలు ఊహించినంత వేగంగా మోదీ గ్రాఫ్ పడిపోలేదు. ప్రధానమంత్రి జనాదరణ 2021లో 70 శాతం నుంచి 2025లో 60 శాతం లోపునకు పడిపోయింది. మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడుగా రాహుల్ కానీ, మరో నేత కాని ఆవిర్భవించే అవకాశాలు సమీప భవిష్యత్తులో కనిపించడం లేదు. అందుకే ఇది సంధికాలం.

అయితే కాంగ్రెస్ పుంజుకుంటున్నదన్న వాతావరణం కాంగ్రెస్ నేతల్లో ఏర్పడినంతగా జనంలో ఏర్పడుతున్నదా? ఇప్పటి వరకూ కనపడుతోంది సంకేతపూర్వక మార్పే కానీ అది పార్టీని ఒక ప్రజా ఉద్యమంగా మార్చగలిగిన పరిణామం కాదు. కాంగ్రెస్ పుంజుకోవడం వాపా, బలుపా అన్నది తేలాల్సి ఉన్నది. రాహుల్ వ్యక్తిగత ప్రతిష్ఠ పెరిగి ఉండవచ్చు కాని అంతే వేగంగా సంస్థాగత బలం పటిష్ఠమైందా? ఇది సహేతుకమైన అనుమానమే! ఎందుకంటే కాంగ్రెస్‌లో పాత కాలం రాజకీయాలు ఇంకా సమసిపోలేదు. పదవులకై అదే కాట్లాట, వృద్ధ నేతలు వైదొలిగి కొత్త వారికి అవకాశం కల్పించే పరిస్థితి పూర్తిగా రాలేదు. రాహుల్ విశ్వసనీయత పెరిగి ఉండవచ్చు కానీ ఇందిరా గాంధీ లాగా ఒక ప్రజాప్రభంజనాన్ని సృష్టించగలిగిన నాయకత్వం కాంగ్రెస్‌కు రాలేదు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ నేతలు రాహుల్ యత్నాలకు తోడుగా పార్టీని బలపరిచేందుకు అంతగా కష్టపడడం లేదు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా బలోపేతమై ప్రతి చోటా ఎన్నికల్లో గెలిచేందుకు అవసరమైన యంత్రాంగాన్ని ఇంకా ఏర్పర్చుకోవల్సి ఉన్నది. బిహార్, ఒడిషా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తదితర చోట్ల పార్టీ వ్యవస్థ బాగా బలహీనమై నాయకులు లేని దుస్థితికి చేరుకున్నది. నాయకత్వాన్ని మరింత వికేంద్రీకరించి, సాహసోపేతమైన సైద్ధాంతిక ఎజెండాను కల్పించి, విశ్వసనీయ జాతీయ ప్రత్యామ్నాయంగా రూపొందించే దారిలో కాంగ్రెస్ ఇంకా అనేక చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. ఏఐసీసీ కార్యాలయం ఇప్పటికీ జీవకళ కోల్పోయిన నెలవులా కనపడుతోంది. ఒకప్పుడు అక్కడకు ఎప్పుడు వెళ్లినా ఎంతో మంది తచ్చాడుతూ కనిపించేవారు. అక్కడ నాయకులను కలిస్తే తమ పనులు అయిపోతాయన్న ఆశతో వచ్చేవారు. మీడియాను కలిసి రాజకీయ పరిణామాలను విశ్లేషించే మేధావులు ఉండేవారు. ఇప్పుడు అక్కడికి వెళ్లడం అనవసరమనే భావన కనిపిస్తోంది. ఢిల్లీలోని దీనదయాళ్ మార్గ్‌లో బీజేపీ ఇప్పటికే ఒక అధునాతన ఆకాశ హర్మ్యాన్ని నిర్మించుకుని ఎవరికీ తెలియని రహస్య నిర్ణయాలు తీసుకునే నెలవుగా దానిని మార్చింది. ఒకప్పుడు అశోకా రోడ్ లోని బీజేపీ కార్యాలయానికీ, ఈ కార్యాలయానికీ ఎంతో తేడా కనిపిస్తోంది. అదే పరిస్థితి అక్బర్ రోడ్ లోని కాంగ్రెస్ కార్యాలయానికి, దీనదయాళ్‌లో కాంగ్రెస్ నిర్మించుకున్న అధునాతన కార్యాలయానికీ తేడా కనిపిస్తోంది. రెండూ కార్పొరేట్ భవనాల్లా కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో రెండు ప్రధాన పార్టీలు అవలంబిస్తున్న వైఖరి చాలా ఆశ్చర్యకరంగా ఉన్నది.

నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే బీజేపీ అనేక విషయాల్లో ఆత్మరక్షణలో పడిందన్న విషయం వాస్తవం. అంతర్గత సమస్యలు, ఎన్నికల అక్రమాల నుంచి విదేశాంగ విధానం వరకు ప్రతిపక్షాలు లేవనెత్తే అనేక ప్రశ్నలకు ప్రభుత్వం సరైన సమాధానాలు చెప్పలేని స్థితిలో ఉన్నది. నిజమే కానీ ప్రతిపక్షాలు ఊహించినంత వేగంగా మోదీ గ్రాఫ్ పడిపోలేదు. మోదీ ఇప్పుడు ఎదుర్కొంటున్న సమస్యలు తాత్కాలికమైనవేనని, ఆయన వాటి నుంచి బయటపడి మళ్లీ పుంజుకుంటారని భావిస్తున్న వారు ఎందరో ఉన్నారు. హిందూత్వ ఆధారంగా మోదీని అభిమానించే జనం అంతగా తగ్గిపోలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వృద్ధులను గౌరవిద్దాం

'పుట్టినవాళ్లెవరైనా కాలక్రమంలో వృద్ధులుగా మారక తప్పదు' ఈ సత్యాన్ని గ్రహించకుండా వారిని హింసించడం, వేధింపులకు గురి చేయడం, వారి కష్టార్జితాన్ని స్వాధీనం చేసుకొని వాళ్లను రోడ్లపైన వదిలేయడం వంటి దుర్మార్గపు పరిస్థితులు సమాజంలో నేడు అధికమయ్యాయి. వృద్ధుల సంరక్షణను నిర్లక్ష్యం చేయడం చట్టరీత్యా నేరం. వృద్ధులను పట్టించుకోకపోతే, వారి ఆస్తి పొందే అర్హత, అనుభవించే హక్కు వారసులకు లేదని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. 'వృద్ధులకు చేయూతనివ్వడం కనీస బాధ్యత' అని తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే తమ పిల్లలకు నేర్పాలి. వయసు పైబడిన వారు చాదస్తం కారణంగా కొన్ని ఇబ్బంది కలిగించే పనులు చేయవచ్చు, వాటిని పిల్లలు విసుక్కోకూడదు. వృద్ధుల మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. కనీస విచక్షణ, సహనం కలిగి ఉండాలి. వాళ్లను చిన్న పిల్లల వలె జాగ్రత్తగా చూసుకోవాలి. వారి మనసుకు ప్రశాంతతనిచ్చే మాటలే మాట్లాడాలి. అప్పుడే వృద్ధులు కాస్త సంతృప్తి చెందుతారు. వారు సంతోషంగా ఉంటే వయసు కారణంగా వచ్చే రోగాలు కూడా చాలా వరకూ దూరమవుతాయి. వృద్ధుల్లో సహజంగానే అరుగుదల క్షీణిస్తుంది కాబట్టి వాళ్లకు జీర్ణమయ్యే ఆహారాన్నే ఇవ్వాలి. ప్రభుత్వాలు కూడా వృద్ధుల సంరక్షణకు సంబంధించిన నైతిక విలువలను ప్రజల్లో పెంపొందించేందుకు తమ వంతు కృషి చేయాలి.

– వై. సంజీవ కుమార్
(నేడు ప్రపంచ వృద్ధాప్య దినోత్సవం)

రొమ్ము క్యాన్సర్‌పై అలుపెరుగని పోరాటం

అక్టోబర్‌ను ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన నెల'గా గుర్తిస్తారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించాల్సిన ఆవశ్యకతను తెలియచెప్పడం, దీని బారినుంచి బయటపడ్డవారిని గౌరవించడం, వారికి ఆశ-ధైర్యం అనే సందేశాన్ని ఇవ్వడం వంటివి ఈ నెలలో నిర్వహిస్తారు. మహిళల్లో ఎక్కువగా కనిపించే ఈ వ్యాధిని ఎదుర్కొనేందుకు సమాజంలో అవగాహన కల్పించడం, చట్టాలను తయారు చేసే వారిని చైతన్యపరచి, ఈ జబ్బు నిర్మూలనకు చర్యలు తీసుకునేలా చేయడం ఎంతో అవసరం.

మన దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది మహిళలు రొమ్ము క్యాన్సర్ బారిన పడుతున్నారు. లక్షమందికి పైగా మహిళలు ఏటా ఈ వ్యాధి కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి స్పష్టమైన కారణాలు ఉన్నాయి. ఈ వ్యాధిపై మహిళలకు అవగాహన లేకపోవడం, దేశవ్యాప్తంగా ఒక బలమైన స్క్రీనింగ్ కార్యక్రమం లేకపోవడం, ఈ క్యాన్సర్ చికిత్సకు ఆస్పత్రుల్లో సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం వంటివి ఇందులో ప్రధానమైనవి. గ్రామీణ భారతంలో రొమ్ము క్యాన్సర్ ఇంకా 'రహస్య సమస్య'గానే మిగిలి ఉన్నది.



ఈ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, మహిళలకు శక్తినివ్వాలనే దృఢ సంకల్పంతో 2007లో 'ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్'ను స్థాపించాను. మా అమ్మగారు కూడా ఈ వ్యాధితో వ్యక్తిగత పోరాటం చేసినందున, ఆమె ధైర్యాన్ని గౌరవిస్తూ ఈ ఫౌండేషన్‌ను ఆమె పేరుతో స్థాపించాను. ఫౌండేషన్ లక్ష్యాన్ని నాలుగు అంశాల్లో ఇలా వివరించవచ్చు. 1) సమాజంలో రొమ్ము క్యాన్సర్‌పై ఉన్న అపోహలు తొలగించి, దాని గురించి ప్రజలందరూ బహిరంగంగా మాట్లాడుకునేలా చేయడం. 2) ఈ సమస్యకు సంబంధించి అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజల్లో నమ్మకం ఏర్పరచడం. 3) రాజకీయ అవగాహనను కల్పించి, చట్టాలను తయారు చేసే వారు రొమ్ము క్యాన్సర్ నిర్మూలనా చర్యలు చేపట్టేలా ప్రభావితం చేయడం. 4) ఈ సమస్యను ప్రజా ఆరోగ్య చర్చల్లో చేర్చడం. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫౌండేషన్ తరఫున 'పింక్ రిబ్బన్' కార్యక్రమాన్ని ఆరంభించాం. గత పద్దెనిమిది సంవత్సరాల్లో ఇది దేశంలోనే 'అత్యంత ప్రభావవంతమైన ఆరోగ్య అవగాహన ప్రచారాల'లో ఒకటిగా నిలిచింది. సినీ, ఇతర ప్రముఖులు ఈ సమస్యపై తమ గళాన్ని వినిపిస్తున్నారు. 'పింక్ రిబ్బన్ వాక్', 'పింట్ ది సిటీ పింక్' వంటివి ఈ 'అంతర్జాతీయ రొమ్ము క్యాన్సర్ అవగాహన' నెలలో ఏటా సంప్రదాయాలుగా మారాయి. హైదరాబాద్ నగరంలో వరుసగా 16 సంవత్సరాల పాటు అక్టోబర్ నెలలో ఏదైనా ఒక రోజున జీహెచ్ఎంసీ సిటీ మొత్తాన్ని పింక్ లైట్ల వెలుగుతో నింపుతోంది. తద్వారా రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనా కార్యక్రమాల నిర్వహణలో హైదరాబాద్ ప్రత్యేకంగా నిలుస్తోంది.

ప్రధానమంత్రి డిజిటల్ ఇండియా దృష్టి నుంచి ప్రేరణ పొంది బ్రెస్ట్ హెల్త్‌కు సంబంధించి ప్రపంచంలోనే మొదటి మొబైల్ యాప్ (ABCs of Breast Health)ను మా ఫౌండేషన్ రూపొందించింది. ఇంగ్లీష్‌తో పాటు, 11 ప్రధాన భారతీయ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది. మా 'పింక్ కనెక్షన్' దక్షిణాసియాలోనే మొదటి త్రైమాసిక బ్రెస్ట్ హెల్త్ మ్యాగజైన్.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల భాగస్వామ్యంతో మా ఫౌండేషన్ తరఫున 'క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్' (సీబీఈ)ను నిర్వహించాం. 2012 నుంచి 2016 వరకు, నాలుగువేల గ్రామాల పరిధిలో 35–65 వయసు మధ్య ఉన్న రెండు లక్షలకు పైగా ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు మా ఫౌండేషన్ స్క్రీనింగ్ నిర్వహించింది. క్యాన్సర్ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించింది. రొమ్ము కాన్సర్‌తో బాధపడుతున్న నిరుపేద మహిళలకు ఇది తక్కువ ఖర్చు కలిగిన మార్గం. 2016లో నేను సభ్యుడిగా ఉన్న 'కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్టీరింగ్ కమిటీ, టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్' దీన్ని జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా దేశవ్యాప్తంగా అమలు చేయడానికి ఆమోదించింది. మా 'పింక్ రిబ్బన్' కార్యక్రమం దేశవ్యాప్తంగా ఎంతగానో ప్రభావం చూపింది. ఇటీవల ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా మా ఫౌండేషన్ సేవలను అభినందించడం సంతోషాన్ని కలిగించే విషయం.

గత ఇరవై ఏళ్లుగా 'రొమ్ము క్యాన్సర్‌'కు సంబంధించి మా ఫౌండేషన్ విస్తృత కార్యక్రమాల్లో భాగస్వామ్యమైంది. అవగాహన కల్పించడం అంటే రొమ్ము క్యాన్సర్ సమస్యపై ఒక ఉద్యమాన్ని సృష్టించడమే. ఇప్పటికే ఈ కార్యక్రమాల ద్వారా ఎన్నో ప్రాణాలు రక్షించబడ్డాయి. ఒకప్పుడు నిశ్శబ్దంలో మునిగిన ఈ వ్యాధి గురించి నేడు ప్రతి ఒక్కరూ చర్చిస్తున్నారు. ఇంకా చర్చల్లోకి రావాలి. నేటి నుంచి అక్టోబర్ నెలంతా 'రొమ్ము క్యాన్సర్‌'పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. మా ఫౌండేషన్ ద్వారా లక్షలాది మంది రోగులకు ఆశ, ధైర్యాన్ని అందించడం నా జీవితంలో అత్యంత గౌరవంగా భావిస్తాను.



○ డా. పి.రఘురామ్
ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్

నవీన ఆలోచనల 'మంథన్ సంవాద్'

ఆలోచనలు స్వేచ్ఛగా పంచుకునే వేదికగా నిలిచిన 'మంథన్ సంవాద్' అక్టోబర్ 2న, హైదరాబాద్ శిల్పకళావేదికలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరుగుతోంది. ఈ కార్యక్రమంలో రచయితలు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు, కళాకారులు, జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్య పౌరులు.. ఇలా అన్ని వర్గాల వారూ ఒకే వేదికపైకి చేరి 'మనకు నిజంగా ముఖ్యమైన విషయాలు' చర్చించనున్నారు. ఇది రాజకీయాలకు అతీతమైన వేదిక. మంథన్ ఇప్పటి వరకు 500కు పైగా ప్రసంగాలు నిర్వహించింది. 60,000 మందికి పైగా సభ్యులను కలిగివుంది. పౌరుల జీవితానికి నేరుగా సంబంధించిన ప్రజాస్వామ్యం, ఆర్థికవ్యవస్థ, పర్యావరణం, విజ్ఞానం, చరిత్ర, మానవ హక్కులు మొదలైనవి ఇక్కడ చర్చించే అంశాలు. ప్రతీ ఏడాది గాంధీ జయంతి రోజున ఈ చర్చ జరగడం కూడా దీని విలువను పెంచుతోంది.

MANTHAN SAMVAAD

ఈసారి వేదికపైకి రాబోతున్న వక్తలు అందరూ తమ రంగాల్లో గుర్తింపు పొందినవారు. రక్షణ రంగ నిపుణుడు ప్రవీణ్ సాహ్నీ దేశ భద్రత, సరిహద్దు పరిస్థితులు, అంతర్జాతీయ సంబంధాలపై అవగాహన కలిగించనున్నారు. అంతర్జాతీయంగా పేరుపొందిన కమెడియన్ వీర్ దాస్ తన హాస్యంతో కూడిన వ్యాఖ్యలతో సమాజంలోని అన్యాయాలపై గొంతు వినిపిస్తారు. చరిత్రకారుడు, అశోక యూనివర్సిటీ ఛాన్సలర్ రుద్రాంగ్షు ముఖర్జీ భారత చరిత్రలోని కీలక ఘట్టాలు మన ప్రస్తుత సమాజానికి ఎలా ముడిపడి ఉన్నాయో చెప్పనున్నారు. పౌరహక్కులు, మీడియా స్వేచ్ఛలపై 'ది వైర్' సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖానమ్ షెర్వాణీ మాట్లాడనున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ బయోలాజికల్ సైన్సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్.ఎస్. శశిధర్ మన దైనందిన జీవితంలో శాస్త్రం ఎంత ముఖ్యమో వివరించనున్నారు. ప్రజా విధాన ఆర్థికవేత్త రథిన్ రాయ్ భారత ఆర్థిక వ్యవస్థ దిశపై విశ్లేషణ ఇస్తారు. మానవ హక్కుల న్యాయవాది కాలిన్ గోన్సాల్వెస్ రాజ్యాంగం, న్యాయం, సమాన హక్కుల అంశాలను ప్రస్తావించనున్నారు. ఈ వక్తలంతా సమాజానికి అవసరమైన విస్తృత చర్చను తెరపైకి తీసుకువస్తారు. మంథన్ సంవాద్ ప్రత్యేకతలలో ఒకటి దాని ఉచిత ప్రవేశం, రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. మధ్యాహ్న భోజనం కూడా ఉచితం. హైదరాబాద్ నగరం ఒకవైపు సంప్రదాయ విలువలను కాపాడుకుంటూనే, మరోవైపు కొత్త ఆలోచనలను స్వీకరించే ధైర్యం కలిగినది. అదే మంథన్ స్ఫూర్తి కూడా. పాత, కొత్త ఆలోచనలను కలిపి కొత్త దిశలో ముందుకు తీసుకెళ్లడం. ప్రతి సంవత్సరం దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, ప్రొఫెసర్లు, ఆలోచనాపరులు హైదరాబాద్‌కి వస్తారు. ఇక్కడి చర్చలను విని కొత్త విషయాలు నేర్చుకుంటారు, తిరిగి వెళ్లిన తర్వాత ఆ ఆలోచనలను తమ సమాజంతో పంచుకుంటారు. మంథన్ కేవలం ఒక రోజు జరిగే సభ మాత్రమే కాదు, అది ఒక ఆలోచనల విత్తనం.

– విక్రమ్, మంథన్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 1 అక్టోబరు 2025

శ్రామిక రాష్ట్ర మహిళ సదస్సును విజయవంతం చేయాలి.. 6

ఎంపీటీసీ రిజర్వేషన్లు విడుదల 6


ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వెల్లివిరిసిన పూల జాతర

- అష్టమితో రెండో రోజు సాగిన సద్దుల బతుకమ్మ
- ఉర్సుగుట్ట మైదానంలో పెద్దసంఖ్యలో ఆడిపాడిన మహిళలు


రంగలీల మైదానంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ మాసం అష్టమి మంగళవారం రోజున పలు ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈసారి సద్దుల బతుకమ్మ తేదీపై గందరగోళం నెలకొనడంతో సోమవారం కొందరు, మంగళవారం మరికొందరు జరుపుకున్నారు. నగరంలోని ఉర్సుగుట్ట రంగలీల మైదానం, ఎస్ఆర్ఆర్ తోట, ఖిలా వరంగల్, శివనగర్, రంగశాయిపేట, కాశిబుగ్గ, కోటి లింగాలు, వివేకానంద కాలనీ, భద్రకాళి దేవస్థానం ప్రాంతంలో మంగళవారం సాయంత్రం మహిళలు బతుకమ్మలను చేతబూని ఆటపాటలతో సందడి చేశారు. కాశిబుగ్గ శివాలయం ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉర్సుగుట్ట ప్రాంగణంలో మహిళలు తీరొక్క పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చి మైదానంలో తోటి మహిళలతో కలిసి బతుమమ్మ బతుకమ్మ ఉయ్యాలో... అంటూ ఆడి పాడారు. ఇళ్ల నుంచి తెచ్చుకున్న సద్దులు, పిండి వంటలను సాటి మహిళలకు ప్రసాదంగా పంచి బతుకమ్మల్లోని గౌరమ్మలను వాయినంగా పంచుకున్నారు. సోమవారం వేడుకలు జరుపుకున్నవారు కూడా మంగళవారం బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. వేడుకలు జరిగే ప్రాంగణాల్లో ప్రభుత్వం విద్యుత్ లైట్లను, తాగునీటి వసతిని ఏర్పాటు చేసింది. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

అంచనాలు తారుమారు

హనుమకొండ జిల్లాలో రిజర్వేషన్లతో ఆశలు గల్లంతు

- జనరల్ స్థానాల్లో తీవ్రంగా ఉండనున్న పోటీ
- ధర్మసాగర్‌లో మహిళలకే మళ్లీ పట్టం
- పరకాల, నడికూడలో జనరల్‌తో నువ్వానేనా..
- నడికూడలో ఎస్సీలకు జనరల్ బ్రేక్
- ఎల్కతుర్తిలో గల్లంతైన బీసీల ఆశలు



6


హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన రోహిత్ నేత

హనుమకొండ జిల్లాకు తౌటం రోహిత్

- ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు
- కలెక్టర్ స్నేహ శబరీష్‌కు రిపోర్టు

6


దుర్గాలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

మహాదుర్గగా భద్రకాళి

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో కొలువుదీరిన భద్రకాళి దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం అమ్మవారి జన్మదినోత్సవం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం4 గంటలకు నిత్య పూజల అనంతరం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. దుర్గాష్టమి పూజతో పాటు మహాగౌరి దుర్గార్చన సేవ నిర్వహించి అమ్మవారిని భక్తుల దర్శనానికి అనుమతించారు. అష్టమి రోజున అమ్మవారి జన్మదినం కావడంతో సద్దులతో పూజ చేశారు. అమ్మవారిని బతుకమ్మగా భద్రమ్మగా పిలుస్తూ సద్దుల పండుగ రోజు జన్మదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ మాడవీధుల్లో బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో రామల సునిత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ధర్మకర్తలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు రిజర్వేషన్లతో మభ్యపెడుతున్నారు..

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కమలాపూర్. సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు రిజర్వేషన్లతో ప్రజలను మభ్యపెడుతోందని, స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఈటల రాజేందర్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిహార్, మహారాష్ట్ర తరహాలోనే తెలంగాణ ప్రజలను మోసం చేయడానికే రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను ప్రకటించినట్లు ఉందన్ని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 42శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. కాంగ్రెస్ మంత్రులు కోర్టుకు వెళ్లి స్థానిక ఎన్నికలను నిర్వహించకుండా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కామారెడ్డి బహిరంగసభలో రేవంత్ రెడ్డి ఇచ్చిన డిక్లరేషన్ హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో రిజర్వేషన్లు తప్పుడు తడకగా రాష్ట్ర ప్రభుత్వం చూపించిందని పత్రికల్లోనే వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని, 42శాతం బీసీ రిజర్వేషన్‌కు బీజేపీ కట్టుబడి ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో అన్ని స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఈటల ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌కు స్థలం ఇవ్వండి..

కలెక్టర్‌ను కోరిన ఎంపీ కావ్య

హనుమకొండ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛన్‌దారలు, వారి కుటుంబ సభ్యుల కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించవలసిందిగా వరంగల్ ఎంపీ కడియం కావ్య హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్‌ను కోరారు. మంగళవారం ఈ మేరకు ఎంపీ కలెక్టర్‌కు ఫోన్ చేసి వెల్‌నెస్ సెంటర్, దాని నిర్వహణకు వైద్య, పారామెడికల్ సిబ్బంది మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సెంటర్‌కు శాశ్వత భవన నిర్మాణానికిగాను హనుమకొండలో అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు త్వరలో ఒక రూపం ఇవ్వడానికి వీలైనంత త్వరగా స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు కలెక్టర్ సానులకూలంగా స్పందించారు.

కేయూలో అడ్మిషన్ల సందడి

8వ తేదీ వరకు మొదటి దఫా పీజీ అడ్మిషన్లకు అవకాశం

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంహెచ్ఆర్ఎం, ఎంటీఎం, సైకాలజీతోపాటు ఇతర పీజీ, డిప్లొమా కోర్సుల మొదటి దఫా అడ్మిషన్ల సందడి నెలకొంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సీపీసెట్-2025లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు వర్సిటీల వారిగా సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతోంది. వర్సిటీ క్యాంపస్‌లో మొదటి విడత సీట్లు సాధించిన విద్యార్థులు వర్సిటీ క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో అడ్మిషన్లు పొందుతున్నారు. సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 8 వరకు మొదటి విడత అడ్మిషన్లు జరుగుతాయని కేయూ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను స్వయంగా సెల్‌ఫోన్‌లో నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి అడ్మిషన్లు పొందాలని వెల్లడించారు. విద్యార్థుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

యోగా సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

వడ్డేపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యోగా డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హెపీ లివింగ్ అకాడమీ ఫౌండర్, యోగాచార్యులు ఆంజనేయులు, డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హనుమకొండ 56వ డివిజన్‌లోని పోలీసు కాలనీ వద్ద గల సాయి సేవా ట్రస్ట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కాకతీయ యూనివర్సిటీ సీడీవోఈ ద్వారా ప్రామాణిక సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 95534 89862, 99126 40919లలో సంప్రదించాలన్నారు.

అక్షర చిట్‌ఫండ్ వద్ద బాధితుల ఆందోళన

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద చిట్టీదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. డిపాజిట్లు పెట్టినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పెద్ద సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు సహా వందలాది మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నారు. చిట్‌ఫండ్ బాధ్యులతో బాధితులకు వాగ్వాదం జరిగింది. సుబేదారీ సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్షర చిట్‌ఫండ్ వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. చిట్‌ఫండ్ నుంచి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ రాత్రి వరకు ఆందోళన చేశారు.

జీడబ్ల్యూఎంసీ ఎస్ఈగా సత్యనారాయణ

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఎస్ఈగా సీఏహెచ్ సత్యనారాయణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రభుత్వ కార్యదర్శి కె.ఇలం భారతి ఆదేశాలు జారీ చేశారు. కాగా, వరంగల్ మునిసిపాలిటీకి పూర్తిస్థాయి ఎస్ఈగా పనిచేసిన ప్రవీణ్ చంద్ర.. ఏప్రిల్ మాసంలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఈఈ స్థానంలో సీనియర్‌గా ఉన్న బి.మహేందర్ ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగుతున్నారు. దీంతో ఐదు మాసాలుగా పూర్తిస్థాయి ఎస్ఈ పోస్టు ఖాళీగా ఉంది. సత్యనారాయణ నియామకంతో ప్రస్తుతం ఇన్‌చార్జి ఎస్ఈగా ఉన్న మహేందర్.. ఇకపై ఈఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తారు.

అంచనాలు తారుమారు



హనుమకొండ జిల్లాలో రిజర్వేషన్లతో ఆశలు గల్లంతు

హనుమకొండ సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా పరిధిలోని 12 గ్రామీణ మండలాల్లో తాజాగా నిర్ణయించిన రిజర్వేషన్లతో కొందరి ఆశలు గల్లంతు కాగా, మరికొందరిలో కొత్త ఆశలు చిగురించాయి. తాజా మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలు రిజర్వేషన్ల మార్పు వల్ల తిరిగి తమ స్థానాల నుంచి పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. కొత్త నెలవులను వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది పార్టీల నీడన పోటీ చేయాలనుకునేవారికి నేతల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉంది. కొత్త నెలవుల్లోని స్థానిక నేతల సహాయ సహకారాలు కూడా ఎంతో అవసరం. ఇది సాధ్యం కాని పక్షంలో జనరల్ స్థానాలపై గురిపెట్టాలని చూస్తున్నారు. గతంలో రిజర్వేషన్లు కలిసి రాక పోటీ చేయలేక పోయినవారికి ఈ సారి కలిసి రావడంతో పోటీకి సై అంటున్నారు.

గతంలో అలా.. ఇప్పుడు ఇలా..

● ఎల్కతుర్తి జడ్పీటీసీ, ఎంపీపీ స్థానం గత ఎన్నికల్లో ఎస్సీ జనరల్‌కు రిజర్వు కాగా, ఈ సారి ఎస్సీ మహిళకు అయింది. ఇక్కడి నుంచి గతంలో మాదిరిగా పురుషులు పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. హసన్‌పర్తి స్థానం గతంలో ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, ఈ సారి ఎస్సీ జనరల్ అయింది. దీంతో ఇక్కడ ఎస్సీ మహిళలతో పాటు పురుషులు కూడా పోటీ చేసే అవకాశం వచ్చింది.

● కమలాపూర్ స్థానం గతంలో బీసీ మహిళకు రిజర్వు కాగా, ఈ సారి బీసీ జనరల్‌కు రిజర్వు అయింది. దీనితో ఇక్కడి నుంచి ఈసారి బీసీ వర్గం నుంచి మహిళలతో పాటు పురుషులు కూడా పోటీ చేసే చాన్స్ లభించింది. భీమదేవరపల్లి సీటు గతంలో బీసీ జనరల్ కాగా, ఈ సారి బీసీ మహిళ అయింది. ఐనవోలు గతంలో జనరల్ కాగా, ఈ సారి ఎస్సీ జనరల్ అయింది. దీనితో ఇక్కడి నుంచి పోటీకి ఆశపడుతున్న బీసీ, ఓసీ వర్గం వారి ఆశలు గల్లంతయ్యాయి. ఈ సారి ఎస్సీ జనరల్ కావడంతో ఎస్సీ వర్గం నుంచి మహిళలు, పురుషులు పోటీ పడనున్నారు.

● వేలేరు గతంలో జనరల్ మహిళకాగా, ఈ సారి కూడా జనరల్ మహిళే అయింది. దీనితో తాజా మాజీ ఇక్కడ నుంచి తిరిగి పోటీ చేసే అదృష్టం దక్కించుకున్నట్లయింది. ఆత్మకూరు గతంలో బీసీ మహిళ కాగా, ఈసారి బీసీ జనరల్ అయింది. దామెర గతంలో ఎస్సీ మహిళ కాగా, ఈ సారి బీసీ మహిళ అయింది. పరకాల గతంలో ఎస్సీ జనరల్ కాగా, ఈసారి జనరల్ అయింది. దీనితో ఈ స్థానంలో పోటీ తీవ్రంగా ఉండనున్నది. శాయంపేట గతంలో జనరల్ మహిళ కాగా, ఈసారి బీసీ జనరల్ అయింది. నడికూడ గతంలో ఎస్సీ మహిళ కాగా, ఈ సారి జనరల్ అయింది. ఇక్కడ కూడా పోటీ తీవ్రంగా ఉండనున్నది.

జనరల్ స్థానాల్లో పోటీ తీవ్రం

ధర్మసాగర్ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు గతంలో జనరల్ మహిళ కాగా, ఈ సారి కూడా జనరల్ మహిళగా రిజర్వు కావడంతో తాజా మాజీలకు తిరిగి పోటీ చేసే అవకాశం కలిసి వచ్చినట్లయింది. ఈ స్థానం నుంచి జడ్పీటీసీగా పిట్టల శ్రీలత, ఎంపీపీగా నిమ్మ కవిత గెలిచారు. వీరిద్దరు బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం తిరిగి టికెట్ ఇస్తే వీరే మళ్లీ బరిలో ఉండే అవకాశం లేకపోలేదు. నడికూడ జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు గతంలో ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, ఈ సారి జనరల్ అయింది. దీనితో ఈ రెండు స్థానాల నుంచి ఈ సారి పోటీ తీవ్రంగా ఉండనున్నది. తాజీ మాజీలు కూడా పోటీ పడే అవకాశాలు లేకపోలేదు.

పరకాల జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లోనూ ఈ సారి పోటీ తీవ్రంగా ఉండనున్నది. గతంలో ఈ రెండు స్థానాలు ఎస్సీ జనరల్‌కు రిజర్వు కాగా, ఈసారి జనరల్ కావడంతో ఆశావహుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. గతంలో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ పక్షాన ఎంపీపీగా గెలిచిన స్వర్ణలత తర్వాత కాంగ్రెస్‌లో చేరింది. జడ్పీటీసీగా గెలిచిన సిలివేరు మొగిలి ఇటీవల మృతి చెందారు. జనరల్ కావడంతో ఆశావహులు అప్పుడే తమ గాడ్ ఫాదర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

వేలేరు గతంలో ఎంపీపీ స్థానం జనరల్‌కు రిజర్వు కావడంతో కేసిరెడ్డి సమ్మిరెడ్డి గెలిచారు. జడ్పీటీసీ జనరల్ మహిళకు రిజర్వు కావడంతో చాడా సరితా రెడ్డి గెలిచారు. గతంలో కన్నా భిన్నంగా ఈసారి రెండు స్థానాలు జనరల్ మహిళకు రిజర్వు కావడంతో ఇక్కడి నుంచి పురుషులు పోటీపడే అవకాశం లేకుండా పోయింది. ఎల్కతుర్తి ఎంపీపీ, జడ్పీటీసీలు ఎస్సీ జనరల్‌కు రిజర్వు చేశారు. ఈ సారి కచ్చితంగా బీసీలకు రిజర్వు అవుతుందని ఇక్కడి నేతలు భావించారు. కానీ ఇందుకు భిన్నంగా మళ్లీ ఎస్సీలకే రిజర్వు అయింది. దీనితో బీసీలకు అవకాశం లేకుండాపోయింది.

ఎంపీటీసీ రిజర్వేషన్లు విడుదల

హనుమకొండ జిల్లాలో 129 స్థానాల జాబితా ప్రకటించిన అధికారులు

హనుమకొండ, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక, గ్రామపంచాయతీ షెడ్యూల్ వెలువడడంతో ఎన్నికల నిర్వహణపై అనిశ్చితి తొలగిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 విడుదల చేయడంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సందిగ్ధంలో పడింది. దీంతో జిల్లా యంత్రాంగాలు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుల రిజర్వేషన్ల వివరాలను అధికారికంగా ప్రకటించకుండా నిలిపివేశారు. ఎంపీపీ, జడ్పీటీసీల రిజర్వేషన్ల వివరాలు ఇంతకుముందే అనధికారికంగా వెల్లడైనా, హైకోర్టు వ్యాఖ్యలతో ఎంపీటీసీల రిజర్వేషన్ల జాబితాను పెండింగ్‌లో పెట్టారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నది. దీనితో ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌లో సోమవారం జారీ చేసింది. ఈ మేరకు జిల్లా యంత్రాలు స్థానిక సంస్థల రిజర్వేషన్లను వివరాలను గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మంగళవారం అధికారింగా విడుదల చేశారు. తాజాగా ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ల జాబితా విడుదలైంది.

రిజర్వేషన్లు ఇలా

జిల్లాలోని 12 ఎంపీపీలు, 12 జడ్పీటీసీలతో పాటు తాజాగా 129 ఎంపీటీసీ రిజర్వేషన్లను ఖరారు చేశారు. ఈమేరకు గెజిట్‌లో ప్రచురించారు. రిజర్వేషన్ల జాబితాను మంగళవారం అధికారికంగా జారీ చేశారు ఎంపీపీ 12 స్థానాల్లో ఎస్సీలకు 3(మహిళలకు -1, జనరల్ (మహిళలు/పురుషులు)2, బీసీలకు 5(మహిళలకు -2, జనరల్ (పురుషులు /మహిళలు) -3, జనరల్ 4(మహిళలు-2, జనరల్ (పురుషులు/మహిళలు) -2) రిజర్వే అయ్యాయి. 12 జడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు కూడా ఇలాగే చేశారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు ఇలా..

మొత్తం 129 ఎంపీటీసీ స్థానాల్లో బీసీ జనరల్‌కు (పురుషులు/మహిళలు) 20, బీసీ (మహిళలు) 26, ఎస్సీ జనరల్ (పురుషులు/మహిళలు) 18, ఎస్సీ (మహిళలు) 13, ఎస్టీ జనరల్ (పురుషులు/మహిళలు) 1, ఎస్టీ (మహిళ) 1, జనరల్ (పురుషులు/మహిళలు) 23, జనరల్ (మహిళలు) 17 రిజర్వు అయ్యాయి.

మండలాల వారీగా ఎంపీటీసీలు

ఆత్మకూరు 9, భీమదేవరపల్లి 14, దామెర 8, ధర్మసాగర్ 13, ఎల్కతుర్తి 12, హసన్‌పర్తి 9, ఐనవోలు 13, కమలాపూర్ 18, నడికూడ 10, పరకాల 5, శాయంపేట 12, వేలేరు 6

మండలం	ఎంపీటీసీ	రిజర్వేషన్
ఆత్మకూరు మండలం	అక్కంపేట	ఎస్సీ (మహిళ)
	చౌళ్లపల్లి	ఎస్సీ (జనరల్)
	ఆత్మకూరు-1	బీసీ (మహిళ)
	గూడెప్పాడు	బీసీ (మహిళ)
	పెంచికలపేట	బీసీ (జనరల్)
	హౌజ్‌బురుజు	జనరల్ (జనరల్)
	నీరుకుళ్ల	జనరల్ (జనరల్)
	పెద్దాపూర్	జనరల్ (మహిళ)
	ఎర్రబెల్లి	ఎస్టీ (జనరల్)
	గట్టునర్సింగాపూర్	ఎస్‌సీ (జనరల్)
	ముల్కనూరు-2	ఎస్‌సీ (జనరల్)
	వంగర	ఎస్‌సీ (జనరల్)
	భీమదేవరపల్లి	బీసీ (జనరల్)
	కొత్తకొండ	బీసీ (జనరల్)
	కొత్తపల్లి	బీసీ (జనరల్)
	మాణిక్యాపూర్	బీసీ (మహిళ)
	ముల్కనూరు-1	బీసీ (మహిళ)
	రత్నగిరి	బీసీ (జనరల్)
	కొప్పూరు	జనరల్ (జనరల్)
	మల్లారం	జనరల్ (జనరల్)
	ముస్తఫాపూర్	జనరల్ (మహిళ)
	రంగయ్యపలి	జనరల్ (మహిళ)
దామెర	దామెర	ఎస్సీ (జనరల్)
	ఊరుగొండ	ఎస్సీ (మహిళ)
	కోగిల్వాయి	బీసీ (జనరల్)
	లేదెల్ల	బీసీ (మహిళ)
	ఒగ్లాపూర్	బీసీ (జనరల్)
	దుర్గంపేట	జనరల్ (మహిళ)
	పసరగొండ	జనరల్ (జనరల్)
	పులుకుర్తి	జనరల్ (జనరల్)
ధర్మసాగర్	ఎలుకుర్తి	ఎస్సీ (జనరల్)
	సాయిపేట	ఎస్సీ (మహిళ)
	తాటికాయ	ఎస్సీ (జనరల్)
	ధర్మాపూర్	బీసీ (జనరల్)
	ధర్మసాగర్ -1	బీసీ (మహిళ)
	మల్లక్‌పల్లి	బీసీ (మహిళ)
	నారాయణగిరి	బీసీ (జనరల్)
	పెద్దపెండ్యాల-1	బీసీ (జనరల్)
	పెద్దపెండ్యాల-2	బీసీ (మహిళ)
	దేవునూరు	జనరల్ (జనరల్)
	ధర్మసాగర్-2	జనరల్ (మహిళ)
	ధర్మసాగర్-3	జనరల్ (జనరల్)
	ముప్పారం	జనరల్ (మహిళ)
ఎల్కతుర్తి	బావుపేట	ఎస్సీ (మహిళ)
	దండెపల్లి	ఎస్సీ (జనరల్)
	ఎల్కతుర్తి	ఎస్సీ (మహిళ)
	గోపాల్‌పూర్	ఎస్సీ (జనరల్)
	చింతలపల్లి	బీసీ (జనరల్)
	జీలుగుల	బీసీ (జనరల్)
	కేశవాపూర్	బీసీ (మహిళ)
	పెంచికలపేట	బీసీ (మహిళ)
	సూరారం	బీసీ (జనరల్)
	దామెర-1	జనరల్ (జనరల్)
	దామెర-2	జనరల్ (మహిళ)
	వల్భాపూర్	జనరల్ (జనరల్)
హసన్‌పర్తి	అనంతసాగర్	ఎస్సీ (జనరల్)
	సిద్ధాపూర్	ఎస్సీ (మహిళ)
	భైరాన్‌పల్లి	బీసీ (మహిళ)
	మల్లారెడ్డిపల్లి	బీసీ (జనరల్)
	నాగారం	బీసీ (మహిళ)
	పెంబర్తి	బీసీ (జనరల్)
	జయగిరి	జనరల్ (జనరల్)
	మడిపెల్లి	జనరల్ (మహిళ)
	సీతంపేట	జనరల్ (జనరల్)

మండలం	ఎంపీటీసీ	రిజర్వేషన్
ఐనవోలు	ఐనవోలు-2	ఎస్సీ (మహిళ)
	నందనం	ఎస్సీ (జనరల్)
	వనమాలకనపర్తి	ఎస్సీ (జనరల్)
	గరిమిళ్లపల్లి	బీసీ (జనరల్)
	కక్కిరాలపల్లి	బీసీ (మహిళ)
	కొండపర్తి	బీసీ (మహిళ)
	ముల్కలగూడెం	బీసీ (మహిళ)
	పంథిని	బీసీ (మహిళ)
	రాంనగర్	బీసీ (జనరల్)
	ఐనవోలు-1	జనరల్ (జనరల్)
	ఒంటిమామిడిపల్లి	జనరల్ (మహిళ)
	పున్నేలు	జనరల్ (మహిళ)
	వెంకటాపూర్	జనరల్ (జనరల్)
కమలాపూర్	అంబాల	ఎస్సీ (మహిళ)
	గూడూరు	ఎస్సీ (జనరల్)
	మాధన్నపేట	ఎస్సీ (మహిళ)
	ఉప్పల్-2	ఎస్సీ (జనరల్)
	భీంపల్లి	బీసీ (మహిళ)
	కానిపర్తి	బీసీ (జనరల్)
	కన్నూరు	బీసీ (మహిళ)
	మరిపల్లిగూడెం	బీసీ (జనరల్)
	శనిగరం	బీసీ (జనరల్)
	శ్రీరాములపల్లి	బీసీ (జనరల్)
	ఉప్పల్-1	బీసీ (మహిళ)
	వంగపల్లి	బీసీ (మహిళ)
	గుండేడు	జనరల్ (జనరల్)
	కమలాపూర్-1	జనరల్ (జనరల్)
	కమలాపూర్-2	జనరల్ (జనరల్)
	కమలాపూర్-3	జనరల్ (జనరల్)
	పంగిడిపల్లి	జనరల్ (మహిళ)
	వెంకటేశ్వర్లపల్లి	జనరల్ (మహిళ)
నడికూడ	కంఠాత్మకూరు	ఎస్సీ (జనరల్)
	రాయపర్తి	ఎస్సీ (జనరల్)
	వరికోలు	ఎస్సీ (మహిళ)
	చెర్లపల్లి	బీసీ (జనరల్)
	కౌకొండ	బీసీ (మహిళ)
	నడికూడ	బీసీ (మహిళ)
	నార్లాపూర్	బీసీ (జనరల్)
	చౌటుపర్తి	జనరల్ (మహిళ)
	నర్సక్కపల్లి	జనరల్ (జనరల్)
	పులిగిల్ల	జనరల్ (జనరల్)
పరకాల	మల్లక్కపేట	ఎస్సీ (జనరల్)
	నాగారం	బీసీ (జనరల్)
	పోచారం	బీసీ (మహిళ)
	లక్ష్మీపురం	జనరల్ (మహిళ)
	వెల్లంపల్లి	జనరల్ (జనరల్)
శాయంపేట	గట్లకానిపర్తి	ఎస్సీ (జనరల్)
	కొప్పుల	ఎస్సీ (మహిళ)
	తహరాపూర్	ఎస్సీ (జనరల్)
	కాట్రపల్లి	బీసీ (జనరల్)
	మైలారం	బీసీ (జనరల్)
	పత్తిపాక	బీసీ (మహిళ)
	ప్రగతి సింగారం	బీసీ (మహిళ)
	శాయంపేట-2	బీసీ (జనరల్)
	పెద్దకోడెపాక-1	జనరల్ (జనరల్)
	పెద్దకోడెపాక-2	జనరల్ (మహిళ)
	శాయంపేట-1	జనరల్ (మహిళ)
	వసంతాపూర్	జనరల్ (జనరల్)
వేలేరు	పీచర	ఎస్టీ (మహిళ)
	సోడషపల్లి	ఎస్సీ (మహిళ)
	కమ్మరిపేట	బీసీ (జనరల్)
	మల్లికుదుర్ల	బీసీ (మహిళ)
	వేలేరు-2	బీసీ (జనరల్)
	వేలేరు-1	జనరల్ (జనరల్)

హనుమకొండ జిల్లాకు తౌటం రోహిత్

ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు



రోహిత్ నేతతో తల్లిదండ్రులు, పెద్దనాన్న పెద్దమ్మలు

కమలాపూర్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో 13వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన తౌటం రోహిత్ నేత మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు రిపోర్టు చేశారు. ప్రభుత్వం ఆయనను శిక్షణ నిమిత్తం హనుమకొండ జిల్లాకు కేటాయించింది. రోహిత్ స్వస్థలం కమలాపూర్. ఆయన తండ్రి సురేందర్ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తుండగా, తల్లి రాధిక గృహిణిగా ఉన్నారు. సోదరి సౌమ్య ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు వెళ్లారు. రోహిత్ విద్యాభ్యాసం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో జరగగా, ఇంటర్మీడియట్, బీటెక్ హైదరాబాదులో చదివారు. బీటెక్ పూర్తికాగానే సంవత్సరం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఉద్యోగం వదలి రెండేళ్లుగా సివిల్స్, గ్రూప్ 1 కోసం ప్రిపేర్ అవుతున్నారు. ఎట్టకేలకు గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందించారు. రోహిత్ వెంట ఆయన తల్లిదండ్రులు, పెద్దమ్మ పెద్దనాన్న కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీరాణి, రవీందర్ ఉన్నారు.



బి.శ్రీధర్‌స్వామి సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రతిభావంతులకు భువన, నంది అవార్డుల ప్రదానం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భువన సుస్వర మ్యూజిక్ అకాడమీ వరంగల్ వారు సోమవారం రాత్రి హనుమకొండ ప్రెస్‌క్లబ్ వేదికగా నిర్వహించిన నంది అవార్డుల ప్రదానోత్సవంలో భిన్న రంగాల్లోని ప్రతిభావంతులకు అందజేశారు. ప్రముఖ గాయకుడు చోటు ఆలపించిన పాటలకు యూఎస్ఏ వరల్డ్ రికార్డ్ సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు, ప్రొఫెసర్ తిరుపతయ్య, సినీ సంగీత దర్శకుడు నీతాల రఘువేందర్, ప్రముఖ గాయకుడు సిలువేరు శ్రీకాంత్, మ్యూజిక్ డైరెక్టర్ ప్రనీల్, కళా పోషకుడు మహేశ్వరం ఉపేందర్, ఘంటసాల గాయకుడు గజవెల్లి రాంనర్సింహస్వామి, రోజా క్రియేషన్స్ నిర్వాహకుడు ఆలేటి శ్యామ్, ప్రముఖ రంగస్థల నటులు బిటవరం శ్రీధరస్వామి, పోకల శ్రీనివాస్, జ్యోతి, తులసీ తదితర అనేకమంది నంది అవార్డులను అందుకున్నారు.

లారీ ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి







మృతిచెందిన రవీందర్ (ఫైల్)

పరకాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్‌ను కంకర లారీ బలిగొన్న ఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ (58) పరకాల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం డ్యూటీ ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో కామారెడ్డిపల్లి వద్ద మాందారిపేట నుంచి పరకాల వైపు వెళుతున్న కంకర లారీ గొర్రెల మందను తప్పించబోయి కొర్లకాపరి పాలకుర్తి సాంబయ్యను ఢీకొట్టి హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాంబయ్య స్వల్పంగా గాయపడగా, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పరకాల ఎస్ఐ విఠల్, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ మృతి చెందాడు. దీంతో పరకాల పోలీసు స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

కన్స్యూమర్ రైట్స్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా నరేశ్



వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ బారి నరేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషన్ జాతీయ అధ్యక్షుడు సాయి రమేశ్‌గౌడ్, జాతీయ అబ్జర్వర్ రాధాకృష్ణ సంయుక్త తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ బారి నరేశ్ మాట్లాడుతూ.. నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆశయాలకు అనుగుణంగా, సంస్థ లక్ష్యాలను చేరుకోవడానికి శాయశక్తులా కృషిచేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సాయి రమేశ్‌గౌడ్‌కు, రాధాకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శ్రామిక రాష్ట్ర మహిళ సదస్సును విజయవంతం చేయాలి..

సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి మాధవి

రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్ ఆవిష్కరణ



శ్రామిక మహిళా సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర మహిళ కార్యదర్శి మాధవి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్టోబరు 5, 6వ తేదీల్లో కాగజ్‌నగర్‌లో నిర్వహించతలపెట్టిన శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి ఎస్.రజిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు కాసు మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను మాధవి ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు.

శ్రామిక మహిళలపై పనిచేసే ప్రదేశాల్లో హింస. అత్యాచారాలు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులను అరికట్టాలన్నారు. సమాన పనికి సమాన వేతనంతో పాటు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలు గౌరవ ప్రదమైన జీవనం కొనసాగించడానికి అన్ని రకాల రక్షణ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ల కోసం దేశ వ్యాప్తంగా సీఐటీయూ నిరంతర ఉద్యమాన్ని చేపట్టనున్నామని మాధవి హెచ్చరించారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ఎజెండాలో పైఅంశాలను చేర్చకపోవడం శోచనీయంగా ఉందన్నారు. శ్రామిక మహిళల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలని మాధవి కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పని చేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా సాధికారత ప్రధాన లక్ష్యం అని పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మహిళా వర్కర్ల చేత వెట్టిచాకిరీ ఎందుకు చేపిస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని రమేష్ అన్నారు. ఈ సదస్సులో హైమావతి, కె.జమున, శోభారాణి, కె.రమాదేవి, యాకూబీ, లీల. స్వప్న, కళావతి పాల్గొన్నారు.


మహిళలతో కిక్కిరిసిన రంగలీల మైదానం


బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


భద్రకాళి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బతుకమ్మలతో వస్తున్న మహిళలు

పూలవనంలా
రంగలీల మైదానం

- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళాలోకం

కరీమాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల జాతర సద్దుల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సారి సద్దుల బతుకమ్మ తేదీపై గందరగోళం నెలకొనడంతో సోమవారం కొందరు, మంగళవారం మరికొందరు జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో వేడుక కన్నుల పండువగా జరిగింది. పించారు. వేలాది మంది మహిళలు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో రావడంతో రంగలీలా మైదానం పూల జాతరను తలపించింది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడపడుచులు పాడిన ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ పాటలు పాడి సంప్రదాయబద్ధంగా ఆడి ఉర్సు రంగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపు కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గౌరమ్మ రూపమైన పసుపు ముద్దతో మాంగళ్య భాగ్యం కలకాలం నిలవాలని ప్రార్థించారు. ఉత్సవాల్లో మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్సై సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. వేడుకల్లో కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్‌లు మరుపల్ల రవి, పల్లం పద్మా రవి, ముష్కమల్ల అరుణా సుధాకర్ పాల్గొన్నారు. కాగా, ఈ వేడుకల్లో నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ శాసన సభ్యుడు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. స్థానిక మహిళలతో బతుకమ్మ ఆటలు ఆడి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.




బందోబస్తులో ఉన్న ఎస్సైకి బొట్టు పెడుతున్న మహిళ


బతుకమ్మతో వస్తున్న హిజ్రాలు


రంగలీల మైదానంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


బతుకమ్మను చెరువులో వదులుతున్న యువతి

బీసీల రిజర్వేషన్లకు మద్దతివ్వాలి

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు
- దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ 6పనులకు
- రూ.1,001కోట్లు మంజూరు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల అమలుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని పార్టీలు మద్దతివ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరి చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి మంగళవారం పార్టీ కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో భాగంగా బీసీ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి, బిల్లు ఆమోదం కోసం గవర్నర్‌కు, కేంద్రానికి పంపినా స్పందించడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పనకు ప్రభుత్వం జీవోను విడుదల చేసి చరిత్రను సృష్టించిందన్నారు. బిల్లును రద్దు చేయాలని కోర్టులకు వెళ్లడం మానుకొని, బీసీలకు మద్దతుగా నిలువాలని కడియం కోరారు. ఈబీసీ రిజర్వేషన్ల అమలు సమయంలో స్పందించని పార్టీలు బీసీ రిజర్వేషన్ల అమలుపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

హామీ మేరకు మునిసిపాలిటీగా మార్చాను..

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా మార్చుతానని మాట ఇచ్చి, నిలుపుకున్నానని కడియం పేర్కొన్నారు. మునిసిపాలిటీగా మారడమే కాకుండా మునిసిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌పై ప్రేమతో రూ.50కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ప్రజల తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ-6లో భాగంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 78వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి సవరించిన అంచనాలతో ప్రభుత్వం రూ.1,001కోట్ల నిధులు మంజూరి చేస్తూ పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చిందన్నారు. నియోజకవర్గానికి ఏం కావాలి, ఏం చేయాలనే ఆలోచనతోనే పని చేస్తున్నట్లు కడియం పేర్కొన్నారు. నియోజకవర్గ రైతులకు సాగునీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేబడుతున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించుకోవాలని, అందరూ ఒకేతాటిపై ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్యా-శిరీష్ రెడ్డి, చిలుపూరు దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, గడ్డమీది సురేష్, నాయకులు అంబటి కిషన్‌రాజు, బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, పోశాల కృష్ణ, మధుసూదన్ రెడ్డి, రాపోలు శివచరణ్ రెడ్డి, కుందూరు వెంకట్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నీల గట్టయ్య, తెల్లాకుల రామకృష్ణ, రజాక్‌యాదవ్, నాగరబోయిన యాదగిరి, యార సెల్ కొమురెల్లి, గట్టు ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఎత్తిన బాషా దంపతులు

వరంగల్‌సిటీ, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14 వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ముస్లిం మైనారిటీ నాయకుడు బాషా రజియా దంపతులు బతుకమ్మను ఎత్తుకొని కుటుంబ సమేతంగా వెళ్లి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బాషా దంపతులు బతుకమ్మను రంగురంగుల పూలతో అలంకరించి నెత్తిన ఎత్తుకుని వేడుకల వద్దకు వెళ్లారు. బాషాను చూసి అందరూ ఆప్యాయంగా పలకరించారు. అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. కుల మతాలు అనేవి మనం సృష్టించుకున్నవేనని, అన్ని పండుగలను అందరం కలిసి చేసుకుంటే మత సామరస్యం వెల్లివిరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.


ఇందిరమ్మకాలనీలో కుటుంబ సభ్యులతో బతుకమ్మను ఎత్తుకుని వస్తున్న బాషా

కొండెక్కిన మటన్

- దసరా పండుగ వేళ రూ.వెయ్యికి చేరిన కేజీ ధర
- రూ.10 వేల నుంచి 20వేలు పలుకుతున్న పొట్టేలు
- ఐదేళ్ల తర్వాత పెరిగిన రేట్లు

శంభునిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చిందంటే చాలు సుక్క, ముక్క ఉండాల్సిందే. దసరా పండుగకు మటన్‌కు యమ క్రేజ్ ఉంటుంది. పొట్టేళ్ళ మాంసానికి మరీ ఎక్కువ డిమాండ్ ఉండటంతో మార్కెట్‌లో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. పది కేజీల మాంసం ఉండే పొట్టేలు ధర సంతల్లోనే రూ.10 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. దీంతో మాంసం ధరలు అమాంతం పెరిగి జిల్లాలో తొలిసారి మటన్ కిలో రేటు రూ.1000కి చేరింది. ఐదేళ్ళ క్రితం 900 పలికిన మటన్ ధర, ప్రస్తుతం రూ.వెయ్యి పలుకుతోంది. 2018లో రూ.800, 2021లో రూ.900 అమ్మగా ప్రస్తుతం 2025లో రూ.1000 చేరింది.

పొట్టేళ్ళ కొరత..

మటన్ అంటే మాంసం ప్రియులు అమితంగా ఇష్టపడుతుంటారు. అందులో పొట్టేలు మాంసానికి ఉన్న క్రేజే వేరు. అయితే మార్కెట్‌లో డిమాండ్‌కు తగిన పొట్టేళ్ళ ఉత్పత్తి లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొమ్మాల, పాలకుర్తి, రఘునాథపల్లి, తొర్రూర్, జంగాలపల్లి, ముల్కనూరు, నెక్కొండ సంతల్లో పొట్టేళ్ళ క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వీటికి తోడు గ్రామాల్లోని మందల్లో కొనుగోలు చేస్తుంటారు. కాని ఈ సంతల్లో అమ్మే జీవాలు జిల్లాలోని మాంసాహరులకు సరిపోవడం లేదు. వరంగల్ జిల్లాలో నెలకు సుమారు ఆరు నుంచి ఏడు వేల జీవాలను మాంసం ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పెళ్ళిల్ళు, పండుగ సీజన్‌లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. కాని మన జిల్లాలో సగానికి పైగా యాటల ఉత్పత్తి కూడా లేదు. దీంతో మాంసం విక్రయదారులు జిల్లాలోని సంతలే కాకుండా హైదరాబాద్, మిర్యాలగూడ, పెబ్బేరు, అనంతపురం, ఇచ్చోడ, నవీపేట, నాగ్‌పూర్, ఇతర సంతలకు వెళ్ళి పెద్ద సంఖ్యలో జీవాలను కొనుగోలు చేస్తున్నారు.

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్, రాష్ట్రాల యాటల మాంసం రుచిగా ఉంటుందని అందరూ నమ్ముతారు. అందుకే వాటికి విపరీతమైన డిమాండ్ ఉంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్ ప్రాంతాల నుంచి లారీల్లో జీవాలను తీసుకువచ్చి తెలంగాణలోని పెద్ద సంతల్లో అమ్ముతున్నారు.



గాంధీ జయంతి ఎఫెక్ట్

ఈ సారి దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావటంతో మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు మాంసం విక్రయదారులు తెలుపుతున్నారు. దసరా సంప్రదాయ ఉత్సవాలకు ఆటంకం కలుగకుండా చూస్తామని తెలిపారు. ఆడపడుచుల పండుగ బతుకమ్మ ముగియగానే దసరా సంబురాలు మొదలవుతాయి. ప్రతీ ఇంట్లో మాంసాహారాన్ని వండుకుంటారు. మూడు రోజులు దసరాను జరుపుకుంటామని.. ఈ విషయంలో తగ్గేదేలేదని మాంసం ప్రియులు ముక్త కంఠంతో చెబుతున్నారు.

రోకలిబండతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో దారుణం

చిట్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో భార్యను భర్త రోకలిబండతో కొట్టి హత్య చేసిన ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలపురం గ్రామంలో కనుకుంట్ల ప్రమీల (50), లింగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇంటి వద్దే ఈ దంపతులు పిండి గిర్నీ నిర్వహిస్తున్నారు. దీనికి తోడు లింగయ్య టైలర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా లింగయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా లింగయ్య మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వడానికి నిరాకరించింది.

ఈ క్రమంలో బయటకు వెళ్లొచ్చిన లింగయ్య ఆ కోపంతో భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య తీవ్రంగా వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన లింగయ్య భార్య ప్రమీలపై దాడి చేశాడు. రోకలిబండతో తలపై పలుమార్లు కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చుట్టుపక్కల వారు గమనించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీసీ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఘటన స్థలంలో ప్రమీల మృతదేహం



సూర్యుడి చుట్టూ వలయాకారం

ఆకాశంలోని సూర్యుడి చుట్టూ మంగళవారం మధ్యాహ్నం వలయాకారం కనిపించడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. వారం రోజులుగా వర్షాలు కురవడంతో మేఘావృతమై ఉండి ఆకాశంలో సూర్యుడు కనిపించలేదు. సోమ, మంగళవారాలు ఎండ కాయడంతో మంగళవారం సూర్యుడు కనిపించడం, దాని చుట్టూ ఇంద్రధనస్సులా వలయాకారం కనిపించడాన్ని పలువురు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, దుగ్గొండి

బీసీ రిజర్వేషన్ల తీరుపై గగ్గోలు

- ఇద్దరు ఓటర్లే ఉన్నా రిజర్వేషన్ కేటాయింపు
- తలలు పట్టుకుంటున్న స్థానిక నేతలు

మరిపెడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తండాకు ఇద్దరే బీసీ ఓట ర్లు ఉన్న ఐదు జీపీలను బీసీలకు కేటాయిస్తూ అధికారులు గెజిట్ విడు దల చేశారు. దీంతో ఆ తండాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల స్థానిక నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఆ రిజర్వేషన్లను సత్వరం రద్దు చేసి ఎస్టీలకు కేటాయించాలని ఆయా తండాల జనం కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అజ్మీరాతండా, అమ్మ తండా, వెంకట్యాతండా, ధరావత్‌తండా, నేతావత్ పర్కాజల్ తండా జీపీ లలో 99.9 శాతం గిరిజనులు ఉన్నారు. ఆ తండా జీపీలను అధికారులు గుడ్డిగా బీసీలకు కేటాయించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆయా తండాల నేతలు తంటాలు పడుతున్నారు.

ఇద్దరే ఓటర్లు

అమృతండా, అజ్మీరాతండా, ధరావత్‌తండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్ తండాలలోని జీపీలలో ఇతర రాష్ట్రలకు చెందిన భార్యాభర్తలు ఆయా జీపీకి ఇద్దరేసి చొప్పున ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వ్యవసాయ పనుల కోసం కూలీలుగా వచ్చి ఉండడంతో అప్పట్లో వారిని ఓటర్లుగా నమోదు చేశారు. అమృతండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్‌తండా, అజ్మీరా తండా జీపీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దరేసి బీసీ ఓటర్లు ఉండగా ఆ తండాల జీపీలను, ఇక ధరావత్ తండాలో నలుగురు ముస్లిం ఓటర్లు ఉండగా దానిని కూడా బీసీలకే కేటాయించారు. 99.9 పైగా ఓటర్లు ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ కేటాయించలేదు. బీసీలకు తండా పంచాయతీలను రిజర్వేషన్ చేయడంపై అక్కడి ఓటర్లు ప్రభుత్వ విధానంపై మండి పడుతున్నారు.

జీపీలను ఎస్టీలకు కేటాయించాలి

99.9 శాతంకు పైగా గిరిజన ఓటర్లు ఉన్న తండా జీపీలను బీసీలకు రిజర్వేషన్ చేయడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు తమ తప్పులను సరిదిద్దుకుంటే మంచిది. లేకుంటే ప్రభుత్వంపై గిరిజనులు తిరగబడతారు. తండాల్లో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలి.


ధరావత్ పద్మ, మాజీ సర్పంచ్, అమృతండా జీపీ



అమృతండా జీపీ కార్యాలయం

తండాలో ఎస్టీల పాలనకు సమాధి చేసే కుట్ర

99.9 శాతం గిరిజన ఓటర్లు ఉన్న తండాలను ఇతర కులాల వారికి కేటాయించడం తమ తండాలో తమ పాలనను సమాధి చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని లంబాడీల ఐక్య వేదిక ఇదివరకే ఆరోపించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 50 శాతం గిరిజన జనాభా ఉంటే ఎస్టీలకే తండాల జీపీలను కేటాయించిందని గిరిజన సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తండా జీపీలను తండా వాసులకే రిజర్వు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

యూకేలో బతుకమ్మ వేడుకలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ వేడుకలను శ్రీ నిలయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి యూకేలో ఘనంగా నిర్వహించారు. ఆ ప్రాంతంలో నివాసముంటున్న సుమారు 200మంది మహిళలు పలు రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. వీరిలో హనుమకొండ బ్రాహ్మణవాడకు చెందిన ఇందు, వెన్నెల, బిందు తదితర మహిళలు రాగ యుక్తంగా పాడుతూ తెలంగాణ పాటలను వినిపించి బతుకమ్మ సంస్కృతిని పరిచయం చేశారు. అనంతరం సద్దులను వాయినాలు అందించుకొని ప్రసాదంగా పంచి పెట్టారు.



వేడుకల్లో ఓరుగల్లు మహిళలు



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వడ్డెపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మంగళవారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని వెంకటేశ్వర కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని ఎమ్మెల్యే నాగరాజు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొంక హరిబాబు, కాంగ్రెస్ శ్రేణులు కేఆర్.కృష్ణమూర్తి, వీసం సురేందర్‌రెడ్డి, మర్రి ప్రభాకర్, శనిగరపు అనిల్, నారాయణరెడ్డి, పిన్నింటి విజేందర్‌రెడ్డితోపాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేపు కేయూలో గాంధీ జయంతి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిపాలన భవనంలో అక్టోబరు 2న ఉదయం 11 గంటలకు మహాత్మాగాంధీ జయంతిని నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. బోధన, బోధనేతర సిబ్బందితో పాటు స్కాలర్స్, విద్యార్థులు హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కేయూ సెక్యూరిటీ గార్డు ఉద్యోగ విరమణ



సదానందంను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తదితరులు

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కేయూ ఫార్మసీ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఎం.సదానందంకు మంగళవారం వీడ్కోలు సభ నిర్వహించారు. కేయూ పరిపాలన భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం మెమోంటో అందచేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉద్యోగసంఘాల నేతలు బుర్రా నవీన్‌కుమార్, వల్లాల తిరుపతి, బొక్క మొగిలి, సతీశ్, కృష్ణవేణి, నర్మద, తిరుమల్‌సింగ్, తాటి దామోదర్, పీఆర్‌ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



కాంగ్రెస్ పార్టీ జెండాకు వందనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని తమ సత్తా చాటాలని కాంగ్రెస్ సేవాదల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ అన్నారు. కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండ కంచరకుంటలో జెండా పండగను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ.. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర, జిల్లా నాయకులు సముద్రాల సోమయ్య, పుల్లూరు యాదగిరి, బాలరాజ్, గోవింద్ హనుమమహా, తాటికొండ ప్రసాద్, తాళ్లపల్లి రాజు, హన్మకొండ రాజేందర్, ధూమిల కిశోర్, అనిల్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

మోదీ పాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరికలు

మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రధాని పాలనకు ఆకర్షితులై ఆ యా పార్టీల నుంచి బీజేపీలో చేరడం హర్షనీయమని వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధి ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఆయా పార్టీలకు చెందిన సుమారు 100 మంది బీజేపీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తు న్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసి ప్రణయ్, నాయకులు దొనికెల వెంకటేష్, రాజేష్, సుమన్, రవి, సంపత్, కరుణాకర్, శ్రీకాంత్, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

దుర్గాదేవిగా రుద్రేశ్వరి

9వ రోజుకు చేరిన శరన్నవరాత్రి వేడుకలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో జరుగుతున్న రుద్రేశ్వరీ శరన్నవరాత్రి వేడుకల పర్వం మంగళవారం 9వ రోజుకు చేరుకుంది. సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, చోడచోపచార పూజలను నిర్వహించి, దుర్గా అష్టోత్తరంతో కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారిని అష్టమి తిథికి అనుకూలంగా దుర్గాదేవిగా అలంకరింపజేసి నైవేద్యం సమర్పించారు. భారతీయ వైదిక ధర్మంలో శరత్‌రుతువు విశిష్టమైందని, ఈ రుతువులో అమ్మవారి నవరాత్రి వేడుకలు ప్రారంభం అవుతాయని, ఒక్కో అమ్మవారు భక్తులకు ఒక్కో రక శక్తి స్వరూపాణిగా దర్శనమిస్తుంటారని ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ వ్యాఖ్యానించారు. సింహ వాహనాన్ని అధిష్ఠించిన దుర్గాదేవి భక్తుల్లో మానసిక అశాంతిని దూరంచేసి ధైర్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. దుష్టులను అమ్మవారు శిక్షిస్తుందని పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల్లో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్, క్షేత్ర ప్రచారక్ భరత్‌జీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. యాగశాలలో నవదుర్గా చండీహోమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర శాప్ ఛైర్మన్ కె.శివసేనారెడ్డి దంపతులు కూడా మంగళవారం అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. రేపల్లె రంగనాథ్, చొల్లేటి కృష్ణమాచార్య, రాజు, ఆలయ సిబ్బంది మధుకర్, ఎల్.రామకృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ భరత్‌జీ పూజలు



రెడ్డికాలనీలో దుర్గామాత విగ్రహం

ఆకట్టుకుంటున్న 51 అడుగుల దుర్గామాత విగ్రహం

రెడ్డికాలనీ, (ఆంధ్రజ్యోతి): హనుమకొండ 4వ డివిజన్ రెడ్డికాలనీలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే మొట్టమొదటిసారిగా 51 అడుగుల దుర్గామాత త్రిశక్తి మాతగా కొలువుదీరింది. ప్రతీరోజు దుర్గామాత విగ్రహాన్ని సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాటు చేశారు. తొలిసారి ఇంత పెద్దఎత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్లరెడ్డికాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కాలనీ సందడిగా మారడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో బీజేపీ నేత రావు పద్మ, గొర్రె ఓం ప్రకాశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వాహనాలతో తిప్పలు

- బాలసముద్రంలో ట్రాఫిక్ కష్టాలు
- ఆస్పత్రుల ముందు భారీగా వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రోగులు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బస్టాండ్ - బాలసముద్రం రోడ్డులో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య పెరుగుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. హనుమకొండలోని బాలసముద్రం ప్రస్తుతం ఆస్పత్రులకు హబ్‌గా మారగా రోగులు, బంధువుల వాహనాలతో ట్రాఫిక్‌మయంగా తయారైంది. ఆస్పత్రులకు ఇష్టారాజ్యంగా అనుమతులు ఇవ్వడంతో పార్కింగ్ స్థలాలు లేక ప్రధాన రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారి వెంట వాహనాలు నిలుపుతుండడంతో బాటసారులు, ఇతర వాహనదా రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రు ల భవన నిర్మాణాలకు అనుమతులిస్తున్న అధికారు లు.. రోగులు, బంధువులు, సిబ్బంది వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దీంతో రోడ్ల వెంట వాహనాలను నిలిపివేయడంతో అత్యవసర సమయంలో వచ్చే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయని నగర వాసులు వాపోతున్నారు. పార్కింగ్ స్థలాలు లేని ఆస్పత్రులను ఇతర ప్రాంతాలకు తరలించాలని పలువురు కోరుతున్నారు.



బాలసముద్రంలోని ఆస్పత్రుల ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు

పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు

హనుమకొండ నగరంలోని ప్రధాన రోడ్లలో నిలిపివేసిన వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. హనుమకొండ బస్టాండ్ కూడలి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు, నక్కలగుట్ట నుంచి బస్టాండ్ జంక్షన్ వరకు వాహనదారులు ఇష్టారాజ్యంగా రోడ్లపై పార్కింగ్ చేస్తుండడంతో అత్యవసర సమయంలో ఆస్పత్రులకు వచ్చే రోగుల వాహనాలకు ఇబ్బంది ఎదురవుతోంది. ఇప్పటికైనా పార్కింగ్ స్థలాలు లేని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వాహనం బీభత్సం

బైక్, టీస్టాల్‌ను ఢీకొట్టడంతో ధ్వంసం



గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ధ్వంసం అయిన ద్విచక్రవాహనం, టీస్టాల్

వడ్డెపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని వడ్డెపల్లి చర్చి జంక్షన్ వద్ద మంగళవారం తెల్లవారు జామున ఓ గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న దుర్ఘటనలో ద్విచక్రవాహనం, టీస్టాల్ ధ్వంసమైంది. పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం తెల్లవారు జామున సుమారు 3 గంటల సమయంలో కాజీపేట నుంచి ఒక గుర్తు తెలియని వాహనం వడ్డెపల్లి జంక్షన్ మీదుగా ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు వైపు వెళ్లే మూలమలుపునకు రాంగ్‌రూట్‌లో వచ్చింది. అక్కడ ఒక కిరాణ షాపు వద్ద పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనాన్ని, అక్కడే ఉన్న ఒక టీస్టాల్‌ను ఢీకొన్నది.

ఈ ప్రమాదంలో ఈ రెండు నుజ్జు నుజ్జు అయ్యాయి. సుమారు రూ.2లక్షల వరకు నష్టం ఉండవచ్చునని అంచనా. అలాగే ఆ వాహనం పక్కనే ఉన్న చెట్టును సైతం ఢీకొనడంతో వాహనం డీజిల్ ట్యాంక్ పగిలి అయిల్ అంతా రోడ్డుపై పడింది.

ఈ సంఘటనలో పారిశుధ్య కార్మికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. డ్రైవర్ తాగి వాహనాన్ని నడపడం వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించారు.

అమల్లోకి ఎన్నికల ప్రవర్తన నియమావళి

- నవంబరు 11 వరకు అమలులో ఎన్నికల కోడ్
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలోనూ ఎన్నికల ప్రవర్త నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలులోకి వచ్చిందని, నవంబరు 11వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ఇచ్చిందని, షెడ్యూల్ నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. సోమవారం నుంచి నవంబరు 11 వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మొదటి దశలో 6 మండలాలు, 67 ఎంపీటీసీ స్థానాలకు, రెండో దశలో ఆరు మండలాలు, 62 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీలకు రాష్ట్రంలో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తుండగా హనుమకొండ జిల్లాలో రెండు, మూడు దశల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో 210 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటిలో 1,986 వార్డులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి దశలో 108 గ్రామ పంచాయతీలకు, 1,074 వార్డులకు, రెండో దశలో 102 గ్రామ పంచాయతీలకు, 912 వార్డులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 3 లక్షల 70వేల 871 మంది ఉండగా ఇందులో పురుషులో 1,80,000 మంది ఓటర్లు, 1,90,000 మంది మహిళా ఓటరుల ఉన్నట్లు పేర్కొన్నారు.ఎన్నికల విధులకు తగినంత సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. గుజరాత్ నుంచి పోలింగ్ బాక్స్‌లను నెల కిందటే జిల్లాకు కేటాయించారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జడ్పీ సీఈవో రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాసరావు, కొలను సంతోష్‌రెడ్డి, కుసుమ శ్యామ్‌సుందర్, ప్రవీణ్ కుమార్, నాగబెల్లి రజనీకాంత్, మంజుల మణి, ఎం.డి.నేహాల్, కొట్టె ఏసోబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

నాటిన మొక్కలను సంరక్షించాలి

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం రాములు

దామెర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒగ్లాపూర్‌లో స్వచ్ఛ భారత్, హరిత హారంలో భాగంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహించి మొక్కలు నాటారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ డీజీఎం రాములు హాజరై మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నాటిన మొక్కలను సరంక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్‌రెడ్డి, కిన్నెర రమేష్(కిన్నెర ఆర్ట్స్), తుమ్మనపెల్లి సోనాజీ, పలకల సాం బరెడ్డి, తుమ్మనపెల్లి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



వేణుగోపాల్ దంపతులను సన్మానిస్తున్న నిట్ డైరెక్టర్

ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానం

కాజీపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాజీపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన సుంకరి వేణుగోపాల్ - రాణి మాలతి దంపతులను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మంగళవారం నిట్ క్యాంపస్‌లో ఘనంగా సన్మానించారు. నిట్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ వేణుగోపాల్ మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో వేణుగోపాల్ దంపతులను పలువురు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్, ఇతర ప్రొఫెసర్లు, తోటి సిబ్బంది మాట్లాడారు.

5న వారాల కుల సంఘం జోనల్ కమిటీ ఎన్నికలు

హసన్‌పర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ వారాల కుల సంఘం జోనల్ కమిటీ ఎన్నికలు అక్టోబరు 5న నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పావుశెట్టి నర్సింహరాములు, కందుకూరి సంజీవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి వారాల కుల సంఘ భవనంలో సెప్టెంబరు 5వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇదే రోజు రాష్ట్ర ఎన్నికల కమిటీ ఆధ్వర్యంలో జోనల్ కమిటీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశంలో కార్యదర్శి నివేదికతో పాటు ఎన్నికల అనంతరం ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కన్వీనర్లు, కార్యవర్గ సభ్యులు, ఆయా గ్రామాల కుల సంఘం సభ్యులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

పూల వనంలా సోమిడి చెరువు



సోమిడిలో బతుకమ్మలు ఆడుతున్న మహిళలు



హనుమకొండ పోచమ్మ కుంటలో బతుకమ్మలతో మహిళలు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

కాజీపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఊరు ఊరంతా మహిళలు బతుకమ్మలు పట్టుకుని సోమిడి చెరువు వద్దకు చేరుకుని బతుకమ్మలు ఆడారు. మహిళలు పాటలు పాడుతూ, బతుకమ్మలు ఆడారు. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలతో సోమిడి చెరువు ప్రాంతం అంతా పూలవనంలా మారింది. స్థానిక కార్పొరేటర్ జక్కుల రమా రవీందర్ యాదవ్ దంపతులు బతుకమ్మలు ఆడే స్థలంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ..పెద్దఎత్తున బతుకమ్మ ఆడటానికి వచ్చిన మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.. మహిళలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి భారీ పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి అలంకారం
శ్రీ మహిషాసురమర్దిని
ఆశ్వయుజ శుద్ధ నవమి (మహర్నవమి) బుధవారం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఈ రోజు శ్రీ మహిషాసురమర్దిని దేవిగా విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దర్శనమిస్తారు. అమ్మవారి నవఅవతారాల్లో మహిషాసుర మర్దినిని మహోగ్రరూపంగా భావిస్తారు. అమ్మ మహిషాసురుడిని సంహరించిన ఆశ్వయుజ శుద్ధ నవమిని 'మహర్నవమి'గా జరుపుకొంటారు. 'చండీ సప్తశతి' ప్రకారం దుర్గాదేవి అష్టభుజాలతో, సింహవాహినిగా మహిషాసురుడి సేనాపతులైన చిక్షురుడు, చామరుడు, ఉదగ్రుడు, బాష్కలుడు, బిడాలుడు తదితర రాక్షసులందర్నీ సంహరించింది. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో అవలీలగా మహిషాసురుణ్ణి



చంపి, అదే స్వరూపంతో ఇంద్రకీలాద్రి మీద స్వయంభువుగా వెలసింది. సింహవాహనాన్ని అధిష్ఠించి, ఆయుధాలను ధరించిన ఆమె సకల దేవతల అంశలతో మహాశక్తి స్వరూపంగా దర్శనమిస్తుంది. ఈ తల్లిని పూజిస్తే సర్వ దేవతల అనుగ్రహం కలుగుతుందంటారు. మహిషాసురమర్దిని ఆరాధన వల్ల భయాలన్నీ తొలగిపోతాయనీ, శత్రు పరాజయం కలుగుతుందనీ, అంతఃశత్రువులు కూడా నశిస్తాయని, ధైర్యం కలుగుతుందనీ, సర్వ కార్యాల్లో విజయం సిద్ధిస్తుందనీ భక్తుల నమ్మకం.

దుర్గా నవరాత్రులు

నైవేద్యం : బెల్లపు అన్నం, పులిహోర, గారెలు, పాయసం, అప్పాలు

అలంకరించే చీర రంగు : గోధుమ, ఎరుపు

అర్చించే పూలు : తామర పుష్పాలు, ఎర్రటి అక్షతలు

పారాయణ చెయ్యాల్సింది : శ్రీ మహిషాసురమర్దినీ స్తోత్రం

స్ఫూర్తి



కండరాల బలహీనత చక్రాల కుర్చీకే పరిమితం చేసింది. ఏ పనీ సొంతగా చేసుకోలేని పరిస్థితి. ఆఖరికి దుస్తులు ధరించాలన్నా వేరొకరి సాయం తప్పనిసరైంది. ఈ అసౌకర్యానికి చెక్ పెడుతూ... తనలాంటివారి కోసం వినూత్న డిజైన్లు రూపొందించారు **సౌమిత బసు.** అమ్మ అండతో 'జైనికా' పేరుతో ఒక సంస్థ నెలకొల్పి... వైకల్యంగల వారికే కాకుండా వృద్ధులకు సైతం సులువుగా ధరించగలిగే సౌకర్యవంతమైన వెరైటీలు అందిస్తున్నారు.

స్టయిలిష్‌గా!

"కష్టాలు అందరికీ ఉంటాయి. జీవితమన్నాక పరీక్షలు ఎదురవుతుంటాయి. వాటిని తట్టుకొని ముందుకు సాగితేనే కదా బతుకు బండి నడిచేది. ఒక లక్ష్యం... దాన్ని సాధించాలన్న పట్టుదల ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవచ్చు. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతా మహానగరం మాది. బాల్యం సంతోషంగా సాగిపోయింది. కానీ కాలేజీలోకి అడుగుపెట్టాక పెద్ద కుదుపు. కండరాల బలహీనతతో శరీరం క్రమంగా నా ఆధీనం కోల్పోతూ వచ్చింది. నా దుస్తులు నేను వేసుకోలేను. షర్ట్ బటన్స్ పెట్టుకోవడం కూడా కష్టమైపోయింది. రోజురోజుకూ పరిస్థితి క్షీణిస్తోంది. ఎక్కడికి వెళ్లాలన్నా నైట్ డ్రెస్‌ల్లోనే. కొన్నాళ్లకు చక్రాల కుర్చీ నాకు ఆధారమైంది. అప్పటికి ఎనభై శాతం శరీరంలో కదలికలు తగ్గిపోయాయి. అమ్మ అమిత తోడుగా ఎలాగో నెట్టుకొచ్చాను.

ఆలోచన మార్చింది...

జీవితాంతం ఇలా వీల్‌చైర్‌లోనే గడపక తప్పదని నాకు అర్థమైంది. అలాంటప్పుడు ఎంతకాలం ఒకరిపై ఆధారపడాలి? ఇది నన్ను తీవ్ర ఆలోచనలోకి నెట్టింది. ముఖ్యంగా దుస్తులు ధరించడంలో ఉన్న ఇబ్బందులను అధిగమించాలనే నిర్ణయానికి వచ్చాను. ఎందుకంటే మాలాంటివారే కాదు, వెన్నెముక గాయాలు, ఇతర దీర్ఘకాలిక నొప్పులు భరిస్తున్న వారు సులువుగా వేసుకోవడానికి వీలైన వస్త్రశ్రేణులు ఎక్కడా కనిపించలేదు. కనుక నేను దానిపైనే దృష్టి పెట్టాను. అమ్మతో కలిసి ప్రయోగాలు ప్రారంభించాను.



ఆ స్వేచ్ఛ ఇవ్వాలని...

నా ఆకాంక్ష ఏంటంటే.. నాలాంటి వారికి నచ్చిన దుస్తులు సులభంగా ధరించగలిగే స్వేచ్ఛ ఇవ్వడం. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం నింపడం. అందుకు తగిన డిజైన్ల రూపకల్పనకు నేను, అమ్మ నిరంతరం ప్రయత్నించాం. ఒకటా రెండా... లెక్కలేనన్ని ప్రయోగాలు చేశాం. టైలర్లను, డిజైనర్లను కలిశాం. అంతర్జాలంలో అధ్యయనం చేసి, సొంతంగా తయారు చేశాం. కుట్టిన డ్రెస్ సౌకర్యంగా ఉందా లేదా అన్నది నేను ధరించి చూశాను. చివరకు మా శ్రమ ఫలించింది. మాగ్నెటిక్, వెల్‌క్రో క్లోజర్స్, నో బెండ్ ట్రౌజర్లు వంటివి రూపొందించాం. అంతేకాకుండా... కస్టమర్లు కోరిన విధంగా, వారి శరీర కదలికలకు తగిన వస్త్రశ్రేణులు అందించాం. అదికూడా స్టైలిష్ డిజైన్లలో. ఇది అద్భుతమైన ఫలితాలు ఇచ్చింది.

అంతా మావెంటే...

అందరికీ అందుబాటులో ఉండేలా 2020లో 'జైనికా' పేరుతో ఒక సంస్థ నెలకొల్పాం. అప్పుడు మావద్ద ఉన్నది 21 వేల రూపాయలు. దాంతోనే పని ప్రారంభించాం. ఆరంభంలో ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయి. అయితే మా తల్లీకూతుళ్ల ప్రయత్నాన్ని చూసి చుట్టుపక్కలవారు ఎంతో ప్రోత్సహించారు. కొన్ని ప్రభుత్వ సంస్థల నుంచి ఆర్థిక సాయం అందింది. మరికొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయి. దాంతో మార్కెటింగ్ కూడా సులువైంది. వారందరి సహాయ సహకారాలతో తక్కువ సమయంలోనే మా ఉత్పత్తులు దేశంలోని ఇతర ప్రాంతాలవారికి కూడా పరిచయమయ్యాయి. క్రమంగా ఆదాయం పెరిగింది. ఇది స్వశక్తితో మేం సాధించిన విజయం అనే కన్నా... ఒక కుటుంబంలా ఊరంతా కలిసి వచ్చి నిలబెట్టిన సంస్థ అంటేనే సబబుగా ఉంటుంది.

మరికొంతమందికి...

మా సంస్థలో పని చేసేవారు కూడా వైకల్యంగలవారే. ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా వందల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఇంటివద్ద నుంచే పని చేసే అవకాశం కల్పించాం. దానివల్ల వారికి ఆర్థిక స్వేచ్ఛ లభించింది. 'మేమూ స్వశక్తితో జీవించగలం' అనే నమ్మకాన్ని ఇవ్వగలిగాం. అందుకే చెబుతున్నా... నేను వారిని సాధికారత వైపు నడిపించడం కాదు, వాళ్లవల్లే నేను సాధికారత సాధించగలిగాను. నాలాగా చక్రాల కుర్చీలో అవస్థలు పడుతున్న ఒకమ్మాయి... 'ఇప్పుడు నా అంతట నేను కుర్తా ధరించగలుగుతున్నా. థ్యాంకూ' అని అంది. ఆ మాటలకు నా కళ్లు చెమర్చాయి. నిత్యం ఇలా ఎంతోమంది సందేశాలు పంపుతుంటారు. అవి చూసినప్పుడు నా వైకల్యాన్ని మరిచిపోతాను. ఆనందంతో ఉప్పొంగిపోతాను.

అదే నా కోరిక...

మా సంస్థను మరింత విస్తరించాలి. దేశంలోని అన్ని ప్రాంతాల్లోని వారికీ చేరువ చేయాలి. ఏ ఒక్కరూ నాలాగా బాధపడకూడదు. ఇదే నా సంకల్పం. ఏదిఏమైనా చిన్న మొత్తంతో ప్రారంభించిన మా వ్యాపారం ఇప్పుడు లాభదాయకంగా సాగుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి కోటిన్నర రూపాయల టర్నోవర్ సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. అది నెరవేరుతుందని ఆశిస్తున్నాం."

'నిన్ను తొలిచూపులోనే ప్రేమించేశా' అన్నప్పుడు అతన్ని నమ్మలేకపోయింది. 'డేటింగ్ చేయను పెళ్లాడతా' అన్నప్పుడు కాస్త మెత్తబడింది. 'అందర్నీ ఒప్పించి పెళ్లాడతా' అన్నప్పుడు మరో ఆలోచన లేకుండా పెళ్లికి తల వంచేసింది. అలా వెంటపడి, పట్టుబట్టి పెళ్లాడిన అబ్బాయి 'నికొలస్' అమెరికన్ అయితే, అతన్ని తొలి చూపులోనే గెలుచుకున్న మన తెలుగమ్మాయి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయన్సర్ 'శ్వేత' కావడం విశేషం. ఊహకందనంత వేగంగా మలుపు తిరిగిన తన జీవితం గురించీ, తెలుగు భాషనూ, వంటలనూ, సంప్రదాయాలనూ ఇష్టపడే భర్త నిక్ గురించి, టెక్సాస్‌లో స్థిరపడిన 'రమిణి శ్వేత నికొలస్ అర్నీని' నవ్యకు ఇలా వివరించింది...



పడమటి శ్వేతా రాగం

అమెరికాలో చదువు అనగానే, అది సంపన్నులకే సాధ్యపడుతుందని అనుకుంటారు. కానీ నేను మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చాను. ఎలాగైనా అమెరికాలో ఉన్నత చదువు చదవాలనే కోరిక బలంగా ఉండేది. కానీ నాన్న అందుకు ఒప్పుకోరు. ఆర్థిక పరిస్థితి కూడా అంతంత మాత్రమే కాబట్టి కలను నిజం చేసుకోవాలంటే కష్టాన్నే నమ్ముకోవాలని నిర్ణయించుకున్నాను. అలా పగటివేళను చదువుకూ, రాత్రివేళను ఉద్యోగానికీ కేటాయించాను. కొద్దికొద్దిగా డబ్బు కూడబెట్టుకుంటూ, సాధ్యమైనంతగా పొదుపు చేసుకుంటూ క్యాలిఫోర్నియా స్టేట్ యూనివర్శిటీలో ఎమ్‌బిఎ చదువు కోసం దరఖాస్తు చేసుకున్నాను. మొదటి ప్రయత్నంలోనే సీటొచ్చేసింది. అయితే వీసా వచ్చేవరకూ ఇంట్లో చెప్పకూడదని అనుకున్నాను. అలా వీసా వచ్చిన తర్వాత ఇంట్లో చెప్పినప్పుడు అమ్మా నాన్న నిర్ఘాంతపోయారు. నిజానికి వీసా ఖర్చులకూ, ఫ్లైట్ టిక్కెట్‌కు అవసరమైన డబ్బును మాత్రమే దాచలిగాను. ఆ తర్వాత ఏం చేయాలో స్పష్టత లేకుండానే ప్రయాణానికి సిద్ధపడిపోయాను. కానీ చివరి నిమిషంలో అమ్మ మొదటి సెమెస్టర్‌కు అవసరమైన డబ్బును సమకూర్చి అందించింది. అలా ఓ పక్క భయంతో, మరోపక్క ఆనందంతో 2014లో అమెరికాలో అడుగుపెట్టాను. చదువు సాగినంత కాలం సొంత ఖర్చులు, చదువు కోసం రేయింబవళ్లూ కష్టపడ్డాను. సబ్‌వే రెస్టారెంట్లు, ఇండియన్ రెస్టారెంట్లు... ఇలా వీలున్న ప్రతి చోటా ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9 గంటలవరకూ 12 నుంచి 14 గంటల పాటు పని చేశాను. అలా ఇంట్లో ఒక్క రూపాయి అడగకుండా చదువు పూర్తి చేయగలిగాను. కొన్నిసార్లు ఇంటికి కూడా డబ్బు పంపించాను. అలా చివరకు 2016లో ఐటి సబ్జెక్టు కలిగిన ఎమ్‌బిఎ డిగ్రీ సాధించాను. ఆ తర్వాత ఏడాదిలోపే శామ్‌సంగ్‌లో ఉద్యోగం వచ్చేసింది. మొదటి ఉద్యోగం బోస్టన్‌లో. దగ్గర్లోని మాంచెస్టర్‌లో ఉన్న స్నేహితురాలిని తరచూ కలుస్తూ ఉండేదాన్ని. 2019లో ఓ పుట్టిన రోజు వేడుక కోసం మాంచెస్టర్ బయల్దేరినప్పుడు, అక్కడొక అద్భుతమైన వ్యక్తిని కలవబోతున్నట్టు నాకు తెలియదు.

తొలిచూపులోనే ప్రేమ

ఆ పార్టీలో నికొలస్ తప్ప మిగిలిన వాళ్లందరూ భారతీయులే! దాంతో నా స్నేహితులందరూ నిక్‌ను చుట్టుముట్టి అతన్ని సరదాగా ఆట పట్టించడం మొదలుపెట్టారు. నేను స్వతహాగా సిగ్గరిని కాబట్టి అదేమీ పట్టించుకోకుండా ఓ సోఫాకి పరిమితమై కూర్చుండిపోయాను. కానీ నిక్ అంతమంది అమ్మాయిలను వదిలేసి నా దృష్టిలో పడే ప్రయత్నం చేస్తూ, మాటలు కలపడం మొదలుపెట్టాడు. మొదట్లో భయపడి, దూరంగా పారిపోయాను. ఆ తర్వాత ఇంట్లో నాకు పెళ్లి ప్రయత్నాలు జరుగుతున్నట్టు స్నేహితుల ద్వారా తెలుసుకున్న నిక్, నన్ను ఇష్టపడుతున్నట్టు చెప్పి, ఒక కాగితం మీద తన ఫోన్ నంబర్ రాసిచ్చి వెళ్లిపోయాడు. ఆ తర్వాత నా స్నేహితులు నన్ను అనుకరిస్తూ, నా ఫోన్ నుంచి అతనికి మెసేజెస్ పెడుతూ అతన్ని లంచ్‌కి పిలిచారు. ఆ లంచ్‌లో నిజం తెలిసినప్పటికీ, ఆయన ఏమాత్రం కోపగించుకోకుండా, నేరుగా పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. కానీ తర్వాత ఆలోచించి, అతని ప్రేమను, ప్రపోజల్‌నూ అంగీకరించాను. ఆ తర్వాత రెండు వారాలకే మా పెళ్లి జరిగిపోయింది. నిజానికి మా పెళ్లికి ఎంతోమంది ఎన్నో అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కానీ అమ్మ మాత్రం, 'నువ్వు ప్రేమించే వ్యక్తికి బదులుగా, నిన్ను ప్రేమించే వ్యక్తిని చేసుకుంటే సుఖపడతావు' అంటూ ప్రోత్సహించింది. అమ్మ చెప్పిందే నిజమైంది.



మాది హైదరాబాద్. అక్కడే పుట్టి పెరిగాను. నాన్న రామకృష్ణ ఫైనాన్స్ బిజినెస్ చేస్తారు. అమ్మ సంధ్యారాణి ప్రస్తుతం గృహిణి. భర్త నిక్, సైన్యంలో ఐటి డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. ప్రస్తుతం నేను యుఐ డెవలపర్‌గా ఇంటి నుంచే పని చేస్తున్నాను. మాకు ముగ్గురు పిల్లలు. మొదటి బాబు అయాన్ష్‌కు నాలుగేళ్లు. రెండో వాడు, అరిహాన్‌కు రెండేళ్లు. పాప ఆష్నాకు ఏడాది వయసు. నాకొక అక్క కూడా ఉంది. పేరు దివ్య. తాను కూడా ఇక్కడే స్థిరపడింది.

కొడుకు లేని లోటు తీర్చి...

నిక్ జీవితం, నా జీవితం ఒకలాంటివే! జీవితంలో పైకి ఎదగడం కోసం నేనెన్ని కష్టాలు పడ్డానో, నిక్ కూడా అంతకంటే ఎక్కువ కష్టాలే పడ్డాడు. 13 ఏళ్ల వయసులోనే తల్లితండ్రులను కోల్పోవడంతో మంచి కుటుంబం కావాలని కోరుకున్నాడు. మా అమ్మానాన్నలను తన అమ్మానాన్నల్లా ప్రేమించాడు. ఎంతో ఆప్యాయంగా ఆదరించాడు. అన్నిటికంటే ముఖ్యంగా ఆయనకు మన తెలుగు భాష, సంప్రదాయాలు, వంటలంటే ఎంతో ప్రాణం. ఇంట్లో పిల్లలతో తెలుగులోనే మాట్లాడమంటాడు. టివిలో కూడా తెలుగు కార్యక్రమాలే చూపించమంటాడు. తాను కూడా కష్టపడి తెలుగు నేర్చుకున్నాడు. ప్రస్తుతం కొద్దికొద్దిగా మాట్లాడగలుగుతున్నాడు. ఓసారి నాకు తెలియకుండానే అమ్మానాన్నలను అమెరికాకు పిలిపించి నన్ను సర్‌ప్రైజ్ చేశాడు. అమ్మను షాపింగ్‌కు తీసుకువెళ్లి నచ్చినవన్నీ కొనిపెట్టాడు. చెప్పుల షాపులో అమ్మ కాళ్లకు తానే స్వయంగా బూట్లు తొడిగినప్పుడు మా అందరి కళ్లూ చెమర్చాయి. ఫోన్లో గూగుల్ ట్రాన్స్‌లేటర్ ఇన్‌స్టాల్ చేయించి, దాన్నెలా వాడుకోవచ్చో అమ్మకు నేర్పించాడు. అలా అమ్మా, నిక్ ఎంతో బాగా కలిసిపోయారు. కొడుకు లేని లోటు తీర్చాడని అమ్మ ఎంతో మురిసిపోతూ ఉంటుంది. మనది వినూత్నమైన జంట అంటూ నా చేత ఇన్‌స్టా అకౌంట్ క్రియేట్ చేయించాడు. అకౌంట్ క్రియేట్ చేసిన రెండు నెలలకే ఏకంగా 27 వేల మంది ఫాలోవర్లను సంపాదించుకోగలిగాం! కొందరు ప్రముఖులు మా జంటను అభినందిస్తూ మెసేజ్‌లు పెట్టారు.



• గోగుమళ్ల కవిత

పిల్లలు కూరగాయలు తినట్లేదా?



పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి తాజా కూరగాయలు ఎంతగానో దోహదం చేస్తాయి. కానీ వీటిని తినడానికి పిల్లలు అసలు ఇష్టపడరు. అలాంటప్పుడు పిల్లలచేత రకరకాల కూరగాయలను ఎలా తినిపించాలో తెలుసుకుందాం...

- కీర, కేరట్, బీట్‌రూట్‌లను నక్షత్రాలు, హార్ట్, స్మైలీ ఫేస్ లాంటి ఆకర్షణీయమైన ఆకారాల్లో కోసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు
- కూరగాయల ముక్కలు లేదా వాటి తురుమును చేర్చి తయారుచేసిన ఇడ్లీ, దోశ, చపాతీలను పిల్లలకు తినిపించవచ్చు.
- కూరగాయల ముక్కలు, కొత్తిమీర, పుదీనా చేర్చి రుచికరమైన స్ప్రింగ్‌రోల్స్ తయారుచేసి ఇస్తే పిల్లలు చక్కగా తింటారు.
- పాలకూర, మెంతికూర లాంటి ఆకుకూరలను సన్నగా తరిగి గోధుమపిండిలో కలిపి తయారు చేసిన రోటీలను అల్పాహారంగా పిల్లలచేత తినిపించవచ్చు.
- కూరగాయలను వండేటప్పుడు వాటిని శుభ్రం చేయడం, సన్నగా తరగడం, వండడం లాంటి పనులను పిల్లలతో కలిసి చేయాలి. క్రమంగా ఆ వంటకాలను తినాలనే ఆసక్తి పిల్లల్లో ఏర్పడుతుంది.
- కుటుంబసభ్యులంతా కలిసి తరచూ వెజిటబుల్ సలాడ్‌ను తింటూ వుంటే పిల్లలకు కూడా దాన్ని తినాలనే కోరిక కల్గుతుంది.

ఫ్యాషన్



ప్రతి పండుగకూ పట్టుచీరేనా? ఇంకేదైనా వెరైటీ చీర కట్టుకుందామా? అని ఆలోచించే మహిళలు నిస్సందేహంగా జందానీ చీరను ఎంచుకోవచ్చు. ఆకట్టుకునే రంగుల్లో, సౌకర్యవంతంగా ఉండే జందానీ సొగసులు ఇవే!

జందానీ జబర్దస్త్

జందానీ అసలు పేరు 'ఢకాయి'. ఢాకా నగరం నుంచే ఈ పేరొచ్చింది. ఈ అద్భుతమైన చీరలు ఢకాయి జందానీ లేదా ఢకాయి అనే పేరుతో ప్రజాదరణ పొందాయి. జమ్దాని అనే పదం మూలాలు పర్షియాలో ఉన్నాయి. బెంగాలీ చేనేత కళాకారులు జందానీ నేత పనితనాన్ని పెంపొందించుకున్నారు.

- మోటిఫ్స్, తయారీ ప్రాంతం ఆధారంగా జందానీ చీరలను వర్గీకరిస్తారు. పన్నా హజార్ లేదా వెయ్యి పచ్చలు, కల్కా లేదా పెయిస్లీ, బుటిదార్ లేదా చిన్న పువ్వులు, ఫుల్వార్, టెర్చా, జలాల్, డురియా, కర్కోనా మోటిఫ్స్ అత్యంత ఎక్కువగా ప్రజాదరణ పొందాయి
- గతంలో జందానీ చీరలు కేవలం రాజ కుటుంబాలకే పరిమితమై ఉండేవి. కానీ నేడు ఫ్యాషన్‌ను ఇష్టపడే మహిళలందరూ ఈ చీరల మీద మక్కువను ప్రదర్శిస్తున్నారు. కుటుంబ వేడుకలు, పండుగల్లో ఈ చీరలకే పెద్ద పీట వేస్తున్నారు
- బంగ్లాదేశ్‌లో రూపొందే ఢకాయి జందానీ చీరలు, తంగాయి జిల్లాలో రూపొందిన జందానీ చీరలు పెద్ద బార్డరును కలిగి ఉండి, పద్మం, దీపం, చేప పొలుసుక మోటిఫ్స్‌ను కలిగి ఉంటాయి. హుందాగా కనిపించే ఈ చీరలు సాయంకాలం వేళ వేడుకలకు అనువుగా ఉంటాయి
- తేలికపాటి ఆభరణాలు జందానీ చీరలకు ఎంతో బాగా నప్పుతాయి. అలాగే ఆక్సిడైజ్‌డ్ సిల్వర్ జ్యువెలరీ కూడా ఈ చీరలకు ఎంతో బాగా నప్పుతుంది.



రాష్ట్రంలోనే విదేశీ విద్య!

(మొదటిపేజీ తరువాయి)

జరుపుతోంది. వీటిలో ఐదారు యూనివర్సిటీలు ఇక్కడ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఆసక్తి కనబర్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆఫ్‌లైన్ క్యాంపస్‌ల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, ఇతర అంశాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలుజరుపుతున్నట్టు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. లండన్‌కు చెందిన 2-3 వర్సిటీలు రాష్ట్రంలో ఆఫ్‌లైన్ క్యాంపస్‌ల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది. ఇందులో ఓ ప్రముఖ యూనివర్సిటీకి హైదరాబాద్‌లో ఉన్న 'హైగా' ప్యాలెస్ లేదా హైటెక్స్‌లో ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) భవనాన్ని కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

విదేశీ విద్యకు రూ.లక్షల్లో ఖర్చు

డిమాండ్ ఉన్న కోర్సులను బోధిస్తారని, అక్కడ చదివితే త్వరగా ఉద్యోగం వస్తుందన్న ఆశతో విదేశాల్లో పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు లక్షల రూపాయల ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం సైతం బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల విద్యార్థులకు గరిష్ఠంగా రూ.20లక్షల దాకా ఆర్థిక సాయం అందిస్తోంది. కానీ, కొన్నేళ్లుగా పరిస్థితులు అంత ఆశాజనకంగా ఏమీ లేవు. చదువు పూర్తయ్యాక ఉద్యోగం వస్తుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. రెండు, మూడేళ్లుగా ఇతర దేశాలకు వెళ్లి చదువు పూర్తయి, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత సంఖ్య వేలల్లో ఉండడమే దీనికి నిదర్శనం. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఆయా వర్సిటీలు అందిస్తున్న విద్యను అదే స్థాయి ప్రమాణాలతో ఇక్కడే అందుబాటులోకి తెస్తే యువత మేలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానంగా ఫీజుల భారం తగ్గడంతోపాటు ప్రయాణ ప్రయాసలు తగ్గుతాయని అంచనా వేస్తోంది. ఇందులో భాగంగానే ఇతర దేశాల నుంచి భారత్‌కు రావాలనుకునే వర్సిటీలను తెలంగాణకు తీసుకురావాలనే లక్ష్యంతో సర్కారు ప్రణాళికలను రచిస్తోంది. ఇటీవల పలు దేశాలకు చెందిన ప్రతినిధులు సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సమయంలోనూ ఆయా దేశాల్లోని వర్సిటీల ఆఫ్‌లైన్ క్యాంపస్‌లను ఇక్కడ ఏర్పాటు చేయడంపైనే ప్రధానంగా చర్చించినట్టు సమాచారం.

ఇప్పటికే 14 వర్సిటీలకు అనుమతి

విదేశాలకు చెందిన పలు యూనివర్సిటీలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కనబర్చుతున్న నేపథ్యంలో కేంద్రం కూడా వాటికి పచ్చజెండా ఊపుతోంది. విద్యాభ్యాసం కోసం ఇతర దేశాలకు వెళ్తున్న వారి సంఖ్య ఏటా పెరుగుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటిదాకా దాదాపు 14 వర్సిటీలకు వర్సిటీ గ్రాంట్స్ కమిషన్ అనుమతులు ఇచ్చింది. ఇందులో 5-6 వర్సిటీలు.. ఆఫ్‌లైన్ క్యాంపస్‌ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు తెలిసింది. విదేశాల నుంచి భారత్‌కు రానున్న వర్సిటీలు గురుగ్రామ్, ముంబై, బెంగళూరు, ఢిల్లీ, చెన్నై, గుజరాత్‌లో క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రాథమికంగా తెలిసింది. వీటిలో ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్, వోల్లోంగాంగ్ వర్సిటీలు అహ్మదాబాద్‌లోని గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్ సిటీ (గిఫ్ట్)లో ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. అలాగే, యూకే, ఇటలీ, అమెరికా, ఆస్ట్రేలియా, మలేషియా దేశాలకు చెందిన పలు వర్సిటీలు భారత్‌కు రానున్నాయి. వీటిలో కొన్నింటిని రాష్ట్రానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోంది.

ప్రవాసులకు ఈబీ-5 గాలం!

కాగితం మీద కనిపించే ప్రాజెక్టులే ఎక్కువ!.. అమెరికాలో గ్రీన్‌కార్డు కోసం భారీగా పెట్టుబడులు

- సులభమైన వర్క్ పర్మిట్లకు ఆకర్షితులై సొమ్ములు పెట్టేస్తున్నారు
- తేలిగ్గా మూలధనం సమకూర్చుకుంటున్న బడాబాబులు
- రూ.7 కోట్ల పెట్టుబడికి మూడేళ్లలో వచ్చేది రూ.21 లక్షలే
- వర్క్ పర్మిట్ రద్దయి, డబ్బు పోగొట్టుకుంటున్నవారెందరో..!
- తెలుగు రాష్ట్రాల రాజకీయ నాయకులు, ధనవంతుల కుటుంబాలకు స్వర్గధామంగా ఈబీ-5
- కేటుగాళ్లతో జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు

(డల్లాస్ నుంచి కిలారు గోకుల్ కృష్ణ)



అమెరికాలో శాశ్వతంగా ఉండాలనుకోవడం చాలా మందికి కల. ఆ కల నెరవేర్చుకోవడానికి దశాబ్దాల తరబడి ఎదురు చూస్తుంటారు. విద్య, ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లి.. వలసదారులుగా ఉంటూ శాశ్వత నివాసం కోసం నిరీక్షిస్తుంటారు. ఇలా ఏళ్ల తరబడి ఎదురు చూడడం కంటే సంపాదించిన సొమ్మును అమెరికాలో మంచి ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టి, 'ఎంప్లాయిమెంట్ బేస్డ్ (ఈబీ)-5' ప్రోగ్రాం ద్వారా గ్రీన్‌కార్డును త్వరగా పొందాలని చాలా మంది భావిస్తుంటారు. ఇలాంటి వారి ఆశలను ఆసరాగా తీసుకుని ఇటీవలి కాలంలో ఈబీ-5ను సైతం కొందరు ప్రవాసులు (ఏపీ, తెలంగాణ రాష్ట్రాలవారు) తమ స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అమెరికాలోని ప్రధాన నగరాల్లో తెలుగువారి ఆధ్వర్యంలో నడిచే ఇలాంటి 'కాగితం మీద మాత్రమే కనిపించే' ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టి, సాటి ప్రవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును రియల్ ఎస్టేట్ బడాబాబులకు సమర్పించేసుకుంటున్నారు. ఈబీ-5 ప్రోగ్రాం దరఖాస్తుదారులు వేలల్లో ఉండగా.. అందులో పెట్టుబడి పెట్టి గ్రీన్ కార్డు వచ్చిన వారు వేళ్ల మీద లెక్కపెట్టగలిగేంత మందే ఉన్నారంటేనే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ప్రతి చిన్న రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును ఈబీ-5గా చిత్రీకరిస్తూ ప్రవాసాంధ్రుల సొమ్ముల కోసం గాలమేస్తున్న కేటుగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏమిటీ ఈబీ-5..?

అమెరికా కాంగ్రెస్ 1990లో 'ఎంప్లాయిమెంట్ బేస్డ్ (ఈబీ)-5' ఇమిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టింది. అమెరికా ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగ సృష్టి, విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా దీన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద పెట్టుబడి పెట్టే అర్హులైన విదేశీయులు, వారి కుటుంబ సభ్యులకు రెండు నెలల్లో వర్క్ పర్మిట్ ఇస్తారు. అనంతరం యూఎస్‌సీఐఎస్ ప్రచురించే వీసా డేట్లు పెట్టుబడిదారుడి దరఖాస్తు తేదీతో సరిపోలినప్పుడు దరఖాస్తును సమగ్రంగా సమీక్షించి రెండేళ్ల పాటు షరతులతో కూడిన గ్రీన్‌కార్డును అందిస్తుంది. ఆ తర్వాత, పెట్టుబడి నిజాయితీగా ఉపయోగించారని, అవసరమైన ఉద్యోగ కల్పన పూర్తయిందని నిరూపించగలిగితే, వారు శాశ్వత గ్రీన్‌కార్డు పొందుతారు. 2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 1.35 లక్షల మందికి పైగా విదేశీయులు ఈబీ-5 ద్వారా అమెరికాలో శాశ్వత నివాస హక్కు పొందారని నివేదికలు పేర్కొంటున్నాయి. కానీ, ఇటీవలి కాలంలో అత్యధికంగా దరఖాస్తుదారులు వచ్చినా, వాస్తవంగా గ్రీన్‌కార్డు పొందేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఈబీ-5లో పెట్టుబడి పెట్టే వారికి ఒక్కరికే కాకుండా జీవిత భాగస్వామి, పిల్లలకు కూడా గ్రీన్‌కార్డు మంజూరు చేస్తారు. ఈబీ-5 పెట్టుబడికి నాలుగు కేటగిరీలు ఉన్నాయి. సాధారణ పట్టణ ప్రాంతాల్లో పెట్టుబడికి కనీసంగా రూ.9 కోట్లు అవసరం. అలాగే అధిక నిరుద్యోగిత ఉన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు కనీసం రూ.7 కోట్లు (8 లక్షల డాలర్లు) పెట్టుబడి కావాల్సి ఉంటుంది. ఈ పెట్టుబడికి ప్రధాన నిబంధన.. ప్రతి ఈబీ-5 ప్రాజెక్ట్ ద్వారా కనీసం పది మంది అమెరికా చట్టబద్ధ నివాసితులకు/ ప్రవాసులకు/ వలసదారులకు, అమెరికన్ పౌరులకు పూర్తిస్థాయి ఉద్యోగాలు, కనీసం రెండేళ్ల పాటు జీవిత బీమా కల్పించాలి.

రాబడి.. వర్క్ పర్మిట్ ప్రయోజనాలు

అమెరికా ఇమిగ్రేషన్ సంస్థ యూఎస్‌సీఐఎస్ గుర్తించిన రీజినల్ సెంటర్ల ద్వారానే దాదాపు 95% ఈబీ-5 ప్రాజెక్ట్ దరఖాస్తులు వస్తాయి. ఈ రీజినల్ సెంటర్ల ద్వారా లైసెన్స్ పొందిన వారు ప్రాజెక్ట్ యజమానులుగా ముందుకు వచ్చి, యూఎస్‌సీఐఎస్ నుంచి లభించిన ప్రాజెక్ట్ రసీదు చూపి పెట్టుబడిదారులను ఆహ్వానిస్తారు. ఆ రసీదు ఆధారంగా ప్రాజెక్టును నమ్మి, నిధులు పెడతారు. ఈ పెట్టుబడిలో ఒక్క డాలరు కూడా యూఎస్‌సీఐఎస్‌కుగానీ అమెరికా ప్రభుత్వానికి గానీ వెళ్లదు. ప్రాజెక్టును ప్రారంభించిన వారి ఖాతాల్లోకి వెళ్తుంది. ఉదాహరణకు.. ఒక ప్రవాసుడు తన సొంత భూమి 15 ఎకరాల్లో రూ.87 కోట్ల (కోటి డాలర్లు)తో షాపింగ్ మాల్ నిర్మాణ ప్రణాళికను ప్రతిపాదిస్తారు. తన ప్రాజెక్ట్ ఖాతాలో రూ.21 కోట్లు (25 లక్షల డాలర్లు) ఉన్నట్లు చూపించి, మిగిలిన మొత్తానికి 10 ఈబీ-5 గ్రీన్‌కార్డు ఇన్వెస్టర్ పిటిషన్ల ద్వారా సమీకరిస్తానని యూఎస్‌సీఐఎస్ రీజినల్ సెంటర్‌కి నివేదిక సమర్పిస్తారు. రశీదు పొందిన అనంతరం ప్రాజెక్ట్‌ను ప్రచారం చేస్తూ ఈబీ-5 పెట్టుబడిదారులను ఆహ్వానిస్తారు. ఒక్కో ఈబీ-5 పెట్టుబడిదారు తన శక్తి మేర రూ.7 కోట్ల వరకు ప్రాజెక్ట్‌లో పెడతారు. ఈ పెట్టుబడికి మూడేళ్ల పాటు కేవలం 0.25% నుంచి 1% మాత్రమే ప్రాజెక్టు ఓనర్లు పెట్టుబడిదారులకు చెల్లిస్తారు. అంటే రూ.7 కోట్ల పెట్టుబడికి మూడేళ్లకు గరిష్ఠంగా వచ్చేది రూ21 లక్షలు అన్నమాట! కానీ, ప్రాజెక్ట్ ఓనర్లు కాగితం మీద చూపిన రూ.21 కోట్ల పెట్టుబడికి లభించే బహుమతి... అతి చౌకగా 10 మంది ఈబీ-5 ఆశావహుల కష్టార్జితమైన రూ.70 కోట్లు. ఇక ప్రాజెక్టులో పెట్టుబడిదారుల సంఖ్య 10 మందితో ఆగిపోతే అది నిజమైన, నమ్మకమైన ప్రాజెక్టుగా పరిగణించవచ్చు. కానీ, ప్రస్తుత మార్కెట్‌లో ఈ పరిస్థితి లేదు. రూ.7 కోట్లు పెట్టలేని వారు కొద్ది మొత్తమైనా పెట్టుబడి పెట్టవచ్చని ప్రాజెక్ట్ యజమానులు భరోసా ఇస్తారు. మిగిలిన మొత్తం తాము సర్దుబాటు చేస్తామని చెబుతారు. యూఎస్‌సీఐఎస్‌తో ఇబ్బంది తలెత్తకుండా ఓనర్లు తాము ఇచ్చే సొమ్మును 10-15% వడ్డీకి ఇస్తున్నట్లు నకిలీ దస్తావేజులు రూపొందిస్తున్నారు. అమెరికాలో వర్క్ పర్మిట్ ఉంటే ఏ ఉద్యోగమైనా చేసుకునేందుకు వీలుండడం వల్ల ఆర్థికంగా బలహీనమైన పెట్టుబడిదారులు కూడా ఈబీ-5 వైపు మొగ్గుచూపుతున్నారు. ఎంతో కొంత పెట్టుబడి పెట్టి వర్క్ పర్మిట్ తెచ్చుకుంటున్నారు. ఇలా పర్మిట్ తెచ్చుకున్న వారు తమ పేరిట సొంత కంపెనీలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలూ చేస్తున్నారు. ఇలాంటి వారికి అమెరికాలో దీర్ఘకాలం నివసించాలనే ఆలోచన ఉండదు. అక్కడ ఉన్నన్ని రోజులు డబ్బు సంపాదించుకొని వెళ్లిపోవడమే వారి ప్రధాన ఉద్దేశం. పెట్టుబడిదారుడు అమెరికాలో ఉంటేనే ఈ వర్క్ పర్మిట్ ఇస్తారు. అమెరికా బయట ఉండి కూడా ఈబీ-5 ప్రోగ్రామ్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. అలాంటివారి దరఖాస్తులను యూఎస్‌సీఐఎస్ క్షుణ్ణంగా సమీక్షించి, నిధుల మూలాలను నిర్ధారించుకున్నాక ఇమిగ్రెంట్ వీసా జారీ చేస్తారు. దాని ఆధారంగా అమెరికా వచ్చిన తర్వాత పెట్టుబడిదారులకు షరతులతో కూడిన గ్రీన్‌కార్డు ఇస్తారు. ప్రాజెక్టు పూర్తయ్యాక షరతుల్లేని శాశ్వత గ్రీన్‌కార్డు మంజూరు చేస్తారు.

కాదేదీ ఈబీ-5 ప్రాజెక్టుకు అనర్హం

ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా వచ్చిన ఈబీ-5 ప్రోగ్రామ్ కింద ఉద్యోగాలు కల్పిస్తే ఎలాంటి ప్రాజెక్టునైనా చేయవచ్చుననే నిబంధన ఉంది. దీన్ని ఆసరగా చేసుకుని కూరగాయల మార్కెట్లు, సిమెంట్ ఇటుకల బట్టీలు, హోటళ్లు, కాఫీ షాపులు, అపార్ట్‌మెంట్లు, రిసార్టులు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్ వంటి వాటితో పాటు చివరికి క్యాసినోలను కూడా ఈబీ-5 ప్రాజెక్టులుగా ప్రారంభిస్తున్నారు. అందినంత మేర పెట్టుబడులు లాగేస్తున్నారు. గతంలో ఒక ఇల్లు కొనడాన్ని కూడా ఈబీ-5 పెట్టుబడిగా ఆమోదించి, గ్రీన్‌కార్డులు మంజూరు చేసిన సందర్భాలు ఉన్నాయి.

పెద్ద కుట్రే..

యూఎస్‌సీఐఎస్‌కు సమర్పించే దరఖాస్తులో ప్రాజెక్ట్ ప్లాన్ ప్రకారం నాలుగేళ్లలో పూర్తి కావాలి. యజమాని నిజంగానే ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తే, యూఎస్‌సీఐఎస్ ఉద్యోగ సృష్టి, పెట్టుబడి నిబంధనలు పూర్తయ్యాయని ధ్రువీకరిస్తుంది. దీంతో పెట్టుబడిదారులు ప్రధాన గ్రీన్‌కార్డులను పొందుతారు. కానీ, అత్యాశపరులైన ప్రాజెక్ట్ ఓనర్లు యూఎస్‌సీఐఎస్‌కు పంపిన దరఖాస్తులో పేర్కొన్నట్లు కాకుండా ఎక్కువ మందిని పెట్టుబడిదారులుగా చేర్చుకుంటున్నారు. తద్వారా వారికి అతి చౌకగా అత్యధిక మూలధనం లభిస్తోంది. పెట్టుబడిదారులకు మాత్రం ఆశించిన ప్రయోజనం దక్కట్లేదు. ప్రాజెక్టులో రూ.7 కోట్లు చెల్లించినవారి గ్రీన్‌కార్డు దరఖాస్తులను మాత్రమే యజమానులు యూఎస్‌సీఐఎస్‌కు సిఫారసు చేస్తున్నారు. చిన్నాచితకా సొమ్ములు పెట్టినవారు వర్క్ పర్మిట్ వద్దనే ఆగిపోతున్నారు. ప్రాజెక్టు పూర్తయ్యాక ఇలాంటి వారి వర్క్ పర్మిట్ రద్దయి, డబ్బులు పోగొట్టుకుని, తిరిగి పాత వీసా పరిధిలోకి వెళ్లిపోతున్నారు. మళ్లీ మరో ఈబీ-5 ప్రాజెక్టు వెతుక్కొని, అందులో పెట్టుబడి పెట్టి, వర్క్ పర్మిట్ తెచ్చుకోవడమనే సుడిగుండంలో పడిపోతున్నారు. ఈబీ-5 ప్రక్రియకు ప్రత్యేకమైన న్యాయవాదులు ఉంటారు. ప్రాజెక్ట్ యజమానులతో చేతులు కలిపి వీరు పోషించే పాత్ర కూడా ప్రధానం. అసలు ఈబీ-5 ప్రాజెక్టులకు రూపకల్పన చేసేదే అతి చౌకగా మూలధనం సేకరించడానికని డల్లా‌స్‌కు చెందిన ఒక టెకీ తెలిపారు. అలా వచ్చిన పెద్దమొత్తాలను ప్రాజెక్ట్ యజమానులు ఇతర రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. కొందరు ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నారు. మరికొందరు భారత్‌లో పెట్టుబడులు, తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ఉనికిని బలోపేతం చేసుకునేందుకు కూడా వాడుతున్నారు. పెట్టుబడి పెట్టాలనుకునే వారు నిజమైన ఈబీ-5 ప్రాజెక్ట్ గురించి తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

విజేతలు కాదు.. బాధితులు..

అమెరికాలో స్థిరపడి తమ వ్యాపారాల ద్వారా సంపాదించిన నిధులతో కొందరు ప్రవాసాంధ్రులు టెన్నిస్సీ, అరిజోనా, నార్త్ కరోలినా, టెక్సాస్, జార్జియా వంటి రాష్ట్రాల్లో కొత్త ఈబీ-5 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు తెరలేపుతున్నారు. సొంత సామాజిక వర్గానికి చెందిన వారికి అటు ప్రాజెక్ట్ రూపకర్తలు, ఇటు పెట్టుబడిదారులు ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే, మెజారిటీ పెట్టుబడిదారులు విజేతలుగా కంటే బాధితులుగానే మిగిలిపోతున్నారు. ఇప్పటికే మూడు, 4 ప్రాజెక్టుల ద్వారా పెట్టుబడిదారులను ముంచేసినా, మరొకరిని తమ ప్రాజెక్టుల యజమానులుగా చెప్పుకొని వెనక నుంచి కొందరు బడాబాబులు ఈ దందా నడిపిస్తున్నారు. ఈబీ 1,2,3 కేటగిరీల్లో 10-20 ఏళ్లకు పైగా వేచి చూడాల్సిన పరిస్థితి ఉండగా.. ఈబీ-5లో డబ్బులు పెడితే వర్క్ పర్మిట్ వచ్చి టెన్షన్ లేకుండా కావల్సిన పని చేసుకోగలగడం ఈ పథకానికి ఉన్న అతిపెద్ద బలం. తెలుగు రాష్ట్రాలకు చెందిన పెద్ద తలకాయలు, రాజకీయ నేతలు రెండేళ్లుగా తమకు, తమ సంతానానికి ఈబీ-5 ద్వారా ఇమిగ్రెంట్ వీసా తెచ్చుకుని, అమెరికాలో దిగే సమయానికి షరతులతో కూడిన గ్రీన్ కార్డును అందుకుంటున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే



సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగి మణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం



బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.

ఆంధ్రా యువతిపై తమిళ ఖాకీల అత్యాచారం

» ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలంలో దారుణం

చెన్నై, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన అరుణాచలం(తిరువణ్ణామలై)లో దారుణం చోటుచేసుకుంది. స్వామివారి దర్శనం కోసం వచ్చిన ఆంధ్రాకు చెందిన ఇద్దరు యువతుల్లో ఒక యువతిపై ఇద్దరు స్థానిక పోలీసులు అత్యాచారానికి తెగబడ్డారు. అరుణాచలం బైపాస్ ఎరోడ్డులో సోమవారం అర్ధరాత్రి దాటాక ఇద్దరు కానిస్టేబుళ్లు వాహనాల తనిఖీ చేపట్టారు. తిరువణ్ణామలై వైపునకు వెళుతున్న ఓ వాహనాన్ని ఆపిన కానిస్టేబుళ్లు.. అందులో ఉన్న ఇద్దరు యువతులను కిందికి దించారు. తెలుగులో మాట్లాడుతున్న వీరు అక్కాచెల్లెళ్లు కాగా, ఒకరికి 20, మరొకరికి 18 ఏళ్ల వయసుంటుందని సమాచారం. ఆ వాహనాన్ని పంపించేసిన పోలీసులు తమ ద్విచక్రవాహనాలపై యువతులిద్దరినీ ఎక్కించుకుని 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్మశాన వాటిక వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అక్కను బెదిరించి ఆమె చెల్లెలిపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మంగళవారం ఉదయం రోదిస్తూ కనిపించిన ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లను గమనించిన స్థానికులు ప్రభుత్వాసుపత్రికి పంపించారు. తన చెల్లిపై జరిగిన దారుణం గురించి పోలీసులకు అక్క ఫిర్యాదు చేసింది. ఈ దారుణంపై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే గాలింపు చేపట్టి సుందర్, సురేష్‌రాజ్ అనే కానిస్టేబుళ్లను అరెస్టు చేశారు. కోర్టు తీర్పు మేరకు రిమాండ్‌కు తరలించారు.

సైబర్ నేరాల నమోదులో రెండో స్థానంలో తెలంగాణ

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నమోదులో జాతీయ స్థాయిలో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. 2022లో తెలంగాణలో 15,297 సైబర్ నేరాలు నమోదు కాగా, 2023లో 18,236 కేసులు రికార్డయ్యాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)-2023 నివేదిక వెల్లడించింది. సైబర్ నేరాల నమోదులో దేశవ్యాప్తంగా కర్ణాటక తొలి స్థానంలో నిలిచిందని ఆ నివేదిక తెలిపింది. ఇక తెలంగాణలో హత్య కేసులూ స్వల్పంగా పెరిగాయి. 2022లో 937 హత్య కేసులు నమోదు కాగా, 2023లో 954లకు చేరాయి. ఆర్థిక నేరాల్లోనూ తెలంగాణ జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. 2022లో 26,321 కేసులు, 2023లో 26,881 కేసులు నమోదైనట్లు ఆ నివేదిక వివరించింది. ఇదిలా ఉంటే, తెలంగాణలో 2022లో 1,65,830 కేసులు రికార్డయితే, 2023లో 1,83,644లకు చేరుకున్నాయి.

2022- 2023లో తెలంగాణలో నమోదైన కేసులు:

కేసులు: 2022- 2023.. సైబర్ నేరాలు: 15,297-18,236

ఆర్థిక నేరాలు: 26,321- 26,881

హత్యలు: 937-954.. కిడ్నాపులు: 2,981-3,174

మహిళలపై నేరాలు: 22,066-23,678

రేవంత్‌రెడ్డిదంతా అబద్ధాల పాలన

» స్థానికంలోబీసీలకు 42% రిజర్వేషన్‌పై కాంగ్రెస్ అదే మోసం

» మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపణ

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై కాంగ్రెస్ పార్టీ అదే మోసాన్ని కొనసాగిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అబద్ధాల పాలనతో కాలం గడుపుతోందని చెప్పారు. జీవోతోనే బీసీ రిజర్వేషన్లు అమలయ్యేట్లయితే ఏకగ్రీవ తీర్మానంతో అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్, రాష్ట్రపతిలకు ఎందుకు పంపినట్లని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు జీవో తెచ్చినట్లే తెచ్చి కోర్టులో కేసులు వేయించారని.. కేసు విచారణలో ఉన్నా ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారని.. జీవో ద్వారా ఇతర రాష్ట్రాల్లో పెంచిన రిజర్వేషన్లను కోర్టులు కొట్టేసిన సంగతి ఈ సర్కారుకు తెలియదా? అని శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు.



సుఖ కాన్పు చేయించుకున్న బాలింతలతో వైద్యులు, సిబ్బంది

సద్దుల బతుకమ్మ శుభవేళ.. తొమ్మిది నార్మల్ డెలివరీలు

» భద్రాచలం ప్రభుత్వాస్పత్రిలో అరుదైన ఘటన

భద్రాచలం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పండుగ రోజున భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తొమ్మిది మంది శిశువులు జన్మించారు. ఈ తొమ్మిది మంది సాధారణ సుఖ ప్రసవాలు (నార్మల్ డెలవరీలు) కావడం విశేషం. ఏజెన్సీ ప్రాంతమైన ఆ ప్రభుత్వాస్పత్రిలో ఒకే ఒక్క గైనకాలజిస్టు నేతృత్వంలో ఇన్ని సాధారణ ప్రసవాలు విజయవంతంగా నిర్వహించడం అరుదైన సంఘటనగా చెబుతున్నారు. గైనకాలజిస్టు డాక్టర్ సాత్విక, సిబ్బంది మిడ్‌వైఫ్ ప్రశాంతి, నర్సింగ్ అధికారి గీత సహకారంతో ఈ ప్రసవాలను విజయవంతంగా నిర్వహించారు. జన్మించిన తొమ్మిది మంది శిశువుల్లో ఆరుగురు ఆడ శిశువులు, ముగ్గురు మగ శిశువులు ఉన్నారు.



వంటలు చేస్తున్న రోబోటిక్ చెఫ్

కోరిన వంటకం..కమ్మని రుచులతో.. రోబోటిక్ చెఫ్ చేసేస్తుంది

» ఏఐ టెక్నాలజీతో 200 వంటల తయారీ

» విజయవాడ ఎక్స్‌పోలో ప్రధాన ఆకర్షణ

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

కోరిన వంటలను కమ్మని రుచులతో చేసిపెడుతున్న ఆటోమేటెడ్ రోబోటిక్ చెఫ్ విజయవాడ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్రైడ్ రైస్, బిర్యానీ.. ఇలా ఏ వంట అయినా తయారుచేసి మన ముందు ఉంచుతోంది. చేతివంటకు ఏమాత్రం తగ్గకపోవడం, వేగంగా చేసి పెడుతుండటంతో ఈ రోబో వంటకాలు ఆహారప్రియులను ఆకట్టుకుంటున్నాయి. కృత్రిమమేధ టెక్నాలజీ సాయంతో ఏ వంటకు ఏ దినుసులు.. ఎంత సెగ.. ఎన్ని నీళ్లు.. అనేది చకచకా గ్రహించేసి ఘుమఘుమలతో అందిస్తోంది. ఎక్స్‌పోలో ఫుడ్‌కోర్టు విభాగంలో ఈ రోబోటిక్ చెఫ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనిని నాలా రోబోటిక్స్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త అనిల్ సుంకర "నాలా చెఫ్..వింగ్‌మాన్" పేరిట రూపొందించారు. మొత్తం 200 రకాల వంటకాలను ఇది తయారు చేస్తుంది. ఎక్స్‌పోను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు రోబోటిక్ చెఫ్ పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

ట్యాంక్‌బండ్‌పై ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

» అమరవీరుల స్తూపం నుంచి బతుకమ్మలతో మహిళల ర్యాలీ

» ఆడిపాడిన మంత్రి సురేఖ.. ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు

హైదరాబాద్ సిటీ, కవాడిగూడ, హైదరాబాద్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై మంగళవారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మలతో వచ్చి ఆడిపాడారు. మహిళలు అమరవీరుల స్మారక చిహ్నం నుంచి ర్యాలీగా ట్యాంక్ బండ్ పైకి చేరుకున్నారు. రంగు రంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలతో పెద్దఎత్తున హాజరై చిన్నాపెద్ద అన్న తేడా లేకుండా సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో సందడి చేశారు. తెలంగాణ టూరిజం శాఖ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ బతుకమ్మ ఉత్సవాలకు తెలంగాణ సాంస్కృతిక శాఖకు చెందిన కళాకారులు.. బోనాలు, ఒగ్గుడోలు, డప్పు వాయిద్యాలు, చిందు, యక్షగానంతో ట్యాంక్‌బండ్ పైకి వచ్చే బతుకమ్మలకు స్వాగతం పలికారు. ఈ ఉత్సవాల సందర్భంగా దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లతో కలిసి ట్యాంక్‌బండ్‌పై బతుకమ్మ ఆడిపాడారు. రాష్ట్రంలో బతుకమ్మ ఉత్సవాలు పర్యాటక శాఖ చేసిన కృషి ఫలితంగానే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కిందని కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఆటను గతంలో మాదిరిగా పెద్దవాళ్ల రూపకల్పన చేసిన పాటలతో కాకుండా పాశ్చాత్య పాటలతో ఆడుతున్నారని, ఇది మంచిది కాదని, పాత పద్ధతిలోనే ఆడాలని సూచించారు. ఒకవేళ బతుకమ్మ ఆటను పాశ్చాత్య పాటలతో ఆడుకోవాలనుకుంటే ప్రైవేటు కార్యక్రమాల్లో ఆడుకోవొచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, టూరిజం ఎండీ క్రాంతి, మహిళా కమిషన్ చైర్మన్ శారద, నగర్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వెన్నెల గద్దర్, నిర్మలా రెడ్డి, పంజాల అలేఖ్య, కాల్వ సుజాత హాజరయ్యారు. రాత్రి వరకు బతుకమ్మల చుట్టూరా ఆడిపాడిన మహిళలు బతుకమ్మ ఘాట్ వద్ద హుస్సేన్‌సాగర్‌లోకి వదిలారు.



హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద బతుకమ్మలతో మహిళలు

ఆధార్.. బేజార్!

అసలు వ్యక్తులకు తెలియకుండా..బయోమెట్రిక్.. ఓటీపీ లేకుండానే లాగిన్

» ఒక్కో ఆధార్‌పై 100కి పైగా లాగిన్లు

» రాష్ట్రవ్యాప్తంగా భారీగా ఘటనలు

» యూఐడీఏఐకి పెద్దఎత్తున ఫిర్యాదులు

» 'బయోమెట్రిక్ బ్లాక్' చేస్తేనే రక్షణ : నిపుణులు

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆధార్‌లో మార్పులు, చేర్పులు, ఇతర అవసరాల కోసం బయోమెట్రిక్ వేలిముద్ర తప్పనిసరి. అది లేకుండా లాగిన్ చేయలేం. అయితే రంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రైవేటు ఉద్యోగి ముకేష్‌కు తెలియకుండానే ఆయన ఆధార్‌లో ఆరు రోజుల్లో 230సార్లు ఎవరో లాగిన్ అయ్యారు. ఇందులో ఎక్కువసార్లు అర్ధరాత్రి 12 నుంచి 2 గంటల మధ్యలో జరిగాయి. ఖమ్మం జిల్లాకు చెందిన వ్యాపారి శేఖర్ రెడ్డి వారం రోజులుగా శ్రీలంక పర్యటనలో ఉన్నారు. ఆయన పేరుతో ఆధార్‌లో గత 15 రోజుల్లో 162సార్లు లాగిన్ అయ్యారు. ఇందులోనూ అత్యధికం అర్ధరాత్రే. అయితే ఆధార్‌లో మార్పుల కోసం తాము ఆధార్ కేంద్రానికి వెళ్లలేదు.. బయోమెట్రిక్ ఇవ్వలేదు.. ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్‌కు వచ్చే ఓటీపీ చెప్పలేదు.. అయినా ఇతరులు ఎలా లాగిన్ అవుతున్నారు? అన్నది వీరి ప్రశ్న. ఈ సమస్య వీరిద్దరిదే కాదు.. తెలంగాణలో వేలాదిమంది ఎదుర్కొంటోన్న సమస్య.



ముకేష్ పేరుతో ఆధార్‌లో ఆరు రోజుల్లో 230సార్లు లాగిన్ అయిన వివరాలు

ఎలా సాధ్యం.. ఎందుకు?

ఆధార్ అంటే పూర్తి భద్రత.. పౌరుల వ్యక్తిగత వివరాలు పూర్తిగా సురక్షితం.. అని కేంద్రప్రభుత్వం చెబుతూ ఉంటోంది. మరి పౌరుడి ప్రమేయం లేకుండా.. ఇతరులు ఎలా లాగిన్ అవుతున్నారు? బయోమెట్రిక్ ద్వారా ఆధార్ లాగిన్ చేస్తే అనుసంధానమై ఉన్న ఈ-మెయిల్‌కు 'మీ ఆధార్‌కు విజయవంతంగా లాగిన్ అయ్యారు' అన్న సందేశం వస్తుంది. ఇది కేవలం ఈ-మెయిల్ అనుసంధానం చేసినవారికే వస్తుంది. లాగిన్ సమయం, చేసిన ప్రాంతం వివరాలు కూడా అందులో ఉంటాయి. అయితే రాష్ట్రంలో గత 20 రోజుల నుంచి అనేకమంది ఇలాంటి సందేశాలను ఈ-మెయిల్ ద్వారా చూసి షాక్‌కు గురవుతున్నారు. అందులో లాగిన్ చేసిన ప్రాంతం వివరాలు ఉండటం లేదు. 'ఆన్‌లైన్ లాగిన్' అన్న సందేశం వస్తుంది. రాష్ట్రంలోని అన్ని ఆధార్ కేంద్రాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకే పనిచేస్తాయి. అయితే ఈ లాగిన్ అర్ధరాత్రి సమయంలోనే ఎక్కువసార్లు జరుగుతోంది. తమ అనుమతి లేకుండా ఎవరో లాగిన్ అవుతున్నారని ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలువురు నగరంలోని యూఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. తమ ఆధార్‌లో ఇతరులెవరో అనేకసార్లు లాగిన్ అయ్యారని, దాంతో నేర కార్యకలాపాలకు పాల్పడితే బాధ్యత ఎవరు తీసుకుంటారని.. వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై యూఐడీఏఐ అధికారులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విచారిస్తామని బదులిస్తున్నారు. నేరగాళ్లు ఇతరుల ఆధార్ ఉపయోగించి నేర కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదులు ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది.

క్లోనింగ్‌పై అనుమానాలు

ఆధార్ కోసం వినియోగించే బయోమెట్రిక్ వేలిముద్రలను క్లోనింగ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు గతంలో భారీగా వచ్చాయి. బయోమెట్రిక్ కోసం మీసేవ కేంద్రాలు, బ్యాంకులు, పోస్టాఫీసుల్లో, ఇతర చోట్ల ఉపయోగించే యంత్రాలతో వేలిముద్రల క్లోనింగ్ చేసి ప్లాస్టిక్ వేలిముద్రలతో లాగిన్ అవుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై స్పందించిన యూఐడీఏఐ పాత ఎల్-జీరో యంత్రాలను వినియోగించకూడదని ఆదేశించింది. వాటి స్థానంలో క్లోనింగ్‌కు అవకాశం లేని ఎల్-1 యంత్రాలు ఉపయోగించాలని కోరింది. అయితే ఇప్పటికీ రాష్ట్రంలో అనేక చోట్ల పాత ఎల్-జీరో యంత్రాలే వినియోగంలో ఉన్నాయి. దీని ఆధారంగా బయోమెట్రిక్ క్లోనింగ్‌తో మోసాలకు పాల్పడుతున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై పౌరులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ ఆధార్‌లో ఎవరు.. ఎప్పుడు లాగిన్ అయ్యారన్న సమాచారాన్ని యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్‌లో లాగిన్ అయి 'లాగిన్ హిస్టరీ' ద్వారా తెలుసుకోవచ్చు. వీటిని పరిశీలిస్తూ ఉండాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా యూఐడీఏఐకి ఫిర్యాదు చేయాలని నిపుణులు కోరుతున్నారు. ఇతరులెవరూ ఆధార్ బయోమెట్రిక్ ఉపయోగించకుండా.. ఆధార్ వెబ్‌సైట్లో 'బ్లాక్ బయోమెట్రిక్' ఆప్షన్ ఉపయోగించుకోవాలని నిపుణులు కోరుతున్నారు. దీంతో వారి ఆధార్‌ను ఇతరులు లాగిన్ చేయడం అసాధ్యమని అంటున్నారు. ఆధార్ ఉపయోగిస్తున్న సందర్భంలోనే దీన్ని అన్‌లాక్ చేయాలని, ఎప్పుడూ 'లాక్' చేసి ఉంచాలని సూచిస్తున్నారు.



నాగార్జునసాగర్ 26 గేట్ల నుంచి దిగువకు వెళుతున్న నీరు

శ్రీశైలానికి 6 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» నాగార్జున సాగర్‌కు 5.6 లక్షల క్యూసెక్కుల వరద

» భద్రాచలం వద్ద 50 అడుగుల ఎత్తులో గోదావరి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

కర్ణాటక, మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, గోదావరి నదులకు వరద కొనసాగుతోంది. గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు మంగళవారం 4.66 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో 31 గేట్లను ఎత్తి 4.62 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. శ్రీశైలం జలాశయానికి 6.08 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పది గేట్లను 26 ఫీట్ల మేర ఎత్తి 5,76,940 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 64,211 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 205.2 టీఎంసీల నిల్వ ఉంది. నాగార్జున సాగర్‌కు 5,61,884 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు సామర్థ్యం 312 టీఎంసీలు కాగా 294.8 టీఎంసీలు నీరు ఉంది. కుడి కాల్వ ద్వారా 9,533 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 6,401 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,251 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200 క్యూసెక్కులు, 26 గేట్ల నుంచి 5,31,534 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 5,81,919 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు 50 అడుగులకు చేరింది. దీంతో కలెక్టర్ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రాచలం నుంచి చర్ల వెళ్లే మార్గంలో తూరుబాక డైవర్షన్ రోడ్డు వద్ద మంగళవారం సైతం రాకపోకలు నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుకు 1.16 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది.

కౌకుంట్ల వాగులో ఒకరు గల్లంతు..

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల పరిధిలోని కౌకుంట్ల - ఇస్రంపల్లి వాగులో మంగళవారం ఒకరు గల్లంతయ్యారు. ఇస్రంపల్లికి చెందిన అలివేలమ్మ, శాఖాపూర్ గ్రామానికి చెందిన రమేశ్ కలిసి వాగు దాటుతుండగా వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వాగులోకి దూకి అలివేలమ్మను కాపాడారు. రమేశ్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

చివరి మజిలీకీ కష్టాలే..

వర్షాల వల్ల ఏజెన్సీ ప్రాంతంలో మనిషి చివరి మజిలీకి సైతం కష్టాలు తప్పడంలేదు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఉప్పేడువీరాపురం గ్రామపంచాయతీ పరిధిలోని వెంగళరావుపేటకు చెందిన వేల్పుల సమ్మయ్య(58) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. దీంతో అంతిమ సంస్కారాల కోసం ఆయన మృతదేహాన్ని తరలించారు. అయితే శ్మశాన వాటికకు వెళ్లే దారి గోదావరి వరదతో మునిగిపోయింది. కి.మీ. మేర మోకాలి లోతు నీళ్లు, బురదతో నిండిపోయింది. మరో మార్గం లేకపోవడంతో గ్రామస్థులు ఆ వరద నుంచే నడిచి మృతదేహాన్ని తరలించారు.

రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందే బీఆర్ఎస్

» వారి బాకీ కార్డును చూసి జనం నవ్వుకుంటున్నారు

» వాళ్లు చేసిన అప్పును మేం చెల్లిస్తున్నాం

» కాంగ్రెస్ మాట ఇస్తే కట్టుబడి ఉంటుంది బీసీ రిజర్వేషన్లతో మళ్లీ నిరూపితమైంది

» టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్ వాళ్లకు.. అప్పు అనే మాట పలికే అర్హత లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. "తెలంగాణను బాకీ రాష్ట్రంగా మార్చిందే బీఆర్ఎస్. వారు రూ.8 లక్షల కోట్లు అప్పులు చేస్తే.. వాటిని చెల్లిస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. ప్రతి నెలా రూ.6500 కోట్ల మేరకు వాయిదాల కింద కట్టాల్సి వస్తోంది. కొత్తగా బీఆర్ఎస్ పార్టీ నేతలు బాకీ కార్డు అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారు" అని మహేశ్‌గౌడ్ చెప్పారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక 65 వేల ఉద్యోగాలు ఇచ్చినందుకు; రూ.500కే వంట గ్యాస్ ఇస్తున్నందుకు; రుణమాఫీ చేసినందుకు; వరికి బోనస్ ఇస్తున్నందుకు; కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడ్డట్టా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా బయటపడుతుండడంతో దిక్కుతోచక బాకీ కార్డు పేరుతో ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వారు ఎంత ప్రయత్నించినా స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతానికి పైగా సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీ గెలిచి తీరుతుందని చెప్పారు. బీజేపీ.. బీసీల నోటికాడ ముద్దను లాక్కునే ప్రయత్నం చేస్తోందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటి గురించి ప్రధాని మోదీని అడిగే దమ్ము రాష్ట్ర ఎంపీలకు లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో అది మరోసారి నిరూపితమైందని చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కోర్టులో పిల్ వేయించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హైడ్రా ఏర్పాటు దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమన్నారు. ఆదిత్య కన్‌స్ట్రక్షన్స్‌పై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందంటూ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నేడు ఎమ్మెల్యేలను ప్రశ్నించనున్న పిటిషనర్ల తరఫు న్యాయవాదులు

పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేల్లో నలుగురిపై ప్రారంభమైన విచారణ బుధవారం కొనసాగనుంది. బుధవారం జరిగే విచారణలో పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను ప్రశ్నించనున్నారు.

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్ బూటకం!

» సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి : గడ్డం లక్ష్మణ్

నల్లకుంట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేతలు కడారి సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డిలది బూటకపు ఎన్‌కౌంటర్ అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ గడ్డం ఆరోపించారు. దీనిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఛత్తీస్‌ఘడ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు నేతలిద్దరిని నిరాయుధులుగా చేసి చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని అన్నారు. వారిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టాల్సింది పోయి అక్రమంగా ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపడాన్ని ప్రజలందరూ కూడా వ్యతిరేకించాలని చెప్పారు.



యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ధ్వంసమైన లారీ ట్యాంకర్, తుఫాన్ వాహనం

కెమికల్ ట్యాంకర్ బోల్తా.. 2 వాహనాలు ధ్వంసం

» ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

» తప్పిన పెనుముప్పు.. జాతీయ రహదారిపై ఘటన

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. స్థానిక సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరిన కెమికల్ ట్యాంకర్.. చౌటుప్పల్ బస్టాండ్ వద్దకు రాగానే అదుపుతప్పి సర్వీసు రోడ్డులో నిలిపి ఉంచిన రెండు వాహనాలపై పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో రెండు కార్లు ధ్వంసం కాగా, ట్యాంకర్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో వాహనాల్లో గానీ, వాటి పరిసరాల్లో గానీ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఘటనాస్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

వివాహితపై సామూహిక అత్యాచారం

కొన్ని రోజుల పాటు ముగ్గురి అఘాయిత్యం

నిజామాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ జిల్లాలో ఓ వివాహితపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. కొన్ని రోజుల పాటు సాగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలానికి చెందిన వివాహిత (25)కు నిజామాబాద్ నగరానికి చెందిన సెంట్రింగ్ పనిచేసే వ్యక్తి ఇటీవల పరిచయమయ్యాడు. ఆమె ఇంటి ఎదురుగా ఉన్న భవనంలో సెంట్రింగ్ పనిచేస్తున్న క్రమంలో ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెకు మాయమాటలు చెప్పి ఆమె కుమారుడితో సహా నిజామాబాద్ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి తీసుకువెళ్లాడు. అక్కడ ఓ ఇంట్లో ఉంచి.. ఈ నెల 11న రాత్రి ఆమెకు, కుమారుడికి ఆహారంలో మత్తు పదార్థం కలిపి ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేశాడు. అక్కడ అతనితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఆమెపై అత్యాచారం చేశారు. కొన్ని రోజుల పాటు ఆ ముగ్గురూ ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. చివరిసారిగా ఈ నెల 26న ముప్కాల్ మండలంలోని ఓ ఇంట్లో మొదటి నిందితుడు ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ నెల 27న ఆమెను నాగారంలో వదిలి పరారయ్యాడు. బాధితురాలు సోమవారం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ముగ్గురు నిందితులనూ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ సురేష్ తెలిపారు.

భారత్ శుభారంభం

శ్రీలంకపై ఘనవిజయం

దీప్తి శర్మ ఆల్‌రౌండ్ షో ● మహిళల వన్డే వరల్డ్‌కప్



స్కోరుబోర్డు

భారత్: ప్రతికా (సి) గుణరత్నే (బి) రణవీర 37, మంధాన (సి) గుణరత్నే (బి) ప్రబోధని 8, హర్లీన్ (సి) దిల్హరి (బి) రణవీర 48, హర్మన్‌ప్రీత్ (సి) సంజీవని (బి) రణవీర 21, జెమీమా (బి) రణవీర 0, దీప్తి శర్మ (సి) సుగంధిక (బి) కులసూర్య 53, రిచా ఘోష్ (సి) ప్రబోధని (బి) ఆటపట్టు 2, అమన్‌జోత్ (సి) గుణరత్నే (బి) ప్రబోధని 57, స్నేహ్ రాణా (నాటౌట్) 28, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 47 ఓవర్లలో 269/8; వికెట్ల పతనం:** 1-14, 2-81, 3-120, 4-120, 5-121, 6-124, 7-227, 8-269; **బౌలింగ్:** కులసూర్య 8-0-42-1, ప్రబోధని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, దిల్హరి 8-0-51-0, రణవీర 9-0-46-4, ఆటపట్టు 3-0-24-1.

శ్రీలంక: హాసిని పెరీరా (బి) క్రాంతి 14, ఆటపట్టు (బి) దీప్తి 43, సమరవిక్రమ (ఎల్బీ) శ్రీచరణి 29, విష్మి గుణరత్నే (ఎల్బీ) అమన్‌జోత్ 11, దిల్హరి (సి) రిచా (బి) దీప్తి 15, నీలాక్షిక సిల్వా (బి) స్నేహ్ రాణా 35, సంజీవని (సి) హర్మన్ (బి) దీప్తి 6, సుగంధిక (బి) స్నేహ్ రాణా 10, కులసూర్య (సి) మంధాన (బి) శ్రీచరణి 17, ప్రబోధని (నాటౌట్) 14, రణవీర (ఎల్బీ) ప్రతిక 3, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 45.4 ఓవర్లలో 211 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-30, 2-82, 3-103, 4-105, 5-130, 6-140, 7-173, 8-184, 9-199, 10-211; **బౌలింగ్:** క్రాంతి గౌడ్ 9-0-41-1, అమన్‌జోత్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతీకా రావల్ 2.4-0-6-1,

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో తొలి టైటిల్ వేటను భారత్ ఘనంగా ఆరంభించింది. దీప్తి శర్మ ఆల్‌రౌండ్‌షో (53; 3/54)తో అదరగొట్టగా మంగళవారం శ్రీలంకతో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిన 59 రన్స్ తేడాతో నెగ్గింది. ఈ మ్యాచ్‌కు రెండుసార్లు వర్షం ఆటంకం కలిగించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 47 ఓవర్లలో 8 వికెట్లకు 269 పరుగులు చేసింది. అమన్‌జోత్ (57), హర్లీన్ (48), ప్రతీకా రావల్ (37), స్నేహ్ రాణా (28 నాటౌట్) రాణించారు. అటు ఫీల్డింగ్‌లో నిరాశపరిచిన లంక అమన్‌జోత్ నాలుగు క్యాచ్‌లను జారవిడిచి మూల్యం చెల్లించుకుంది. స్పిన్నర్ ఇనోక రణవీరకు నాలుగు, ప్రబోధనికి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంకకు డ/లూ పద్ధతిన 271 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా.. 45.4 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (43), నీలాక్షి (35), హర్షిత (29) మాత్రమే రాణించారు. స్నేహ్, శ్రీచరణిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా దీప్తి శర్మ నిలిచింది.

శతక భాగస్వామ్యం: టాస్ ఓడిన భారత్ బ్యాటింగ్‌కు దిగగా నాలుగో ఓవర్‌లోనే మంధాన (8) అవుట్‌తో షాక్ తగిలింది. అయితే హర్లీన్, ప్రతీకా రెండో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. 26వ ఓవర్‌లో హర్లీన్, జెమీమా (0), హర్మన్‌ప్రీత్ (21)లను స్పిన్నర్ రణవీర అవుట్ చేయగా, తర్వాతి ఓవర్‌లోనే రిచా (2) సైతం వెనుదిరిగింది. దీంతో కేవలం నాలుగు పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయి 124/6 స్కోరుతో భారత్ కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 200 రన్స్ అసాధ్యంగానే అనిపించింది. కానీ దీప్తి-అమన్‌జోత్ జోడీ లంక బౌలర్లను పట్టుదలగా ఎదుర్కొంది. సమన్వయ ఆటతీరుతో ఇద్దరూ అర్ధసెంచరీలు పూర్తి చేయడంతో పాటు ఏడో వికెట్‌కు 103 పరుగులు జోడించారు. ఇక స్నేహ్ రాణా ధనాధన్ బ్యాటింగ్‌తో ఆఖరి రెండు ఓవర్లలో 34 పరుగులు సమకూర్చగా భారత్ 260+ స్కోరు దాటింది.

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
ఆస్ట్రేలియా x న్యూజిలాండ్

కోహ్లీని అనుసరిస్తా..

ఆంధ్రజ్యోతితో తిలక్ వర్మ



ఆసియా కప్ ఫైనల్లో కోట్లాది అభిమానుల ఆశలను మోస్తూ బరిలోకి దిగిన తిలక్ వర్మ అద్భుత విజయాన్నందించి భారత్‌ను సమున్నతంగా నిలిపాడు. జట్టును విజయతీరాలకు చేర్చాక అంతులేని ఉద్వేగంతో సింహనాదం చేశాడు. భారత క్రికెట్ నయా ఛేజ్ మాస్టర్‌గా అభిమానుల నుంచి నీరాజనాలందుకుంటున్న ఆసియా కప్ హీరో, తెలుగు తేజం ఠాకూర్ తిలక్ వర్మ 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న విశేషాలు.. అతడి మాటల్లోనే..

- విరాట్‌తో పోల్చడాన్ని గౌరవంగా భావిస్తున్నా
- దేశానికి టీ20 వరల్డ్‌కప్ అందించాలనేది కల
- ఫైనల్లో ప్రత్యర్థులు దారుణంగా స్లెడ్జింగ్ చేశారు
- ఆరునూరైనా దేశాన్ని గెలిపించాలనుకున్నా

2025 సెప్టెంబరు 28.. నా జీవితంలో మర్చిపోలేని రోజు. ఆసియా కప్.. అందులోనూ పాకిస్థాన్‌ను ఓడించిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేను. నా టీ20 కెరీర్‌లోని రెండు సెంచరీల కంటే ఈ ఫైనల్‌లో సాధించిన 69 పరుగులు చాలా ప్రత్యేకమైనవి. జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఇది. ఊహకందని ఒత్తిడి, భారీ అంచనాల నడుమ జరిగిన ఫైనల్లో కడవరకు బ్యాటింగ్ చేసి జట్టును గెలిపించడం కంటే మధురానుభూతి ఇంకేముంటుంది. ఆసియా కప్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌తో మ్యాచ్‌ల్లో ఎదురయ్యే సవాళ్లకు మానసికంగా సిద్ధమై ఉన్నాం. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత జరుగుతున్న టోర్నీ కావడంతో పాక్‌తో మ్యాచ్‌ల్లో ఉండే పరిస్థితుల గురించి కోచ్ గౌతం గంభీర్ మమ్మల్ని సన్నద్ధం చేశారు. ఫైనల్లో బ్యాటింగ్‌కి రాగానే స్టేడియంలోని ఆ తీవ్రత చూసి కొంచెం ఒత్తిడికి లోనయ్యా. స్వల్ప స్కోరుకే మూడు వికెట్లు కోల్పోవడంతో ఎడాపెడా షాట్లు కొట్టకుండా బాధ్యతగా ఆడాల్సిన పరిస్థితి. ఒక ఓవర్ పూర్తయిన తర్వాత క్రీజులో ఒకసారి కళ్లు మూసుకోగానే 140 కోట్ల మంది ప్రజలు జట్టుపై పెట్టుకున్న ఆశలు, నమ్మకం మదిలో మెదిలాయి. ఒక్కసారి గట్టిగా ఊపిరి తీసుకొని ఆఖరి పరుగు సాధించే వరకు క్రీజు వదలకూడదని అనుకుని పట్టుదలగా ఆడా.

కోహ్లీ అడుగుజాడల్లో నడుస్తా..

2011 వన్డే వరల్డ్‌కప్‌ను టీమిండియా గెలిచిన తర్వాత ఆ స్ఫూర్తితో నేను క్రికెట్ ఆడడం ప్రారంభించా. అప్పటి నుంచి నేను కోహ్లీ ఆట చూస్తూ అతడిని చాలా విషయాల్లో అనుకరించేవాణ్ని. బ్యాటింగ్‌లోనే కాకుండా మైదానంలోనూ కోహ్లీ చూపించే దూకుడు తాలుకూ ప్రభావం నాపై ఉంది. నా ఆరాధ్యుడైన కోహ్లీతో అభిమానులు నన్ను పోలుస్తుండడం గౌరవంగా భావిస్తున్నా. కానీ కోహ్లీ స్థానాన్ని భర్తీ చేయడం ఆషామాషీ కాదు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌ను దేశానికి అందించడమే నా లక్ష్యం. ప్రతి రోజు ఆ ఆలోచనలు నన్ను ప్రేరేపిస్తూనే ఉంటాయి. ఆ ట్రోఫీ సాధించాకే ప్రశాంతంగా నిద్రపోగలను. అప్పటిదాకా నిద్రలో కూడా అవే ఆలోచనలు వస్తుంటాయి. ప్రస్తుతానికి కొద్దిరోజులు కుటుంబంతో గడిపి, తర్వాత ఆస్ట్రేలియా సిరీస్‌కు సన్నద్ధమవుతా.

చెప్పలేని భాషలో పాక్ స్లెడ్జింగ్..

ఆటతోనే కాకుండా ప్రత్యర్థి జట్టు క్రికెటర్లు మమ్మల్ని చాలా కవ్వించారు. చెప్పలేని భాషలో స్లెడ్జింగ్‌కు దిగారు. నా ఏకాగ్రతను దెబ్బతీయడానికి తీవ్రంగా యత్నించారు. మాటలతో మానసికంగా దెబ్బకొట్టి పైచేయి సాధించాలని చూశారు. నేను మాత్రం ఏకాగ్రత కోల్పోకుండా బంతిపైనే దృష్టి పెట్టి బ్యాటింగ్ చేశా. వారి చేష్టలకు, మాటలకు నేను ఆవేశపడి ఒక్క చెత్త షాట్ ఆడినా మ్యాచ్ ఫలితమే తారుమారయ్యే అవకాశం ఉండడంతో సంయమనంతో ఆడా. ఒత్తిడి సమయాల్లో ఎలా ఆడాలో కోచ్ సలాం బయాష్ సార్ వద్ద బాల్యం నుంచి నేర్చుకున్నదాన్ని ఫైనల్లో ఆచరణలో పెట్టా. మనం మూడో వికెట్ కోల్పోయాక పాక్ ఆటగాళ్లు మైదానంలో బాగా రెచ్చిపోయారు. గెలుపు తమదే అన్నట్టు ప్రవర్తించారు. అయినా నేను నా నోటితో కాకుండా బ్యాట్‌తోనే స్పందించా. కోట్లాది భారతీయుల ముఖాల్లో ఆనందం చూడాలని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుని ఆడా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

ఐదు బోర్డుల చెంతకు ట్రోఫీ వివాదం

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో విజేతగా నిలిచిన భారత జట్టుకు ప్రదానం చేయాల్సిన ట్రోఫీ విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. మంగళవారం జరిగిన ఆసియా క్రికెట్ మండలి (ఏసీసీ) వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లోనూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేక పోయారు. ఈ సమస్య పరిష్కార బాధ్యతలను ఏసీసీలోని ఐదు టెస్ట్ దేశాలకు వదిలేశారు. దీంతో భారత్, పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ బోర్డులు చర్చించి త్వరలో నిర్ణయం తీసుకోనున్నాయి. ఈ వివాదంపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని బీసీసీఐ ఈపాటికే హెచ్చరించింది. ఏసీసీ చీఫ్‌గా ఉన్న మొహిసిన్ నక్వీ పాకిస్థాన్ ప్రభుత్వంలో మంత్రిగా కూడా ఉండడంతో.. ఆదివారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ గెలిచిన అనంతరం అతడి చేతుల మీదుగా ట్రోఫీని అందుకొనేందుకు భారత్ నిరాకరించింది. దీంతో ట్రోఫీతోపాటు టీమిండియాకు ఇవ్వాల్సిన మెడల్స్‌ను నక్వీ తన హోటల్ రూమ్‌కు తరలించినట్టు ఆరోపణలు వచ్చాయి. కాగా, నక్వీ అధ్యక్షతన జరిగిన ఏసీసీ ఏజీఎంలో బీసీసీఐ ప్రతినిధులుగా రాజీవ్ శుక్లా, ఆశిష్ షేలర్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

నెట్స్‌లో చెమటోడ్చిన టీమిండియా

అహ్మదాబాద్: ఆసియా కప్ విజేతగా నిలిచిన భారత్.. స్వదేశానికి చేరుకొన్న వెంటనే వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం ప్రాక్టీస్ ఆరంభించింది. మంగళవారం జరిగిన నెట్ సెషన్స్ నుంచి బుమ్రా, కుల్దీప్, అక్షర్ విరామం తీసుకోగా.. మిగతా టీమ్ మూడు గంటలు సాధన చేసింది. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లో భాగంగా విండీస్‌తో తొలి టెస్ట్ గురువారం నుంచి జరగనుంది. ప్రాక్టీస్ తర్వాత గంభీర్ మరోసారి పిచ్‌ను పరిశీలించాడు. స్వదేశంలో న్యూజిలాండ్‌తో చిత్తయిన నేపథ్యంలో తొలి టెస్ట్ కోసం ఎలాంటి పిచ్‌ను రూపొందించారనేది ఆసక్తికరంగా మారింది. గతంలో భారత బలానికి తగ్గట్టుగా స్పిన్ వికెట్‌ను తయారు చేసేవారు. మరి గిల్ హయాంలో పాత ఫార్ములాకే కట్టుబడతారా? లేక ప్రయోగాలు చేస్తారా? చూడాలి.

హిమాన్షు జోడీకి పసిడి

▫ జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: జూనియర్ షూటింగ్ వరల్డ్ కప్‌లో భారత క్రీడాకారుల జోరు కొనసాగుతోంది. మంగళవారం జరిగిన పోటీల్లో భారత్‌కు ఓ స్వర్ణం, రజతం, కాంస్యంతో కలిపి మూడు పతకాలు దక్కాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత ద్వయం హిమాన్షు/ఇషా అనిల్ తక్సాలే విజేతగా నిలిచింది. నరేన్/శాంభవి రన్నరప్‌గా నిలవడంతో రజతం భారత్ ఖాతాలో చేరింది. ట్రాప్ ఈవెంట్‌లో వినయ్ చంద్రావత్ కాంస్యం దక్కించుకున్నాడు.

సుమీత్ హ్యాట్రిక్

● సందీప్‌కు స్వర్ణం ● ఫైనల్‌కు అకీరా

ప్రపంచ పారా అథ్లెటిక్స్



న్యూఢిల్లీ: వరల్డ్ పారా అథ్లెటిక్స్ జావెలిన్ త్రోలో ఫేవరెట్ సుమీత్ అంటిల్ వరుసగా మూడో పసిడి సాధించగా.. ఎఫ్-44 విభాగంలో సందీప్ సంజయ్ సాగర్, సందీప్ చౌధురి స్వర్ణ, రజతాలు కొల్లగొట్టారు. మంగళవారం జరిగిన పురుషుల ఎఫ్-64 ఫైనల్లో సుమీత్ 71.37 మీ. దూరం విసిరి టాప్‌లో నిలిచాడు. 2023, 2024లో కూడా అంటిల్ పసిడి పతకాలు నెగ్గాడు. పురుషుల ఎఫ్-44 కేటగిరీలో సందీప్ సాగర్ 62.82 మీటర్లు విసిరి టాప్‌లో నిలిచాడు. చౌధురి 62.67 మీటర్ల దూరం విసిరి రజతం దక్కించుకొన్నాడు. పురుషుల ఎఫ్-56 డిస్కస్ త్రోలో యోగేష్ కథూనియా 42.49 మీ. దూరం విసిరి రజతం సాధించాడు. కాగా, తెలంగాణకు చెందిన బానోతు అకీరా నందన్ పురుషుల 400 మీ. టీ38 కేటగిరి హీట్-1లో 50.55 సెకన్ల టైమింగ్‌తో ఫైనల్‌కు అర్హత సాధించాడు.

బిజినెస్

మార్కెట్లో ఐపీఓ రష్



అక్టోబరు 7న ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇష్యూ

న్యూఢిల్లీ: ఈక్విటీ మార్కెట్ గత కొద్ది నెలలుగా తీవ్ర ఆటుపోట్లలో ట్రేడవుతూ ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగుల్చుతున్నప్పటికీ పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధుల సేకరణ కోసం కంపెనీలు పరుగులు తీస్తూనే ఉన్నాయి. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ వచ్చే నెల 7వ తేదీన ఐపీఓ జారీ చేస్తోంది. ఈ ఇష్యూ 9వ తేదీన ముగుస్తుంది. ఇష్యూ పరిమాణం ఎంత అన్నది కంపెనీ ప్రకటించకపోయినా సుమారు రూ.15,000 కోట్లుంటుందని అంచనా. 6వ తేదీన యాంకర్ ఇన్వెస్టర్ల పెట్టుబడులకు అవకాశం కల్పిస్తారు. హ్యుండయ్ మోటార్స్ తర్వాత భారత స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అవుతున్న రెండో కొరియన్ కంపెనీ ఇది. ఈ ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ 10.18 కోట్ల షేర్లను (ఈక్విటీలో 15%) విక్రయించనుంది. గత డిసెంబరులో ఎల్‌జీ కంపెనీ సెబీకి దరఖాస్తు చేయగా మార్చిలో అనుమతి లభించింది. అయితే ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో జారీ అవుతున్న ఇష్యూ కావడం వల్ల ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్‌కు లభించే ప్రయోజనం ఏమీ ఉండదు.

విరూపాక్ష ఆర్గానిక్స్ ఐపీఓ దరఖాస్తు: తొలి పబ్లిక్ ఇష్యూకు (ఐపీఓ) అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ విరూపాక్ష ఆర్గానిక్స్ మార్కెట్ నుంచి రూ.740 కోట్ల సేకరణకు అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేసింది. ఇష్యూలో భాగంగా పూర్తిగా తాజా షేర్లు జారీ చేయనున్నట్టు కంపెనీ ఆ దరఖాస్తులో తెలిపింది. ఇందులో రూ.148 కోట్లు ఐపీఓకి ముందు సేకరించే ఆస్కారం ఉన్నట్టు తెలియచేసింది. ఇష్యూ ద్వారా సేకరించే నిధులను సామర్థ్య విస్తరణ కోసం చేసే పెట్టుబడి వ్యయాలకు, రుణభారం తగ్గించుకునేందుకు వినియోగించుకోనున్నట్టు పేర్కొంది. ఇది కాకుండా మరో నాలుగు కంపెనీలు - కామ్‌టెల్ నెట్‌వర్క్స్, ప్రీమియర్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, శంకేష్ జువెలర్స్, విశ్వరాజ్ ఎన్విరాన్‌మెంట్ కూడా పబ్లిక్ ఇష్యూకు అనుమతి కోరుతూ సెబీకి దరఖాస్తు చేయగా ఫెర్టిలిటీ సేవలందించే గాడియం ఐవీఎఫ్ అండ్ విమెన్ హెల్త్ లిమిటెడ్ కంపెనీ సెబీకి సవరణలతో తాజా దరఖాస్తును అందించింది. సర్వీస్‌గా సాఫ్ట్‌వేర్ (సాస్) సేవలందించే కంపెనీ క్యాపిలరీ టెక్నాలజీస్ ఇండియా ఐపీఓకు సెబీ ఆమోదముద్ర వేసింది.

హైదరాబాద్‌లో హార్ట్‌ఫోర్డ్ టెక్నాలజీ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన బీమా కంపెనీ హార్ట్‌ఫోర్డ్ హైదరాబాద్‌లో ఇండియా టెక్నాలజీ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించింది. కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్నోవేషన్ సామర్థ్యాలను వినియోగించుకుని భవిష్యత్ బీమా టెక్నాలజీని అభివృద్ధి చేయాలన్న కంపెనీ కట్టుబాటుకు ఈ కేంద్రం ఏర్పాటు నిదర్శనమని కంపెనీ తెలిపింది. అత్యాధునిక వర్క్ స్టేషన్లు, శిక్షణా వసతులు ఈ కేంద్రంలో ఉంటాయని వెల్లడించింది. 200 సంవత్సరాల హార్ట్‌ఫోర్డ్ చరిత్రను తెలియచేసే ఒక కుడ్యం ఈ కేంద్రంలో ప్రత్యేకత అని చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ శేఖర్ పన్నాల తెలిపారు. 1810లో ఏర్పాటైన హార్ట్‌ఫోర్డ్ ఫార్చ్యూన్ 200 కంపెనీల్లో ఒకటి. ప్రపంచవ్యాప్తంగా 19 వేల మంది కంపెనీలో పని చేస్తున్నారు.

కార్యాలయ స్థలాలకు మంచి డిమాండు

హైదరాబాద్‌లో 7% వృద్ధి

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కార్యాలయ స్థలాలకు డిమాండు 35% పెరిగింది. దేశ, విదేశీ కంపెనీలు 162.5 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణం గల స్థలాలను లీజుకి తీసుకున్నాయి. హైదరాబాద్‌లో లీజింగ్ 7 శాతం పెరిగి 13.2 లక్షల నుంచి 14.2 లక్షల చదరపు అడుగులకు చేరింది. అయితే బెంగళూరు, ముంబై నగరాల్లో మాత్రం నికర లీజింగ్ గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే తగ్గినట్టు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తాజా నివేదికలో తెలిపింది.

6 నెలలు రూ.23 లక్షల కోట్లు

మార్కెట్ తిరోగమనంలో సంపద నష్టం | ఆగని 'ఎఫ్‌పీఐ'ల అమ్మకాలు



ఎనిమిదో రోజూ నష్టాలే


దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా ఎనిమిదో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 97.32 పాయింట్ల నష్టంతో 80,267.62 వద్ద, నిఫ్టీ 23.80 పాయింట్ల నష్టంతో 24,611 వద్ద ముగిశాయి. గత ఎనిమిది రోజుల్లో సెన్సెక్స్ 2,746.34 పాయింట్లు నష్టపోయింది. ఎడతెగని ఎఫ్‌పీఐ అమ్మకాలు, బుధవారం వెలువడే ఆర్‌బీఐ ద్రవ్య, పరపతి విధానం ఎలా ఉంటుందోననే ఆందోళన, గురువారం ముగిసే సెప్టెంబరు నెల డెరివేటివ్స్ సెటిల్‌మెంట్ మంగళవారం ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ప్రధాన సానుకూల అంశాలేవీ లేకపోవడమూ మార్కెట్‌కు కలిసి రాలేదు.

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరంలో దేశీయ స్టాక్ మార్కెట్ మూడడుగులు ముందుకు, ఆరడుగులు వెనక్కి వేస్తోంది. సెప్టెంబరుతో ముగిసిన ఆరు నెలల కాలంలో బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ.23 లక్షల కోట్లు ఆవిరైపోయి రూ.451.6 లక్షల కోట్లకు చేరింది. అయినా గత ఆరు నెలల్లో సెన్సెక్స్ 4.6%, నిఫ్టీ 3.7% లాభపడ్డాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం తర్వాత సూచీలు ఇంత కనిష్ఠ లాభాలతో ట్రేడవడం ఇదే మొదటిసారి. ఆ సమయంలో ఈ రెండు ప్రధాన సూచీలు దాదాపు రెండు శాతం వరకు నష్టపోయాయి. అయితే గత ఆరు నెలల్లో నిఫ్టీ మిడ్‌క్యాప్-100, నిఫ్టీ స్మాల్‌క్యాప్-100 సూచీలు మాత్రం తొమ్మిది శాతం వరకు లాభాలు పంచాయి.

ఆదుకుంటున్న డీఐఐలు : అంతర్జాతీయ ఉద్రిక్తతలతో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) గత ఆరు నెలల్లో దాదాపు రూ.37,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. భారత్ కంటే చైనా మార్కెట్ చౌకగా ట్రేడవడం ఇందుకు దోహదం చేస్తోంది. ఎఫ్‌పీఐలు అమ్మకాలు చేస్తుంటే దేశీయ సంస్థలు (డీఐఐ) మాత్రం మార్కెట్‌ను ఆదుకుంటున్నాయి. గత ఆరు నెలల్లో ఈ సంస్థలు దాదాపు రూ.4 లక్షల కోట్ల విలువ చేసే షేర్లను కొనుగోలు చేసినట్టు అంచనా. డీఐఐలు ఆదుకోకపోతే సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలకు లోనయ్యేవి.

సత్తా చాటిన రంగాలు: గత ఆరు నెలల్లో ఆటోమొబైల్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, మెటల్ కంపెనీల షేర్ల మాత్రం మదుపరులకు మంచి లాభాలే పంచాయి. ఐటీ, సిమెంట్, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లు మాత్రం బేర్‌మంటున్నాయి. ఐటీ ఇండెక్స్ దాదాపు తొమ్మిది శాతం నష్టపోయింది.

బంగారం...14 సంవత్సరాల్లో అత్యుత్తమ నెలవారీ వృద్ధి



ముంబై: బంగారం, వెండి ధరలు తగ్గేదేలే అన్నట్టుగా దూసుకుపోతూనే ఉన్నాయి. మంగళవారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర మరో రూ.500 పెరిగి రూ.1.20 లక్షలకు చేరింది. ఆభరణాల బంగారం (99.5%) సైతం రూ.500 పెరిగి 1,19,400 పలికింది. కిలో వెండి ధర కూడా రూ.500 పెరిగి రూ.1,50,500 స్థాయిని తాకింది. స్వల్పకాలిక ఫండింగ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరకపోవడంతో ప్రభుత్వ షట్ డౌన్ తప్పకపోవచ్చునన్న భయాలు ఇన్వెస్టర్ల దృష్టిని ఈక్విటీల నుంచి బులియన్ వైపు ఆకర్షించేందుకు దోహదపడ్డాయి. బంగారం ధరలకు ఇది 14 సంవత్సరాల కాలంలో అత్యుత్తమ నెలవారీ వృద్ధి అని చెబుతున్నారు. సెప్టెంబరు నెలలో బంగారం ధర 11.4% పెరిగింది. 2011 ఆగస్టులో నమోదైన అత్యధిక నెలవారీ వృద్ధి 15% తర్వాత ఒక నెలలో ధర ఈ స్థాయిలో పెరగడం ఇదే ప్రథమం. అయితే అంతర్జాతీయ విపణిలో ధరలు మాత్రం రికార్డు స్థాయిల నుంచి దిగజారాయి. స్పాట్ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 0.55% దిగజారి 3813.14 డాలర్ల వద్ద స్థిరపడింది. వెండి ధర కూడా 1.51% దిగజారి ఔన్సు 46.22 డాలర్లు పలికింది. ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో పసిడి మదుపరులకు మంచి లాభాలు పంచింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు పసిడి ధర 23.5 శాతం పెరిగింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,18,310 ▲	1,08,450 ▲	1,61,000 ▲
విజయవాడ	1,19,000 ▼	1,12,000 ▼	1,46,500 ▼
విశాఖపట్నం	1,19,240 ▲	1,08,450 ▲	1,61,000 ▲
రాజమండ్రి	1,17,400 ▲	1,07,650 ▲	1,49,300 ▲
ప్రొద్దుటూరు	1,22,100 ▲	1,12,330 ▲	1,50,000 ▲
ముంబై	1,15,450 ▼	1,05,660 ▼	1,42,434 ▼

ఎల్ఐసీ ఎండీగా ఆర్. చందర్

ఎఫ్ఎస్ఐబీ సిఫారసు ● రెండు బ్యాంకులకు కొత్త సారథులు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో డైరెక్టర్లను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ).. జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) పదవికి ఆర్. చందర్‌ను సిఫారసు చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక పదవి కోసం మొత్తం ఐదుగురు అభ్యర్థులను బోర్డు ఇంటర్వ్యూ చేయగా, వారి పనితీరు, సమగ్ర అనుభవం, నియామక ప్రమాణాల ఆధారంగా చందర్‌ను ఎంపిక చేసినట్టు ఎఫ్ఎస్ఐబీ ఓ ప్రకటనలో తెలిపింది. కాగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామక వ్యవహారాల కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుంది.

యూనియన్ బ్యాంక్ సీఈఓగా ఆశీష్ పాండే: రెండు ప్రభుత్వరంగ బ్యాంకులకు కొత్త సారథులను ప్రభుత్వం నియమించింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓగా ఆశీష్ పాండేను, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధిపతిగా కల్యాణ్ కుమార్‌ను మూడు సంవత్సరాల కాలానికి నియమించింది. పాండే ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పనిచేస్తుండగా, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉన్న కల్యాణ్ కుమార్, జులైలో పదవీ విరమణ చేసిన ఎం.వీ రావు స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లు యథాతథం

న్యూఢిల్లీ: చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను ప్రభుత్వం మరోసారి యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది. అక్టోబర్ నుంచి ప్రారంభమ్యే త్రైమాసికంలో ప్రస్తుతం అమలులో ఉన్న వడ్డీరేట్లే కొనసాగుతాయని ఆర్థిక మంత్రిత్వశాఖ తాజా నోటిఫికేషన్‌లో వెల్లడించింది. చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లు యథాతథంగా కొనసాగించడం ఇది వరుసగా ఏడో సారి.

ముఖ్య పథకాలపై ప్రస్తుత వడ్డీ రేట్లు

పథకం పేరు	వడ్డీ రేటు
సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)	8.2 %
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ)	7.7 %
కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)	7.5 %
మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎమ్ఐఎస్)	7.4 %
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)	7.1 %
3-సంవత్సరాల టర్మ్ డిపాజిట్	7.1 %
పోస్టాఫీస్ సేవింగ్స్ డిపాజిట్	4 %

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	530
చిత్తూరు	543	విశాఖపట్నం	520
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	117
వరంగల్	110	గుంటూరు	122
కరీంనగర్	110	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	122	అనంతపురం	107
గోదావరి	117		

ఇ-కామర్స్ సంస్థలపై ప్రభుత్వ నిఘా

జీఎస్‌టీ తగ్గింపు అమలుపై ఆరా

న్యూఢిల్లీ: జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనం ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగదారులకు చేరాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఇందులో భాగంగా ఇ-కామర్స్ సంస్థలు రోజువారీ వినియోగంలో ఉన్న దాదాపు 54 వస్తువుల ధరలను తగ్గించిందీ లేనిదీ నిశితంగా గమనిస్తోంది. ఇందుకోసం ఆ సంస్థల అమ్మకాల పైనా నిఘా పెట్టినట్టు అధికార వర్గాలు చెప్పాయి. ఇప్పటికే దాదాపు ప్రతి ప్రధాన ఎఫ్ఎంసీజీ కంపెనీ జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేస్తున్నట్టు ప్రకటించాయి. అయితే ఆన్‌లైన్‌లో కొన్ని కంపెనీలు ఇంకా ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు బదిలీ చేయలేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అలైడ్ బ్లెండర్స్ పెట్ బాటిల్స్ యూనిట్ ప్రారంభం

రూ.115 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తెలంగాణ వనపర్తి జిల్లాలోని రంగాపూర్ వద్ద ప్రముఖ దేశీయ మద్యం తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ లిమిటెడ్ (ఏబీడీ) ఏర్పాటు చేసిన పెట్ బాటిల్స్ తయారీ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించింది. రూ.115 కోట్ల పెట్టుబడితో ఏటా 60 కోట్ల పెట్ బాటిల్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్టు కంపెనీ ఎండీ అలోక్ గుప్తా చెప్పారు. దీంతో తమ కంపెనీకి చెందిన అన్ని యూనిట్ల పెట్ బాటిల్స్ అవసరాలు తీరతాయన్నారు. రంగాపూర్‌లో కంపెనీ ఇప్పటికే ఒక డిస్టిలరీ, బాట్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తోంది. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ సమగ్ర యూనిట్‌లో సింగిల్ మాల్ట్ ప్లాంట్ ఏర్పాటు కూడా పూర్తవుతుందన్నారు. దీంతో ప్రపంచంలో ఇదే తొలి సమగ్ర మద్యం తయారీ ప్లాంట్ అవుతుందని గుప్తా చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఏబీడీకి అతి పెద్ద మార్కెట్లన్నారు.

తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మార్చి.. అంతలోనే..!





తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా పేరు మారుస్తూ ఏర్పాటు చేసిన బోర్డు, మంగళవారం సాయంత్రం కనిపించకుండా చేసిన దృశ్యం

ఇటీవలే తెలుగుతల్లి ఫ్లైఓవర్ పేరును తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా మార్చింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఫ్లైఓవర్ ప్రారంభం వద్ద తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ అని రాసిన సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అది కాస్త సోషల్ మీడియాలో చెక్కర్లు కొట్టడంతో మంగళవారం సాయంత్రం ఆ బోర్డు కనిపించకుండా దానిపై తెల్లటి పేపర్ అతికించారు.

- ఆంధ్రజ్యోతి, ఖైరతాబాద్

సీఎం రేవంత్‌ను కలిసిన క్రికెటర్ తిలక్‌వర్మ

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆసియా కప్-2025 ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన తిలక్‌వర్మ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిలక్‌ను.. సీఎం రేవంత్ సత్కరించారు. అనంతరం వర్మ తన బ్యాటును సీఎం రేవంత్‌కు బహూకరించారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, శాట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, శాట్స్ ఎండీ సోనీబాల దేవి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.



సీఎం రేవంత్‌తో క్రికెటర్ తిలక్‌వర్మ, చిత్రంలో మంత్రి వాకిటి శ్రీహరి

ఉద్యోగాలు ఇవ్వాలన్నా.. పేదలకు అండగా ఉండాలన్నా

కాంగ్రెస్‌తోనే సాధ్యం

- ఉద్యోగాల పేరిట టీజీపీఎస్సీని నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్: మంత్రి పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇవ్వాలన్నా, పేదలకు అండగా ఉండాలన్నా కాంగ్రెస్ ప్రభుత్వాలతోనే సాధ్యమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల గ్రూప్-1లో జిల్లా రిజిస్ట్రార్‌లుగా ఎంపికైన వారు మంత్రిని మంగళవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి గ్రూప్-1 పోస్టులు భర్తీ చేసి ప్రజాప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. గత పాలకులు ఉద్యోగ నియామకాలు చేయాల్సిన టీజీపీఎస్సీని నిర్వీర్యం చేశారని, ఈ దశలో అధికారంలోకి వచ్చిన తమ ప్రభుత్వం సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుమారు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను ఆదాయ వనరుగా చూసిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మెరుగైన సేవలను అందించే దిశగా సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. కొత్తగా విధుల్లో చేరబోయే జిల్లా రిజిస్ట్రార్లు ప్రభుత్వ ఆలోచనలకు, ఆకాంక్షలకు అనుగుణంగా నిజాయితీగా పని చేయాలని సూచించారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా టిమ్స్

- నిమ్స్ తరహాలో స్వయం ప్రతిపత్తి: మంత్రి దామోదర

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సనత్‌నగర్, కొత్తపేట, అల్వాల్‌లో టిమ్స్ ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలోనే క్లినికల్ సర్వీసెస్, అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్, అకాడమిక్స్ విభాగాలు వేర్వేరుగా ఉండాలని సూచించారు. నిమ్స్ తరహాలో టిమ్స్‌లలోనూ స్వయం పాలన వ్యవస్థ ఉండాలన్నారు. త్వరలో సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభించనున్న నేపథ్యంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమ్స్ తరహాలో మెడికల్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్‌తోపాటుగా చీఫ్ ఆపరేషనల్ ఆఫీసర్ కూడా ఉండాలన్నారు. ఏయే విభాగానికి ఎవరు బాధ్యులు, ఎవరి పని ఏంటి అన్నదానిపై జాబ్‌చార్ట్ ఉండాలని ఆదేశించారు.

'జూబ్లీహిల్స్'లో 3.99 లక్షల మంది ఓటర్లు

- నియోజకవర్గం తుది ఓటరు జాబితా విడుదల
- పార్టీలతో జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ సమావేశం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ కోరారు. త్వరలో జరగనున్న ఈ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తుది ఓటరు జాబితాను విడుదల చేసినట్లు కమిషనర్ తెలిపారు. తుది జాబితా ప్రకారం.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 407 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,98,982 మంది ఓటర్లు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరును ఈసీఐ, సీఈవో వెబ్‌సైట్ల ద్వారా లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లో తనిఖీ చేసుకోవచ్చు. రాజకీయ పార్టీలు, పౌరులు నామినేషన్ల చివరి తేదీ వరకు ఫారం-7, ఫారం-8 ద్వారా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు అవకాశం ఉందని కమిషనర్ వివరించారు. జూలై 1 నాటికి 18 ఏళ్లు నిండిన అర్హులు, ఇప్పటికీ ఓటరుగా నమోదు చేసుకోని వారు ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తాజాగా మరో రూ.4000 కోట్ల అప్పు

హైదరాబాద్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మరో రూ.4000 కోట్ల అప్పు తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ రుణాన్ని సేకరించింది. 27 ఏళ్ల కాల పరిమితి, 7.53 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్లు తీసుకుంది. 29 ఏళ్ల కాల పరిమితి, 7.52 శాతం వడ్డీతో ఇంకో రూ.1000 కోట్లు సేకరించింది. 31 ఏళ్ల కాల పరిమితి, 7.44 శాతం వడ్డీతో మరో రూ.1000 కోట్లు తీసుకొంది. 33 ఏళ్ల కాల పరిమితి, 7.44 శాతం వార్షిక వడ్డీతో రూ.1000 కోట్ల రుణం సేకరించింది.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లివ్వండి

- ఆసక్తి వ్యక్తీకరణ కోరుతూ జాతీయస్థాయిలో నోటిఫికేషన్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు అవసరమైన డిజైన్లు తయారు చేయడానికి వీలుగా అంతర్జాతీయ స్థాయి సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ) కోరుతూ ప్రభుత్వం మంగళవారం జాతీయస్థాయిలో నోటిఫికేషన్ జారీ చేసింది. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ కోసం ఈవోఐ పిలవడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ఈనెల 19న నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు ఇచ్చిన విషయం విదితమే. ఆ తర్వాత రెండువారాల్లోగా డిజైన్ కన్సల్టెంట్‌ను ఎంపిక చేయాలని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కూడా ఆదేశాలు ఇచ్చారు. డిజైన్లు సిద్ధం చేయాలంటే విధిగా జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారం బ్యారేజీల్లో వానాకాలానికి ముందు తర్వాత భూభౌతిక/భూసాంకేతిక పరీక్షలు చేయాల్సి ఉంటుంది. వానాకాలానికి ముందు అవసరమైన పరీక్షలన్నీ చేశారు. వరదల తర్వాత పరీక్షలు చేయాల్సి ఉంది. దాంతో డిసెంబరు/జనవరి దాకా మేడిగడ్డకు వరద ఉండే అవకాశం ఉంది. నవంబరులో సుందిళ్ల, అన్నారం బ్యారేజీలకు వరద తగ్గుముఖం పట్టనుంది. దాంతో ఈక్రమంలో టెక్నికల్ బిడ్లు తెరిచి.. ప్రాథమిక అర్హత పొందిన సంస్థలను కూడా పరీక్షల ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దాంతో టెక్నికల్ బిడ్, ఫైనాన్షియల్ బిడ్ ప్రక్రియలు పూర్తయ్యేలోపు మూడు బ్యారేజీల్లో పరీక్షలు పూర్తవుతాయని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది.

రాష్ట్రంలో అమలులోకి ఎన్నికల కోడ్

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల నియమావళి సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ ఉద్యోగులు ఆ నియమావళిని కచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని సూచిస్తూ మంగళవారం సంబంధిత విభాగం మార్గదర్శకాలు జారీచేసింది. దీని ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో, బయట గోడలపై రాజకీయ నాయకుల ఫొటోలు, పేర్లుగాని వారికి సంబంధించిన గుర్తులు, జెండాలుగాని ఉండకూడదని పేర్కొన్నారు. ఒకవేళ ఉంటే వాటిని తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు సామాజిక మాధ్యమాల్లో రాజకీయ వ్యాఖ్యలు, చర్చలు, పోస్టులు చేయకూడదని, ప్రత్యక్షంగా గానీ.. పరోక్షంగా గానీ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకూడదని పేర్కొన్నారు.

సీటుకు ముగ్గురు



(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇన్‌చార్జి మంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం చర్చించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ మేరకు సూచనలు చేశారు. జిల్లా పరిషత్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జడ్పీటీసీ స్థానాలకు పార్టీ అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ముఖ్య నాయకుల అభిప్రాయాలు తీసుకుని ఈ నెల ఐదో తేదీకల్లా ఆశావహుల జాబితాను సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఒక్కో స్థానానికి ముగ్గురు ఆశావహులతో జాబితాను రూపొందించి టీపీసీసీ అధ్యక్షునికి పంపాలని తెలిపారు. ఆ జాబితాలపై చర్చించిన తర్వాత టీపీసీసీనే అభ్యర్థిని నిర్ణయిస్తుందని వివరించారు. జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికలో వారి గుణగణాలు, అభ్యర్థులకు ప్రజల్లో ఉన్న పరపతి, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సీఎం సూచించారు. మంచి అభ్యర్థిని ఎంపిక చేస్తే ఎన్నిక సాఫీగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. అన్ని రకాలుగా అర్హులైన అభ్యర్థులనే పీసీసీ ఎంపిక చేస్తుందని, గెలుపే లక్ష్యంగా పని చేయాలని మంత్రులకు దిశానిర్దేశం చేశారు. కాగా, ఎంపీటీసీ అభ్యర్థులను స్థానికంగా డీసీసీ స్థాయిలోనే ఎంపిక చేయాల్సి ఉంటుందని కాంగ్రెస్ నిర్ణయించినట్లు తెలిసింది. ఒకవేళ ఏకగ్రీవం కాకపోతే అభ్యర్థుల జాబితాను పీసీసీకి పంపించాలని సూచించినట్లు సమాచారం

అంతా కంప్యూటర్ కంట్రోల్‌లోనే..!

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారు అంతా కంప్యూటర్ కంట్రోల్‌లోనే జరిగిందని, ఈ విషయంలో ఎవ్వరూ ఏమీ చేయలేమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు తెలిసింది. పలు గ్రామాలకు సంబంధించి రిజర్వేషన్ల ఖరారు సరిగా జరగలేదనే అంశాన్ని పలువురు మంత్రులు సీఎం రేవంత్ దృష్టికి తీసుకురాగా ఆయన ఈ మేరకు స్పందించినట్లు సమాచారం. కొడంగల్ నియోజకవర్గం నుంచీ తనకు ఇలాంటి ఫిర్యాదులే వచ్చాయని సీఎం వారితో అన్నట్లు తెలిసింది. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో జనాభా ప్రాతిపదికన కంప్యూటర్ కంట్రోల్‌లో రిజర్వేషన్ల ఖరారు జరిగినట్లు సీఎం వారికి చెప్పినట్లు సమాచారం.

నామినేటెడ్ పదవుల భర్తీకి కూడా కోడ్ దెబ్బ

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీకి మరింత సమయం పట్టనుంది. జిల్లా పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన కోడ్ సోమవారం నుంచి అమలులోకి రావడమే ఇందుకు కారణం. కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వం పదవులు భర్తీ చేసే వీలు ఉండదు. దీంతో నామినేటెడ్ పదవుల భర్తీ కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెస్ నాయకుల ఆశలపై ఎన్నికల కోడ్ నీళ్లు చల్లినట్టు అయింది. నిజానికి, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీకి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం భారీ కసరత్తే చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ ఆయా పదవుల భర్తీపై పలుమార్లు సమావేశం కూడా అయ్యారు. ఇక, పదవులను ప్రకటించడమే తరువాయి అనుకుంటున్న తరుణంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్నికల కోడ్ నవంబరు 11 వరకూ కొనసాగనుంది. పరిషత్, పంచాయతీల ఎన్నికలు సజావుగా జరిగితే వెంటనే మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం అనుకుంటోంది. అదే జరిగితే పరిషత్, పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మున్సిపల్ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు రెండు నెలలు సమయం తీసుకున్నా.. ఈ ఏడాది ముగిసే వరకూ కోడ్ కొనసాగే అవకాశముంది. అంటే ఈ ఏడాదిలో నామినేటెడ్ పదవుల భర్తీ జరిగే అవకాశం ఉండదు. మరోపక్క, జీహెచ్ఎంసీ పాలకమండలి పదవీ కాలం జనవరిలో పూర్తి కానుండడంతో ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తే.. పదవులు దక్కని వారి నుంచి కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో జీహెచ్ఎంసీ ఎన్నికలు పూర్తయ్యే వరకూ నామినేటెడ్ పదవుల భర్తీ ఉండదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. స్థానిక ఎన్నికల ప్రక్రియ పూర్తయితే.. పార్టీ నాయకులు వేల మందికి పదవులు లభిస్తాయని, ఇప్పటికే నామినేటెడ్ పదవులు పొందిన వారి పదవీ కాలమూ పూర్తి కావవస్తుందని అంటున్నారు. దాంతో ఎన్నికల అనంతరం పార్టీ పెద్దలు మరోసారి భేటీ అయ్యి.. అప్పటిదాకా పదవులు పొందని నేతలకు న్యాయం చేస్తారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి. కాగా, స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ కూడా వాయిదా పడే అవకాశం కనిపిస్తుంది. డీసీసీ అధ్యక్షుల ఎంపికకు ఏఐసీసీ ఇటీవల పరిశీలకులను నియమించింది. షెడ్యూల్ ప్రకారం ఆ పరిశీలకులు ఈ నెల 4నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. కానీ, స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకూ డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ వాయిదా వేస్తారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

డబ్బుల్లేవ్.. రెండు నెలల తర్వాతే!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సర్కారు వైఖరి
- దసరా తర్వాత నిరవధిక సమ్మెకు ప్రైవేటు కాలేజీలు సిద్ధం.. నేడు ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తీవ్ర నిధుల కొరత కారణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇప్పట్లో విడుదల చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం బకాయిల్లో రూ.600 కోట్లు దసరా లోపు విడుదల చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల సంఘాల సమాఖ్య(ఫాతీ) ప్రతినిధుల సమక్షంలో సెప్టెంబరు-15న మీడియా ముందు అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కాలేజీల వారీగా విడుదల చేయనున్న బకాయిల వివరాలనూ విద్యాశాఖ ప్రకటించింది. అప్పటి నుంచి ఫాతీ ఛైర్మన్ నిమ్మగడ్డ రమేశ్‌బాబు, సెక్రటరీ జనరల్ కేఎస్ రవికుమార్, సంస్థాగత కార్యదర్శి కె.సునీల్ కుమార్, కోశాధికారి కె.కృష్ణారావు బృందం నిత్యం ఆ మంత్రులను కలిసి.. నిధుల కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. దసరాకు ముందు కనీసం రూ. 300 కోట్లు అయినా ఇస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గత సోమవారం పేర్కొన్నారు. బుధవారం నుంచి దసరా సెలవులు ఉన్నందున.. మంగళవారం నిధులు విడుదల చేస్తారని యాజమాన్యాలు ఆశించాయి. కానీ.. "మరో రెండు నెలల వరకూ విడుదల చేయడం కష్టం.. డబ్బుల్లేవు" అని ఆర్థికశాఖ ఉన్నతాధికారులు మంగళవారం పేర్కొన్నారు. దీనిపై ఫాతీ ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ. 600 కోట్లు విడుదల చేస్తామంటూ మంత్రులు అధికారికంగా హామీ ఇచ్చి దాన్ని నిలబెట్టుకోలేకపోవడంపై ఆగ్రహం వెలిబుచ్చారు. తదుపరి కార్యాచరణకు బుధవారం నగరంలోని బోట్స్ క్లబ్‌లో అత్యవసర కార్యవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. దసరా తర్వాత నిరవధిక సమ్మె నిర్వహించే అంశంపై ఈ భేటీలో చర్చించి తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

సంగారెడ్డి సద్దుల బతుకమ్మ వేడుకల్లో జగ్గారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని కిందిబజార్ మహబూబ్‌సాగర్ చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. పట్టణమంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. చెరువు వద్ద ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ హైలెట్‌గా నిలిచింది. జగ్గారెడ్డి సతీమణి టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల, జగ్గారెడ్డి కుమార్తె, యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జయాచైతన్యరెడ్డి ఇంటి నుంచి బతుకమ్మలతో ఊరేగింపుగా బయలుదేరి వచ్చారు. సద్దుల బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న జగ్గారెడ్డి.. మహిళలను ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా స్వయంగా పర్యవేక్షించారు. బతుకమ్మ పాట పాడి జగ్గారెడ్డి ఆకట్టుకున్నారు. - ఆంధ్రజ్యోతి, సంగారెడ్డి

సంగారెడ్డి మహబూబ్‌సాగర్ చెరువుకట్టపై జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో బతుకమ్మ పాట పాడుతున్న జగ్గారెడ్డి, నిర్మల, జయాచైతన్యరెడ్డి



ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డును మింగి..

మూసీ ఎఫ్‌టీఎల్‌లో భారీ అక్రమ నిర్మాణం

- ఆదిత్య వాంటేజ్‌కు అనుమతులిచ్చిందెవరు..?
- హైడ్రాకు కనబడటం లేదా: ఎంపీ రఘునందన్



హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మూసీ ఎఫ్‌టీఎల్‌లో వాంటేజ్ పేరుతో శ్రీ ఆదిత్య సంస్థ అక్రమంగా భారీ వాణిజ్య భవన నిర్మాణం చేపట్టిందని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. నార్సింగ్‌లో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును తొలగించి మరీ బహుళ అంతస్థుల భవనాన్ని కడుతుంటే హైడ్రా ఏం చేస్తోందని ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మీడియాతో మాట్లాడారు. "బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మునిసిపల్ శాఖ మంత్రి కేటీఆర్.. నార్సింగ్‌లో శ్రీ ఆదిత్య వాంటేజ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారు. నాలా, బఫర్‌జోన్‌ను ఆక్రమించి దీనిని కడుతున్నారు. దీంతో రేవంత్ సీఎం అయ్యాక నిర్మాణాన్ని నిలిపివేశారు. ఇది అక్రమ కట్టడమని హెచ్ఎండీఏ టౌన్ ప్లానింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. తాజాగా మళ్లీ పనులు ప్రారంభించారు. దీని వెనుక ఉన్న మంత్రులెవరు? సీఎంవో నుంచి ఆదేశాలు వెళ్లాయా? మహేశ్‌గౌడ్ ప్రమేయం ఉందా? ఉపముఖ్యమంత్రి ఉన్నారా? ఈ అక్రమ నిర్మాణాన్ని తక్షణం నిలిపివేయాలి. ఈ నిర్మాణానికి అనుమతులు ఇప్పించిందెవరో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌కు తెలుసు. పేదల ఇళ్లను కూల్చుతున్న హైడ్రాకు ఈ భవనం కనిపించకపోవడం దురదృష్టకరం" అని రఘునందన్ పేర్కొన్నారు. ఈ మేరకు సీఎంకు బహిరంగ లేఖ రాశారు.

కోర్టు తీర్పుతోనే ఆదిత్య వాంటేజ్‌కు అనుమతుల పునరుద్ధరణ

- రంగారెడ్డి కలెక్టర్, ఇరిగేషన్ శాఖల ఎన్‌వోసీతో 2022లో నిర్మాణానికి అనుమతుల మంజూరు
- మూసీని ఆక్రమించడంతో రద్దు: హెచ్ఎండీఏ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు తీర్పుతోనే రంగారెడ్డి జిల్లా మంచిరేవుల గ్రామంలో శ్రీ ఆదిత్య సంస్థ నిర్మిస్తున్న వాంటేజ్ భవన నిర్మాణానికి అనుమతులను పునరుద్ధరించామని హెచ్ఎండీఏ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. "మంచిరేవులలోని సర్వే నంబరు 476/ఏఏ1, 476/ఏఏ2 లో 9.19 ఎకరాల విస్తీర్ణంలో 38 అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతుల కోసం 2022 మే 12న హెచ్ఎండీఏకు దరఖాస్తు అందింది. ప్రతిపాదిత భూమికి సమీపంలో మూసీ ఉన్నట్లు హెచ్ఎండీఏ గుర్తించింది. అయితే, ఇరిగేషన్ శాఖ, రంగారెడ్డి కలెక్టర్ నుంచి అప్పటికే పొందిన ఎన్వోసీలను హెచ్ఎండీఏకు దరఖాస్తుదారు అందించారు. ఆదిత్య కంపెనీ ప్రతిపాదనలను మల్టీ స్టోరీ బిల్డింగ్(ఎంఎస్‌బీ) కమిటీ సమావేశంలో చర్చించిన తర్వాత భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడానికి నిర్దేశిత ఫీజు చెల్లించాలని సంస్థకు సూచించారు. ఫీజు చెల్లించిన తర్వాత 2022 ఆగస్టు 19న భవన నిర్మాణ అనుమతులను జారీచేశారు. మూసీ బఫర్ జోన్‌ను ఆక్రమించి రిటైనింగ్ వాల్‌ను నిర్మించినట్లు 2023 జూలై 3న హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చేపట్టిన తనిఖీలో తేలింది. దాంతో అదే ఏడాది ఆగస్టు 2న ఆదిత్య కంపెనీకి హెచ్ఎండీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ సంస్థ వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో 15రోజుల తర్వాత కంపెనీకి ఇచ్చిన భవన నిర్మాణ అనుమతులను హెచ్ఎండీఏ రద్దు చేసింది. రిటైనింగ్ వాల్‌ను తొలగించాలని సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ అనుమతులను రద్దుచేయడాన్ని సవాలు చేస్తూ ఆదిత్య కంపెనీ హైకోర్టుకు వెళ్లింది. మరోసారి తనిఖీలు చేపట్టి నివేదిక ఇవ్వాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. గతేడాది ఫిబ్రవరి 26న అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఆ సంస్థ రిటైనింగ్ వాల్‌ను తొలగించినట్లు నిర్ధారించారు. దీంతో అనుమతులను పునరుద్ధరించాలని గతేడాది మార్చి 1న హైకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పును అమలు చేస్తూ గతేడాది జూన్ 20న అనుమతులను పునరుద్ధరిస్తూ హెచ్ఎండీఏ ఉత్తర్వులు జారీ చేసింది" అని హెచ్ఎండీఏ ఒక ప్రకటనలో వివరించింది.

53 లక్షలు కాదు.. 80 లక్షల టన్నులు కొనాలి

- ధాన్యం సేకరణకు కేంద్రం సహకారం అవసరం
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ లేఖ



హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) ఈ వానాకాలం సీజన్‌కుగాను 53లక్షల టన్నుల ధాన్యం సేకరణకు అనుమతి ఇచ్చిందని, అయితే రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్న నేపథ్యంలో.. 80లక్షల టన్నుల సేకరణకు అనుమతివ్వాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి మంత్రి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని హైదరాబాద్‌లో మీడియాకు ఆయన విడుదలచేశారు. 80 వేల టన్నులు అనేది దేశ చరిత్రలోనే పెద్ద లక్ష్యమని అన్నారు. ధాన్యం సేకరణకు రూ.20 వేల కోట్లు అవుతుందని, బోనస్, రవాణా ఖర్చులు కలిపి రూ.24 వేల కోట్ల నుంచి రూ.26 వేల కోట్లకు పెరుగుతుందని, ఇంత భారీ మొత్తంలో ఏ ప్రభుత్వం కూడా రైతులకు వెచ్చించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సేకరణ లక్ష్యం పెంచాలని, అదనపు నిల్వ, రవాణా సదుపాయాలు కల్పించాలని, డెలివరీ నిబంధనలు సడలించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలోని గోదాముల్లో నిల్వలు పేరుకపోయాయని, దీంతో స్టోరేజీ సమస్య ఎదురవుతోందని, సీఎంఆర్ డెలివరీని పెంచాలంటే రాష్ట్రంలోని బియ్యం నిల్వలను తరలించాలని, తక్షణమే 300 రైల్వే రేకులు ఏర్పాటుచేయాలని ప్రహ్లాద్ జోషికి లేఖలో విన్నవించారు. రాష్ట్రంలో 22.61 లక్షల టన్నుల ఎఫ్‌సీఐ గిడ్డంగుల నిల్వ సామర్థ్యం ఉంటే.. 21.72 లక్షల టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు. కేవలం 89వేల టన్నుల బియ్యం పట్టే స్థలమే మిగిలి ఉందని తెలిపారు. యాసంగి 2024- 25లో 74 లక్షల టన్నుల ధాన్యం సేకరణ జరిగిందని, కానీ కేంద్రం 53లక్షల టన్నులకు మాత్రమే అనుమతి ఇచ్చిందని, మిగిలిన 10లక్షల టన్నుల బియ్యాన్ని ముడి బియ్యం రూపంలో కాకుండా, బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం) రూపంలో తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. ఈ బియ్యం సేకరణ గడువు ఈ ఏడాది అక్టోబరు 31 వరకే ఉన్నదని, ఇంకా 30 లక్షల టన్నుల బియ్యం బకాయిలున్న నేపథ్యంలో సీఎంఆర్ డెలివరీ గడువును మూడు నెలలు పొడిగించాలని, 2026 జనవరి 31 వరకు సమయం ఇవ్వాలని కేంద్ర మంత్రిని ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 8 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్‌కు కేంద్రం అనుమతి ఇచ్చిందని, కానీ 7 లక్షల టన్నులు రా రైస్‌మిల్లర్ల వద్ద ఉన్నదని, లక్ష టన్నులు బాయిల్డ్ రైస్ రూపంలో ఉన్నదని, దీనికి కూడా మినహాయింపు ఇవ్వాలని లేఖలో ఉత్తమ్ విజ్ఞప్తిచేశారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో బాయిల్డ్ రైస్ మాత్రమే సరఫరా చేయాలనే నిబంధనపై అభ్యంతరం వ్యక్తంచేశారు. వానాకాలం సీజన్‌లో ఉత్పత్తి అయ్యే ధాన్యం ముడిబియ్యం తయారీకి అనుకూలమని అందుకే రా రైస్, బాయిల్డ్ రైస్ రెండింటికి అనుమతివ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. బాయిల్డ్‌రైస్ లక్ష్యాన్ని యాసంగి సీజన్‌కు మార్చాలని కోరారు. ఎఫ్‌సీఐ బియ్యాన్ని కిలోకు రూ.24 చొప్పున ఓపెన్ మార్కెట్ సేల్‌లో విడుదల చేయటంతో రైతులకు కిలోకు రూ.16 నుంచి రూ.17 చొప్పున మాత్రమే ధర వస్తోందని, ప్రైవేటు కొనుగోలుదారులు కూడా నిరుత్సాహపడుతున్నారని ఉత్తమ్ తెలిపారు. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధరకు వీలైనంత ఎక్కువ ధాన్యం కొనుగోలుచేయాలని కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. అందుకే ఈ ఖరీఫ్‌లో 45-50 లక్షల టన్నుల సన్నధాన్యం, 30-35 లక్షల టన్నుల దొడ్డు ధాన్యం సేకరించేందుకు ప్రణాళిక తయారుచేసినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ తగ్గిస్తే తెలంగాణ రైతులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు.

పరిశోధనల అభివృద్ధి కోసం..
ఐఐటీహెచ్‌తో ఆటా ఒప్పందం

కంది, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పరిశోధనల అభివృద్ధి కోసం ఆటా(ఆల్ అమెరికా తెలుగు అసోసియేషన్)తో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ ఒప్పందం చేసుకుంది. వాషింగ్టన్ డీసీలో జరిగిన కార్యక్రమంలో ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్. మూర్తిలు ఈ మేరకు ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో అమెరికాలోని తెలుగు విద్యార్థులకు గ్లోబల్ ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయి. ఇంజనీరింగ్‌లో దేశంలోనే 7వ ర్యాంక్, ఆవిష్కరణలలో 6వ ర్యాంక్ సాధించిన ఐఐటీ హైదరాబాద్‌తో ఈ కీలక ఒప్పందం చేసుకోవడం తమకు గర్వకారణమని జయంత్ చల్లా పేర్కొన్నారు. ఈ ఒప్పందం మూడు సంవత్సరాల పాటు ఉంటుందని, అమెరికాలోని తెలుగు విద్యార్థులకు ఐఐటీహెచ్ క్యాంపస్‌లో ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ప్రభుత్వ ఆఫీసుల నుంచి..
వాటర్ బోర్డుకు రూ.2 వేల కోట్ల బకాయిలు

- ఆ నీటి పన్నులు కట్టాలని ఆదేశాలివ్వండి
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎఫ్‌జీజీ అధ్యక్షుడి లేఖ

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు హైదరాబాద్ వాటర్ బోర్డుకు బకాయిపడిన నీటి పన్నును చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. వాటర్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.1,764.18 కోట్లు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు రూ.250.23 కోట్ల నీటి పన్ను బకాయి పడినట్లు ఆర్టీఐ ద్వారా తెలిసిందని పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. ఇలాంటి బిల్లులు సకాలంలో వసూలు కాకపోవడంతో వాటర్ బోర్డు సామాన్య ప్రజలకు అందించే సేవలపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ దృష్ట్యా వాటర్ బోర్డుకు ప్రభుత్వ కార్యాలయాలు బకాయిలను చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని సీఎంను కోరారు. కాగా, మిషన్ భగీరథ సంస్థ నుంచి రూ.1,011.3 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ నుంచి రూ.377.29కోట్లు, ఆరోగ్య శాఖ నుంచి రూ.109.69 కోట్లు, గృహ నిర్మాణ శాఖ నుంచి రూ.57.55 కోట్లు, మునిసిపల్ శాఖ నుంచి రూ.33.05కోట్లు, పోలీసు శాఖ నుంచి రూ.40.86కోట్లు, సాధారణ పరిపాలన శాఖ నుంచి రూ.25.02కోట్లు, ఆర్‌అండ్‌బీ నుంచి రూ.17.71కోట్లు, విద్యాశాఖ నుంచి రూ.19కోట్లు, యూనివర్సిటీలు, ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలు, శివారు మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు తదితర ప్రభుత్వ సంస్థల నుంచి వాటర్ బోర్డుకు రూ.1764.18కోట్లు రావాల్సి ఉంది.

85% మేనేజ్‌మెంట్ కోటా సీట్లు
స్థానికులకే కేటాయించాలి: జూడాలు

తెలంగాణ ప్రయివేట్ మెడికల్ కళాశాలల్లోని మేనేజ్‌మెంట్ కోటా (ఎంక్యూ-1 లేదా బీ కేటగిరి) పోస్ట్‌గ్రాడ్యుయేట్ సీట్ల కేటాయింపులో స్థానికులకు అన్యాయం జరుగుతోందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రయివేట్ మెడికల్ కళాశాలల్లోని 25 శాతం ఎంక్యూ సీట్లు దేశవ్యాప్తంగా అందరికీ ఓపెన్‌గా ఉంచారని, స్థానికుల కోసం ఏ రిజర్వేషన్ లేదని తెలిపింది. ఏపీలో 85 శాతం ఎంక్యూ సీట్లు స్థానికులకు కేటాయిస్తే, కేవలం 15శాతం సీట్లే నాన్ లోకల్ అభ్యర్థులకు కేటాయించారని గుర్తు చేసింది. తక్షణమే ప్రభుత్వ ఉత్తర్వులను సవరించి, ఏపీ మాదిరిగా మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు స్థానికులకే దక్కేలా జీవో ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు లేఖ రాసింది.

సాధారణం 740 మి.మీ.

నైరుతిలోనే 988!



నాగార్జునసాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఇంజనీర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న సీఈ మంగేశ్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

సీజన్ మొదలవుతుంది. కానీ, ఈ నాలుగు నెలల్లో వర్షించి.. ఆ తర్వాత వెనుదిరిగే నైరుతి రుతుపవనాలు మాత్రం ఇంకా నిష్క్రమించలేదు. ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో నైరుతి నిష్క్రమణ ప్రారంభమైంది. ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ దక్షిణాదికి, తెలంగాణకు వచ్చేసరికి మరో 15 రోజులు పట్టే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. బంగాళాఖాతంలో బుధవారం మరో వాయుగుండం ఏర్పడనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అక్టోబరు 2 నాటికి వాయుగుండంగా మారి, 3న తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. ఇక రాష్ట్రంలో బుధ, గురువారాల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఈ నెల 3, 4, 5 తేదీల్లో కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

విద్యుదుత్పత్తిలోనూ రికార్డులు..

ఈ ఏడాది వర్షపాతంలోనే కాకుండా.. జలవిద్యుత్ ఉత్పత్తిలోనూ రికార్డులు నమోదవుతున్నాయి. రిజర్వాయర్ల వద్ద ఉన్న జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి పరుగులు పెడుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అత్యధికంగా 2022-23 సంవత్సరంలో రికార్డుస్థాయిలో 6,831 మిలియన్ యూనిట్ల జలవిద్యుత్ ఉత్పత్తి జరగగా.. ఈ ఏడాది (2025-26లో) ఆ రికార్డు బద్దలయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జూలై 29 నుంచి సెప్టెంబరు 29 నాటికి రెండు నెలల వ్యవధిలోనే 4,062 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే ఈ అంచనాలకు కారణం. కేవలం నాగార్జునసాగర్‌లోనే రెండు నెలల్లో 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం గమనార్హం. వాస్తవానికి సాగర్‌లో ఈ ఏడాది మొత్తం 1450 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, కేవలం రెండు నెలల్లోనే (సెప్టెంబరు 30 నాటికే) లక్ష్యాన్ని చేరుకున్నారు. దీంతో అధికారులు, ఇంజనీర్లు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎగువ నుంచి వరద రాక మరో రెండు నెలలు ఇలాగే కొనసాగితే ఈ ఏడాది 3వేల మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తామని జెన్‌కో సీఈ మంగేశ్‌కుమార్ తెలిపారు. సాగర్ చరిత్రలో 2019-20 నుంచి ఈ ఏడాది వరకు 2022-23లో ఉత్పత్తి చేసిన 2355.63 మిలియన్ యూనిట్లే అత్యధికం కావడం గమనార్హం.

12 ఏళ్లుగా జలవిద్యుత్ ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	విద్యుదుత్పత్తి (మిలియన్ యూనిట్లలో)
2014-15	3128.4
2015-16	285
2016-17	1300.7
2017-18	1517.9
2018-19	1753
2019-20	4509
2020-21	3667
2021-22	5655
2022-23	6831
2023-24	1257.64
2024-25	5294
2025-26	4062

దేశంలో 8 శాతం అధిక వర్షపాతం

విశాఖపట్నం, సెప్టెంబరు 30: దేశంలో నాలుగు నెలల నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే 8 శాతం అదనంగా వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ సీజన్‌లో మేఘ విస్ఫోటనాలు(క్లౌడ్ బరస్ట్), కొండచరియలు, మట్టిపెళ్లలు పడిన ఘటనలు సహా అనేక విపత్తులు ఎదురైనప్పటికీ ఇది 'చాలా విజయవంతమైన రుతుపవనాల సీజన్' అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర అన్నారు. భారతదేశ సాధారణ వర్షపాతం 868.6 మిల్లీమీటర్లు కాగా, 937.2 మిల్లీమీటర్లు వర్షాలు పడ్డాయని తెలిపారు. దక్షిణ భారతంలో సాధారణం కంటే 9.9 శాతం అధిక వర్షపాతం నమోదైందన్నారు. తూర్పు, ఈశాన్య భారతంలో మాత్రం సాధారణ వర్షపాతం 1367.3 మి.మీ. కాగా, 1089.9 మి.మీ.(20 శాతం లోటు) వర్షపాతం నమోదైందని పేర్కొన్నారు.

వంద శాతం పంటల సాగు

ఈ వానాకాలంలో పంటల సాగు వంద శాతం పూర్తయింది. రాష్ట్రంలో సాధారణ సాగు విస్తీర్ణం 1,32,44,305 ఎకరాలు కాగా... ఇప్పటివరకు 1,33,09,765 ఎకరాల్లో పంటలు సాగుచేసినట్లు వ్యవసాయశాఖ నివేదికలో వెల్లడించింది. సుమారు 133.10 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగుచేయటం ద్వారా సాధారణం కంటే 0.5 శాతం విస్తీర్ణం ఈసారి పెరిగింది. ప్రధాన పంటలైన వరి 67.31 లక్షల ఎకరాల్లో, పత్తి 45.95 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 6.45 లక్షలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. మిగిలిన విస్తీర్ణంలో పప్పు ధాన్యాలు, నూనె గింజలు, ఇతర పంటలు సాగుచేశారు. నిరుడు ఖరీఫ్‌లో 129 లక్షల ఎకరాల్లో మాత్రమే రైతులు పంటలు సాగుచేసినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇక ఖరీఫ్ కొనుగోళ్ల సీజన్ అక్టోబరు 1 నుంచి ప్రారంభమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ కూడా దేశవ్యాప్తంగా అక్టోబరు నుంచే శ్రీకారం చుడుతుంది. ధాన్యం సేకరించే ఎఫ్‌సీఐ అయినా, పత్తి కొనుగోళ్లు చేసే సీసీఐ అయినా... రాష్ట్రంలో వరి, పత్తి కాకుండా మొక్క జొన్న, జొన్న, సోయాబీన్ లాంటి ఇతర పంటలను కొనుగోలుచేసే మార్క్‌ఫెడ్ కూడా అక్టోబరు నుంచి ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభిస్తాయి. అయితే నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ముందస్తుగా ధాన్యం వస్తే... కొనుగోలు కేంద్రాలు తెరవాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. ధాన్యం సేకరణకు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. అయితే, పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఇంకా స్పష్టత రాలేదు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ ప్రారంభం అవుతున్నా.. ఎప్పుడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామనే విషయాన్ని సీసీఐ వెల్లడించలేదు. జాబ్ వర్క్ కోసం సీసీఐ పిలిచిన టెండర్లలో కూడా జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లర్లు పాల్గొనలేదు. ఈ అంశంపై రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా దృష్టిసారించారు. పత్తి కొనుగోళ్లపై కొద్ది రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.


పర్యాటకులతో వెళ్తున్న సఫారీ వాహనం (ఫైల్)

నల్లమలను చూసొద్దాం రండి

- నేటి నుంచి పునఃప్రారంభం కానున్న టైగర్ సఫారీ
- ఒక్కో వాహనంలో ఏడుగురు ప్రయాణికులు
- ఆఫ్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం

మన్ననూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే రెండో అతి పెద్దదైన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)లో బుధవారం నుంచి టైగర్ సఫారీ పునఃప్రారంభం కానుంది. పెద్ద పులులతో పాటు ఇతర వన్యప్రాణుల సంతానోత్పత్తిని దృష్టిలో ఉంచుకుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు 3 నెలల పాటు నల్లమల అడవిలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించారు. ఈ నిషేధ సమయం ముగియడంతో సఫారీ సేవలు తిరిగి ప్రారంభం అవుతున్నాయి. ఈ సంవత్సరం ఆఫ్‌లైన్ సేవలను అటవీ శాఖ నిర్వహిస్తుండగా, ఆన్‌లైన్ సేవలను ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ)కు అప్పగించారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా అమ్రాబాద్ టైగర్ స్టే పేరిట కాటేజీలలో బస సౌకర్యం కల్పిస్తారు. పర్యాటక వన మాలికలోని కాటేజీల అప్‌గ్రేడ్ పనులు పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ బుకింగ్ సేవలు ప్రారంభం కానున్నాయి.

సఫారీ ధరల పెంపు

ఈ ఏడాది టైగర్ సఫారీలో ట్రిప్‌ల వారీగా ధరలను పెంచారు. ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూపాయింట్ వరకు వెళ్లి తిరిగి చౌరస్తాకు రావడానికి (18 కి.మీ) రూ.3000 చెల్లించాల్సి ఉంటుంది. మరో ట్రిప్‌లో ఫర్హాబాద్ చౌరస్తా నుంచి వ్యూపాయింట్ మీదుగా గుండం అటవీ మార్గంలో తిరిగి రావడానికి (28 కి.మీ) రూ.5000 రుసుము నిర్ణయించారు. ఒక్కో సఫారీ వాహనంలో ఏడుగురు పర్యాటకులకు అనుమతి ఉంటుంది. వాహనంలో డ్రైవర్‌తో పాటు, ఒక నేచర్ గైడ్ ఉంటారు.

దేవాదుల మూడో దశలో
ఆరో ప్యాకేజీ అంచనాల సవరణ

హైదరాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవాదుల ఎత్తిపోతల పథకం మూడో దశలోని ఆరో ప్యాకేజీ అంచనాలను సవరిస్తూ ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతిని ఇచ్చింది. ఈ కాంపొనెంట్‌లో కొత్త అదనపు పనులు చేరడంతో అంచనాలను 1001 కోట్లకు సవరిస్తూ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో జారీ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.